ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 15.07.2026 | సంపుటి :12 సంచిక : 356 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370






CBSE

## మూడో భాషపై పరీక్షలు ఉండవు

- 9, 10 తరగతులకు ఇంటర్నల్ అసెస్‌మెంటే ఉంటుంది
- బోర్డు పరీక్షలపై సీబీఎస్‌ఈ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ(జనంసాక్షి): బోర్డు పరీక్షలపై సీబీఎస్‌ఈ కీలక నిర్ణయం తీసుకుంది. మూడో భాషపై స్పష్టమైన విధివిధానాలు జారీ చేసింది. ఇకపై 9, 10 తరగతులకు మూడో భాష పరీక్షకు ఇంటర్నల్ అసెస్‌మెంటే ఉంటుందని, ఈ సబ్జెక్ట్‌కు పరీక్షలు ఉండబోవని తెలిపింది. 2026-27లో 9వ తరగతిలో చేరే విద్యార్థులు 3 భాషలు చదవాలని, వాటిలో 2 భారతీయ భాషలు ఉండాలని నిబంధన మిగతా 9లో..

## హాఫీజ్ సయీద్‌కు నాన్‌బెయిలబుల్ వారెంట్

పహల్గామ్ ఉగ్రదాడి కేసులో జారీ చేసిన ఎన్ఐఏ కోర్టు 2లో..

కేంద్రం హామీ

## రెండేళ్లలో వరంగల్ విమానాశ్రయాన్ని పూర్తిచేస్తాం

కాకతీయ సంస్కృతి ఉట్టిపడేలా నిర్మిస్తాం : సీఎం రేవంత్

- అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విమానాశ్రయాల నిర్మాణం
- ఎంఆర్‌వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలి
- ఆదిలాబాద్‌కు అవసరమైన భూ సేకరణచేపడతాం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటి



న్యూఢిల్లీ,జూలై14(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలో నిర్మించనున్నవరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతోనిర్మించాలని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వ్యూహాత్మకంగా, వాణిజ్య పరంగా వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు ఉన్న మెరుగైన పరిస్థితులను సీఎం వివరించారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి ఢిల్లీలోని పౌరవిమానయాన శాఖ కార్యాలయం లోమంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగావరంగల్ విమానాశ్రయ పనులపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. మిగతా 2లో..

## ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం పనులు ప్రారంభించాలి

- దక్షిణ ప్రాంతానికి త్వరగా అనుమతులివ్వండి
- ఫ్యూచర్ సిటీ-బందరు పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి కూడా..
- రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయ రహదారి నిర్మించాలి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

2లో..

## ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్

నేడు శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్

దివిటిపల్లిలో అమర్ రాజా బ్యాటరీ సెంటర్ ప్రారంభోత్సవం

## హెచ్ఎండీఏలో అవినీతి తిమింగలం



ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సీఈ బచ్చు రవీందర్‌ను అరెస్ట్ చేసిన ఏసీబీ.. భారీగా స్థిరాస్తుల, బంగారం డబ్బు గుర్తింపు

హైదరాబాద్,జూలై14(జనంసాక్షి): హైదరాబాద్ నగరంలో మరోసారి ఏసీబీ సోదాల కలకలం రేగింది. హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బచ్చు రవీందర్ ఇల్లు, కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి సోదాలు కొనసాగాయి. బచ్చు రవీందర్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు అయిన నేపథ్యంలో ఏసీబీ దాడులు నిర్వహిస్తోంది. అక్రమంగా ఆస్తులను కూడబెట్టినట్టు చీఫ్ ఇంజినీర్‌పై ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఏకకాలంలో 12 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలకు దిగారు. ఏసీబీ డీఎస్పీ మాజిద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో సోదాలు కొనసాగాయి. ఇప్పటికే రవీందర్ నివాసంలో పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆస్తుల పత్రా లతోపాటు, వివిధ ప్రాం తాల్లో ఇళ్ల స్థలాలను అధికారులు గుర్తించారు. రవీందర్ నివాసంలో బ్యాంకు లాకర్లను గుర్తిం చినట్లు సమాచారం. ఈరోజు సాయంత్రం వరకు సోదాలు కొనసాగాయని తెలుస్తోంది. హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బచ్చు రవీందర్ నివాసంలో సోదాలు ముగిశాయని ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీ ఖాన్ వెల్లడించారు. ఈ సోదాల్లో అతని వద్ద ఆదాయానికి మించిన అక్రమ ఆస్తులు భారీగా గుర్తించినట్లు తెలిపారు. సోదాల అనంతరం ఆయన మాట్లాడారు. సుమధుర అక్రోపోలిస్‌లో 3 ప్లాట్, శ్రీవారి మెడోస్‌లో మరో ప్లాట్ ఉన్నట్లు గుర్తించామని అన్నారు. వాసవి అట్లాంటిస్‌లో ఏకంగా మూడు ప్లాట్లు కొనుగోలు చేసినట్లు కనుగొన్నామని చెప్పారు. మసీద్ బండలో నాలుగు అంతస్తుల భారీ భవనం, జడ్చర్లలో 7 ప్లాట్లు, మిగతా 2లో..

## ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఎంపిక

కేంద్రమంత్రి మన్సూఖ్ మాండవియాకు మంత్రుల కృతజ్ఞతలు 9లో..

## మెట్టపంటలే మేలు

ఎల్‌నినో పరిస్థితుల్లో రైతులు ఈ దిశగా ప్రణాళిక వేసుకోవాలి


వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచన



హైదరాబాద్,జూలై14(జనంసాక్షి): ఎల్‌నినో పరిస్థితుల్లో మెట్టపంటలే మేలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.రైతు నేస్తం' కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ పాల్గొని ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. రైతులతో నేరుగా మాట్లాడి వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసు కున్నారు. ఈ ఏడాది తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా వర్షపాతం తక్కువగా నమోదవుతోందన్నారు. దీంతో కృష్ణా, గోదావరి ఆయకట్టు ప్రాంతాల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలని సూచిం చారు. భూగర్భ జలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు సరైన సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖ, నీటిపారుదల శాఖ, భూగర్భ జలాల శాఖ, భారత వాతావరణ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వాలని చెప్పారు. వర్షపాతం తక్కువగా ఉన్నందున జొన్న, సజ్జ, కొర్ర, పెసర, మినుము, కంది వంటి తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని మంత్రి సూచించారు. అలాగే శాస్త్రవేత్తలు సూచించిన విధంగా తక్కువ కాలంలో పండే, తక్కువ నీరు అవసరమయ్యే అధిక దిగుబడి పంట రకాలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఐఐఎంఆర్ డైరెక్టర్ మాట్లాడుతూ కొర్ర, సజ్జ, జొన్న వంటి చిరుధాన్యాల సాగును పెంచాలని రైతులకు సూచించారు. భారత వాతావరణ శాఖ, హైదరాబాద్ సంచాలకురాలు స్టెల్లా మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఇప్పటివరకు సాధారణం మిగతా 2లో..

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కీలక పురోగతి

## వెట్‌రన్ సక్సెస్



పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులోని ఎత్తిపోతలలో భాగంగా తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు నార్లాపూర్ పంప్ హౌస్ మోటర్ల ఆన్‌చేయడంతో దిగువకు ఉప్పొంగుతున్న కృష్ణాజలాలు

- మొదటి లిఫ్ట్‌లో విజవంతంగా నడిచిన మోటార్
- దీంతో నార్లాపూర్ రిజర్వాయర్‌కు కృష్ణా జలాలను ఎత్తిపోసే ప్రక్రియకు లైన్ క్లియర్

నాగర్‌కర్నూల్(జనంసాక్షి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కీలక పురోగతి నమోదైంది. 22 నెలల తర్వాత నార్లాపూర్ తొలి లిఫ్ట్‌లో మొదటి పంపు వెట్‌రన్ విజయవం తమైంది. 2 రోజులుగా ఎదురైన సాంకేతిక సమస్యలను పరిష్కరించడంతో పంపు సక్సెస్‌ఫుల్‌గా పనిచేసింది. మొత్తం మిగతా 2లో..

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్ఐజీ ఇళ్లకు శ్రీకారం

- దశల వారీగా లక్ష ఇళ్లు నిర్మిస్తాం
- 20న విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తులు ప్రకటన
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ కోర్ అర్బన్ పరిధిలో ఎల్ఐజీ ఫ్లాట్ల పథకానికి ఈ నెల 20న శ్రీకారం చుట్టనున్నట్లు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలోనే దశల వారీగా లక్ష ఎల్ఐజీ ఇళ్లు నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. క్యూర్ పరిధిలో ఎల్ఐజీ ఇళ్ల పథకంపై హౌసింగ్ బోర్డు అధికారులతో పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు.మూడు రోజుల్లో ప్రకటిస్తాం : ఈ నెల 20న పథకం పేరు, లోగో, అర్హతలు, దరఖాస్తులు, అమలు విధానం, మార్గదర్శకాలను ప్రకటించనున్నట్లు మంత్రి తెలిపారు. తొలి విడతలో క్యూర్ పరిధిలోని ప్రతీ నియోజకవర్గంలో 500 నుంచి వెయ్యి ఎల్ఐజీ ఫ్లాట్లు నిర్మించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే స్థలాలు గుర్తించి హౌసింగ్ బోర్డు పొజిషన్‌లోకి తీసుకుందని పొంగులేటి తెలిపారు. ఫ్లాట్ల విస్తీర్ణం, డిజైన్, ఎక్కడ ఎన్ని నిర్మించాలనే విషయాలపై సీఎంతో చర్చించి మూడు రోజుల్లో ప్రకటిస్తామని మంత్రి ప్రకటించారు.ప్రభుత్వ స్థలాల్లో మిగతా 2లో..



## నత్తనడకన 'సర్'

గడువు పొడిగించాలి:మంత్రి పొన్నం

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు పొడిగించాలని కాంగ్రెస్ నేతలు కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, డీసీసీ అధ్యక్షులు సీఈవో సుదర్శన్‌రెడ్డిని కలిశారు. హైదరాబాద్ జిల్లాలోని 15వ శాసనసభ నియోజకవర్గాల్లో నత్తనడకన సాగుతోందని సుమారు 20 శాతమే పూర్తయిందని హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బీఎల్‌ఓలు ఇళ్లకు రావడం లేదని నింపిన ఫారాలు కూడా తీసుకెళ్లడం లేదని మంత్రి, కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే,నేడు తెలంగాణ వ్యాప్తంగా హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా 15 శాసనసభ నియోజక వర్గాల్లో మిగతా 2లో..

## ఎన్యూమరేషన్ ఫారాలను త్వరగా అందజేయండి

ఓటర్లకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి సూచన 2లో..

## పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు

- ఇరాన్ అణు కేంద్రం సమీపంలో అమెరికా దాడులు..
- హర్మూజ్‌లో ట్యాంకర్లపై ఇరాన్ దాడి.. భారతీయుడి మృతి
- ఘటనపై మండిపడ్డ భారత్.. ఉపదౌత్యవేత్తకు సమన్లు
- పర్షియన్ గల్ఫ్‌లో నిలిచిన ఏడు భారత నౌకలు




టెహ్రాన్(జనంసాక్షి): సోమవారం రాత్రి ఇరాన్‌లోని జస్క్, బుషెహర్, కొనారక్, అబు మూసా, బందర్ అబ్బాస్‌లోని లక్ష్యాలపై దాడులు చేశామని అమెరికా మిలిటరీ ప్రకటించింది. దీంతో వాణిజ్యనౌకలపై ఇరాన్ దాడులు చేసే సామర్థ్యం మరింత దెబ్బతిన్నదని వెల్లడించింది. బుషెహర్‌లో అణువిద్యుత్ కేంద్రం ఉంది. రష్యా సహకారంతో ఇది పనిచేస్తోంది. మరోవైపు, యూఏఈ ట్యాంకర్లపై చేసిన దాడులను ఇరాన్ ధ్రువీకరించింది. తమ హెచ్చరికలను పట్టించుకోకపోవడం వల్లే టార్గెట్ చేశామని వెల్లడించింది. అలాగే బహ్రెయిన్‌లోని యూఎస్ ఫిఫ్త్ ఫ్లీట్‌ను లక్ష్యంగా చేసుకున్నామని, ప్రతీకార చర్య కొనసాగుతోందని ప్రకటించింది.

**హర్మూజ్‌లో ట్యాంకర్లపై ఇరాన్ దాడి.. భారతీయుడి మృతి**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి ప్రపంచ దేశాలను వణికిస్తున్నాయి. ఈ ఘర్షణలు తీవ్రరూపం మిగతా 2లో..

## ఇరాన్‌పై మళ్లీ యుద్ధాన్ని ప్రారంభించాం

- 60 రోజులపాటు కొనసాగుతుంది
- అమెరికా కాంగ్రెస్‌కు నోటిఫై చేసిన ట్రంప్
- హర్మూజ్‌లో టోల్‌పై వెనక్కి తగ్గిన అమెరికా అధ్యక్షుడు



వాషింగ్టన్(జనంసాక్షి): పశ్చిమాసియా మరోసారి దద్దరిల్లుతోంది. ఇరాన్ లక్ష్యంగా అమెరికా మరో 60 రోజులు దాడులు చేయనున్నట్లు తెలుస్తోంది. ఆ దేశంపై అమెరికా బలగాలు మళ్లీ యుద్ధాన్ని ప్రారంభించాయని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికా పార్లమెంట్ (కాంగ్రెస్)కు తెలియజేశారు. ఈ మేరకు వార్ పవర్స్ నోటీసు ఇచ్చారు. జులై 7న యుద్ధం ప్రారంభ తేదీగా అందులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. "అమెరికా ప్రజలను, జాతీయ భద్రత, విదేశాంగ విధాన ప్రయోజనాలను పరిరక్షించడం నా బాధ్యత. దానికి అనుగుణంగానే సైనిక చర్యకు మిగతా 2లో..

## మిన్నంటిన ఆందోళనలు

పీవోకేలో అంతకంతకూ పెరుగుతున్న ఉద్రిక్తత

ఘర్షణల్లో ఆరుగురు మృతి

శ్రీనగర్(జనంసాక్షి):పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఆందోళన చేస్తున్న నిరసనకారులపై పాక్ పోలీసులు, రేంజర్లు కాల్పులకు దిగడంతో ఆరుగురు మృతి చెందగా.. పదుల సంఖ్యలో ఆందోళనకారులు గాయలపాలయ్యారు. కొంత కాలంగా పీవోకేలో ఇంటర్నెట్ నిలిపివేయడంతో దాదాపు 40లక్షల మంది ప్రజలకు బయటి ప్రపంచంతో సంబంధాలు మిగతా 9లో..



## హెచ్‌ఎండీఏలో అవినీతి తిమింగలం

కొండాపూర్‌లో రెండు ప్లాట్లు ఉన్నాయని వివరించారు. శంషాబాద్, షాబాద్ పరిధిలో 4 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నట్లు తమకు ఆధారాలు లభ్యమయ్యాయని పేర్కొన్నారు. సోదాల్లో అర కిలో బంగారం, వెండి వస్తువులతో పాటు రూ.10 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ సీజ్ చేశామని అన్నారు. అలాగే బచ్చు రవీందర్ పేరిట ఉన్న 4 బ్యాంక్ లాకర్లను గుర్తించి.. వాటిని ఫ్రీజ్ చేసినట్లు స్పష్టం చేశారు. ఆస్తులతో పాటు ఇంట్లో నిబంధనలకు విరుద్ధంగా దాచి ఉంచిన 18 విదేశీ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీఖాన్ వెల్లడించారు.

## పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు

దాల్చి మళ్లీ పూర్తిస్థాయి యుద్ధంగా మారుతుందా..? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే కొన్నిరోజులుగా అమెరికా-ఇరాన్ పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. తాజాగా రెండు యూఏఈ ట్యాంకర్లపై ఇరాన్ దాడి చేయడంతో భారత సిబ్బంది ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఒమన్ తీరం సమీపంలో జరిగిన ఈ దాడిలో మరో ఆరుగురు భారతీయులు, ఇద్దరు ఉక్రెయిన్ జాతీయులు కూడా గాయపడ్డారు. ఈ మేరకు యూఏఈ రక్షణశాఖ ప్రకటించింది. ఈ దాడిని యూఏఈ తీవ్రంగా ఖండించింది. ఇది అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనేనని ఆగ్రహం వ్యక్తంచేసింది. దీనికి ప్రతిస్పందించే హక్కు తమకు ఉందని హెచ్చరించింది. తమ సార్వభౌమత్వం, భద్రతను పరిరక్షించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకొంటామని తేల్చిచెప్పింది. ఎలాంటి ముప్పునైనా ఎదుర్కోవడానికి, ప్రాంతీయ స్థిరత్వాన్ని దెబ్బతీసే చర్యలకు తగినవిధంగా ప్రతిస్పందించేందుకు యూఏఈ పూర్తి సంసిద్ధంగా ఉందని స్పష్టం చేసింది. హర్మూజ్‌లో ప్రయాణిస్తున్న నౌకలపై కొన్నిరోజుల క్రితం ఇరాన్ దాడి చేయడంతో ఈ ఘర్షణలు మొదలయ్యాయి. దాంతో ఇరాన్‌లో అమెరికా దాడులు.. అందుకు ప్రతిగా గల్ఫ్‌లోని అగ్రరాజ్య సైనిక స్థావరాలను ఇరాన్ టార్గెట్ చేయడంతో హర్మూజ్ జలసంధి మరోసారి ఘర్షణలకు కేంద్రబిందువైంది. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన సంచలనం సృష్టిస్తోంది. హర్మూజ్‌లో ప్రయాణించే నౌకల నుంచి.. వాటిలోని సరకు విలువలో 20% టోల్ వసూలు చేస్తామని ప్రకటించారు. హర్మూజ్ విషయంలో అమెరికా జోక్యాన్ని సహించబోమని, నౌకల రాకపోకలకు అంతరాయం కలిగిస్తే బలప్రయోగానికి దిగుతామని ఇరాన్ హెచ్చరించింది.

**హర్మూజ్‌పై దాడిలో భారతీయుడి మృతి..**
**ఇరాన్ ఉప దౌత్యవేత్తకు భారత్ సమన్లు**

హర్మూజ్ జలసంధిలో యూఏఈ జెండాతో వెళ్తున్న రెండు ట్యాంకర్లపై ఇరాన్ క్షిపణి దాడుల్లో భారత సిబ్బంది ఒకరు ప్రాణాలు కోల్పోగా.. మరో ఆరుగురు గాయపడ్డారు. ఈ దాడుల్ని తీవ్రంగా ఖండించిన భారత్.. దిల్లీలోని ఇరాన్ ఉప దౌత్యవేత్త మహమ్మద్ జావాద్ హుస్సేనీకి సమన్లు జారీ చేసింది.పశ్చిమాసియా సముద్ర జలాల్లో వాణిజ్య నౌకాయానానికి పెరుగుతున్న ముప్పుపై భారత విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. శనివారం రాత్రి హర్మూజ్‌లో ఓ నౌకపై ఇరాన్ చేసిన దాడిలో ఓ భారతీయుడు గల్లంతవ్వడం.. తాజాగా మరో దాడిలో భారత సిబ్బందిలో ఒకరు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని పేర్కొంది. జలసంధిలో ఉద్రిక్తతలను తక్షణమే తగ్గించాలని.. యుద్ధం ముగింపు కోసం అమెరికాతో చర్చలు కొనసాగించాలని టెహ్రాన్‌కు సూచించింది. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం నెలకొనాలని కోరుకుంటున్నట్లు తెలిపింది. అంతర్జాతీయ చట్టాలాకు అనుగుణంగా హర్మూజ్‌లో స్వేచ్ఛాయుత నౌకాయానాన్ని వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని కోరింది. ఇదీ చదవండి: మొన్న వాన్‌డైక్.. నేడు బ్రౌన్: భారత్‌లో యూస్ మాజీ సైనికుల చొరబాటు
పర్షియన్ గల్ఫ్‌లో నిలిచిన ఏడు భారత నౌకలు
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రరూపం దాల్చాయి. అమెరికా-ఇరాన్‌ల మధ్య మళ్లీ ఘర్షణలు మొదలవడంతో హర్మూజ్ జలసంధి వద్ద ఆందోళనకర వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో భారత్ జెండాతో ఉన్న ఏడు నౌకలు జలసంధి వద్ద నిలిచిపోయినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుతం జలసంధి వద్ద ప్రతికూల పరిస్థితులు నెలకొనడంతో జలసంధిని దాటే పరిస్థితి లేదని తెలిపింది. అయితే, ఆయా నౌకల్లో ఏ సరకు ఉందో, ఎక్కడికీ చేరుతాయోనన్న వివరాలు మాత్రం వెల్లడించలేదు."పర్షియన్ గల్ఫ్‌లో భారత్ జెండాలు ఉన్న ఏడు నౌకలు చిక్కుకున్నాయి. అందులో 148 మంది నావికులు ఉన్నారు. ప్రస్తుతం వారు సురక్షితంగానే ఉన్నారు. అక్కడ నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల దృష్ట్యా వారు ఇప్పుడే బయటకు రాలేరు." అని కేంద్రం ఓ ప్రకటనలో పేర్కొంది. మరోవైపు, సైప్రస్ జెండాతో వెళ్తున్న నౌకపై ఇరాన్ దాడి చేసిన విషయం తెలిసిందే. అనంతరం మరో రెండు నౌకలపై కూడా ఇరాన్ దాడి చేసినట్లు తెలుస్తోంది. ఇందులో ఓ భారతీయుడు మృతిచెందినట్లు అధికారులు ధ్రువీకరించారు.

## ఇరాన్‌పై మళ్లీ యుద్ధాన్ని ప్రారంభించాం

ఆదేశించాను" అని ట్రంప్ ఆ నోటీసులో పేర్కొన్నారు.అమెరికా నిబంధనల ప్రకారం.. యుద్ధాన్ని ప్రకటించే అధికారం కేవలం అగ్రరాజ్య పార్లమెంట్ (కాంగ్రెస్)కు మాత్రమే ఉంది. అధ్యక్షుడికి లేదు. అందుకే... అమెరికా అధ్యక్షులు ఏ దేశంపై పోరుకు వెళ్లినా తాము సైనిక చర్య చేపట్టాం అని చెప్తుంటారు. అమెరికన్ కాంగ్రెస్ ఆమోదం పొందకుండా సైన్యాన్ని అలా వాడటానికి వారికున్న గరిష్ఠ గడువు 60 రోజులే. మామూలుగా శత్రు భూభాగంలోకి తమ సైనిక దళాలను పంపిన 48 గంటల్లోగా కాంగ్రెస్‌కు ఆ విషయాన్ని అధ్యక్షుడు తెలపాలి. 60 రోజుల్లోగా కాంగ్రెస్ ఆమోదం తెలపాల్సి ఉంటుంది. లేదంటే ఆలోగా సైనిక చర్య ఆగిపోవాలి. యుద్ధాన్ని విరమించి సైనికులను సురక్షితంగా తెచ్చేందుకని చెప్పి మరో 30 రోజుల గడువు తీసుకోవచ్చు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించాయి. అప్పుడు 60 రోజుల డెడ్‌లైన్ మే ఒకటితో ముగిసింది. పలు దేశాల మధ్యవర్తిత్వంతో అమెరికా, ఇరాన్ అవగాహన ఒప్పందంపై సంతకం చేశాయి. దాంతో తొలిదఫాలో ప్రారంభించిన సైనిక చర్య అక్కడితో ఆగిపోయిందని ట్రంప్ ప్రభుత్వం చెప్పింది. తాజా ఘర్షణలతో కొత్తగా మళ్లీ సైనిక చర్యను ప్రారంభించేందుకు అవకాశం ఉందని సమర్థించుకుంటోంది. కానీ రాజ్యాంగ నిపుణులు ఈ వాదనను ఖండిస్తున్నారు. అనధికారిక, శాశ్వత యుద్ధాన్ని కొనసాగించేందుకు ఈ తాత్కాలిక దౌత్య విరామాలను ఒక ఎత్తుగడగా ఉపయోగించుకుంటున్నారని విమర్శిస్తున్నారు.

**హర్మూజ్‌లో 20శాతం టోల్.. వెనక్కి తగ్గిన ట్రంప్**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశ్చర్యకర ప్రకటన చేశారు. 20శాతం టోల్ విధిస్తున్నట్లు చేసిన ప్రకటనను ఉపసంహరించుకున్నట్లు వెల్లడించారు. దీనికి బదులుగా గల్ఫ్ దేశాలు అమెరికాతో కుదుర్చుకోబోయే భారీ పెట్టుబడులు, వాణిజ్య ఒప్పందాల ద్వారా ఆ ఖర్చును భర్తీ చేయనున్నట్లు ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు.హర్మూజ్‌ను తమ అధీనంలోకి తీసుకుంటున్నట్లు సోమవారం ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. హర్మూజ్‌కు అమెరికా సంరక్షకుడిగా వ్యవహరిస్తుందని, ప్రతిగా దాని మీదుగా రవాణా సాగించిన నౌకలు రవాణా చేసే సరకులో 20శాతాన్ని టోల్‌గా చెల్లించాలని ట్రూత్ సోషల్ వేదికగా వెల్లడించారు.అయితే.. ట్రంప్ ప్రకటనపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హర్మూజ్ విషయంలో అమెరికా జోక్యాన్ని సహించబోమంది. ఆ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలకు అంతరాయం కలిగిస్తే బలప్రయోగానికి దిగుతామని హెచ్చరించింది. హర్మూజ్ తమ నియంత్రణలోనే ఉందని స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే ట్రంప్ తాజా ప్రకటన వచ్చింది.



కేంద్రం హామీ..

## రెండేళ్లలో వరంగల్ విమానాశ్రయం పూర్తిచేస్తాం

రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానమైఉండడం తో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఇతరపరిశ్రమలతోవరంగల్ కీలక కనగరంగాఉందని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో పారిశ్రామికంగా మరింతగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం తెలియజేశారు. ఉత్తరతెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండజిల్లాలకు కేంద్రంగా వరంగల్ ఉంటుందని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలోఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్), ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసినందున టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. 2028, జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగావరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లపై కేంద్ర మంత్రి, సీఎం చర్చించారు. వరంగల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నందున, కాకతీయ చరిత్ర, సంస్కృతికి అద్దంపట్టేలా డిజైన్లు ఉండాలనిభావిస్తున్నట్లు సీఎం తెలిపారు. అందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సుముఖత వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణశాఖ ఆధ్వర్యంలో ఎయిర్ పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయంనిర్మించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం విజ్ఞప్తి చేశారు. రెండు ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన భూమిని సేకరించి అందజేస్తామని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో మాదిరే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ లోనూ ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు నెలకొల్పాలన్నారు. వరంగల్, ఆదిలాబాద్ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణసంస్థలు (ఈ÷క్ష)నెలకొల్పాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సూచించారు. అందుకు అవసరమైనప్రతిపాదనలుసమర్పించాలని కేంద్ర మంత్రి సీఎంకు సూచించారు.
సమావేశంలోనల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వసలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీకె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీకోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్, పౌరవిమానయాన శాఖ సెక్రటరీ మురళీధర్మోహోల్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ విపిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలుఎన్నికల సమయానికే పరిమితం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశం అనంతరం సీఎం విలేకరులతో మాట్లాడారు. దేశాల అభివృద్ధిలో విమానాశ్రయాలుకీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన తెలిపారు.
తెలంగాణలోనూ విమానాశ్రయాల అభివృద్ధి ద్వారా యువతకు ఉద్యోగాల కల్పన, అభివృద్ధికి తాము పాటుపడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ అంశాల్లో తమకుసహకరిస్తుందని, ఎక్కడైనా సమస్యలుంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏవైనా సమాచార లోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని తెలిపారు. అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో కేంద్ర మంత్రులనుకలిసేందుకు ఢిల్లీకి వస్తున్నామని, దానిపైనా రాజకీయంగా విమర్శలు చేయడం తగదని సీఎం హితవుపలికారు.
విమానాశ్రయాలతోనే అనేక దేశాలు అభివృద్ధి చెందాయని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో విమానాశ్రయాల ఏర్పాటుకు రాష్ట్రాలు పోటీపడుతున్నాయని తెలిపారు. దేశంలో ఎక్కడాలేనంతత్వరగా తెలంగాణ ప్రభుత్వం విమానశ్రయానికి అవసరమైన భూ సేకరణ చేసి ఇచ్చి చరిత్రసృష్టించిందని ఆయన అభినందించారు. ఇంత త్వరగా స్పందించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కేంద్ర మంత్రి చెప్పారు. భూ సేకరణ, ఇతర అంశాల్లో దేశంలోని ఇతర రాష్ట్రాలు తెలంగాణ మాదిరేస్పందించాలని కేంద్రం మంత్రి సూచించారు. వరంగల్ సంస్కృతికి అద్దం పట్టేలావిమానాశ్రయ డిజైన్ ఉంటుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఓ ప్రశ్నకుసమాధానమిచ్చారు.



## ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్

హైదరాబాద్,జూలై14(జనంసాక్షి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో పర్యటించి పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు సీఎం రేవంత్ భూమిపూజ చేయనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమరరాజా సెల్ తయారీ యూనిట్‌ను ప్రారంభించనున్నారు. అలాగే వనపర్తి జిల్లా కొత్తకోటలో బాలికల ఉన్నత పాఠశాల భవనం ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. మధ్యాహ్నం 12:00 గంటలకు శంషాబాద్ నుంచి హెలికాప్టర్‌లో రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీకి బయలుదేరుతారు. 12:15 గంటలకు ఫ్యూచర్ సిటీలోని అమెజాన్ డేటా సెంటర్ వేదికకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12:15 నుంచి 12:45 గంటల మధ్య అమెజాన్ డేటా సెంటర్‌కు భూమిపూజ చేస్తారు. అనంతరం 12:50 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లికి పయనమవుతారు. మధ్యాహ్నం 1:15 గంటలకు దివిటిపల్లి చేరుకుని, 1:20 నుంచి 2:20 గంటల మధ్య అమరరాజా సెల్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ప్రారంభోత్సవం, ప్లాంట్ సందర్శన, అనంతరం ప్రసంగం చేయనున్నారు. ధ్యాహ్నం 2:20 గంటలకు దివిటిపల్లి నుంచి వనపర్తి జిల్లా కొత్తకోటకు హెలికాప్టర్‌లో సీఎం రేవంత్ బయలుదేరుతారు. మధ్యాహ్నం 2:40 గంటలకు కొత్తకోటకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2:45 నుంచి 3:45 గంటల మధ్య బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని ప్రారంభించి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం 3:45 గంటలకు కొత్తకోట నుంచి తిరుగు పయనమవుతారు.

## ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులు ప్రారంభించాలి

న్యూఢిల్లీ,జూలై14(జనంసాక్షి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయినందున పనుల ప్రారంభానికి కేంద్ర క్యాబినెట్ అనుమతి ఇప్పించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి గడ్కరీతో ఢిల్లీలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆర్ఆర్ఆర్ రెండువైపులా ఏకకాలంలో పనులు ప్రారంభమైతే నిర్మాణం త్వరగా పూర్తవుందుని, నిర్మాణ వ్యయం తగ్గుతుందని సీఎం తెలిపారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తామని ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్నందున వెంటనే ఆ రహదారికి అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్‌కు 12 వరుసల రహదారి మంజూరు చేస్తే హైదరాబాద్-విజయవాడల మధ్య 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను బందరు పోర్ట్‌కు సరకు రవాణా వేగవంత మవుతుందని సీఎం వివరించారు. మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఇప్పించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్ధరీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, శ్రీశైలం జలాశయాలు ఈ కారిడార్ పరిధిలో ఉంటాయని సీఎం తెలిపారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు ఆరు వరుసల ప్రత్యామ్నాయ రహదారికి అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యామ్నాయ రహదారికి అవసరమైన భూ సేకరణ తాము చేపడతామని సీఎం తెలిపారు. ఈ ప్రత్యామ్నాయ రహదారి వ్యవసాయ, వ్యాపారపరంగా నూతన అవకాశాలను సృష్టిస్తుందని సీఎం తెలిపారు. ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ దితరులు పాల్గొన్నారు.

## హాఫీజ్ సయీద్‌కు నాన్‌బెయిలబుల్ వారెంట్

**శ్రీనగర్,జూలై14(జనంసాక్షి):** జమ్మూకశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడి కేసులో లష్కరే తయ్యిబా చీఫ్ హాఫీజ్ సయీద్‌పై స్పెషల్ ఎన్ఐఏ కోర్టు నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. జులై 8వ తేదీన కోర్టు హాఫీజ్ సయీద్‌పై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేయగా.. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పహల్గాం దాడిపై విచారణ జరుపుతున్న నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) జులై 6వ తేదీన ఈ కేసుకు సంబంధించి స్పెషల్ ఎన్ఐఏ కోర్టులో అనుబంధ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ ఎల్ఈటీ అధినేత హాఫీజ్ సయీద్‌పై పలు అభియోగాలతో ఈ అనుబంధ చార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. సయీద్‌పై ఉపా చట్టంతో పాటు భారతీయ న్యాయసంహితలోని పలు సెక్షన్ల కింద ఎన్ఐఏ కేసు నమోదు చేసింది.

## నత్తనడకన 'సర్'

జరుగుతున్న సమగ్ర ఓటర్ల సవరణ నత్తనడకన సాగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బీఎల్?ఓ, బీఎల్?ఏలకు సరైన అవగాహన లేకపోవడం వంటి కారణాలతో ఇప్పటి వరకు 15 - 20 శాతం కూడా పూర్తి కాని పరిస్థితి నెలకొందని వెల్లడించారు. సర్ ప్రక్రియ ముగిసేందుకు ఇంకా 10 రోజుల గడువు మాత్రమే మిగిలి ఉందని గుర్తుచేశారు. దీనిని దృష్టిలో ఉంచుకొని తామంతా సీఈవో సుదర్శన్‌రెడ్డిని కలిశామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్?లోని ఓటర్ల సవరణ ప్రక్రియ వేగవంతంగా క్షేత్రస్థాయిలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించామని తెలిపారు.హైదరాబాద్‌లో బీఎల్ఓలతో పాటు టీచర్లు, విద్యార్థులు, జీహెచ్ఎంసీ సిబ్బందిని కూడా భాగస్వామ్యం చేయాలని ఎన్నికల సంఘానికి సూచించినట్లు తెలిపారు. ఓటు లేకపోతే ప్రభుత్వ పథకాలు వర్తించవన్న చర్చ జరుగుతోందని ఈ నేపథ్యంలో అర్హత ఉన్న ఒక్కరి కూడా ఓటు పోకుండా చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరినట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌కు కూడా దిశా నిర్దేశం చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రానున్న పదిరోజులు మరింత చురుగ్గా పాల్గొనాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. పది రోజుల సమయం సరిపోదని దీనికోసం మరింత గడువు ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. నగరం కేంద్రంగా 4500 పోలింగ్ కేంద్రాలున్నాయని పొన్నం పేర్కొన్నారు. హైదరాబాద్ అర్బన?లో ఓటర్ల సవరణ సరైన విధంగా జరగటం లేదని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో సర్? ప్రక్రియ బాగానే కొనసాగుతోందన్నారు. అర్బన్ ప్రాంతాల్లో మైగ్రేషన్ ఉండొచ్చని, ఇతర ప్రాంతాలకు మారవచ్చని తెలిపారు. ఇలా అనేక కారణాలతో స్పందన తక్కువగా ఉందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో నగరం పరిధిలోని ప్రైవేటు విద్యాసంస్థల సహాయం తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు.అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు తన ఓటు హక్కును కోల్పోవద్దని కోరుకుంటున్నమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు స్వచ్ఛందంగా బీఎల్ఓలను పిలిపించుకునైనా ఆన్‌లైన్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటు మిస్ కాకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు గణేశ్ నవీన్ యాదవ్, డీసీసీ అధ్యక్షులు దీపక్ జాన్, రోహిత్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫారాలను త్వరగా అందజేయండి

హైదరాబాద్,జూలై14(జనంసాక్షి): ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా అందజేసిన ఎన్యూరేషన్ ఫారాలను వెంటనే పూర్తి చేసి బిఎల్‌ఒలకు వెంటనే అందజేసి మీ యొక్క ఆమూల్యమైన ఓటుహక్కును కాపాడుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఐఎఎస్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. బిఎల్‌ఒలు అందజేసిన ఫారాల్లో ఎలాంటి తప్పులు లేకుండా పూరించి, ఫోటోలను అతికించి బిఎల్‌ఒలకు అందించాలని సిఇఒ కోరారు. ఎన్యూమరేషన్ ఫారంలో తప్పనిసరిగా ఓటర్ సంతకం, తేదీతో పాటు బిఎల్‌ఒల సంతకం ఉండేలా చూసుకోవాలని సూచించారు. బిఎల్‌ఒలు ఓటర్లకు అందజేసిన రెండు ఎన్యూమరేషన్ ఫారాల్లో ఒకటి బిఎల్‌ఒలకు ఇవ్వాలని, మరొకటి ఓటర్ భద్రపరుచుకోవాలని పేర్కొన్నారు.

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్ఐజీ ఇళ్లకు శ్రీకారం

గ్రామీణ ప్రాంతాలల్లో ఇందిరమ్మ ఇండ్లతో పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రభుత్వం ఇప్పుడు అదే సంకల్పంతో క్యూర్ పరిధిలో మరో చరిత్రాత్మక అడుగు వేస్తోందని పొంగులేటి తెలిపారు. గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా, హైదరాబాద్ నగరానికి 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించడం వల్ల తమ జీవనోపాధి కోల్పోతామనే ఆందోళనతో చాలా మంది అక్కడ నివసించలేకపోయారని తెలిపారు. తమ ప్రభుత్వం పేదల జీవన వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని వారు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే నియోజక వర్గాన్ని మంత్రి యూనిట్‌గా కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లను నిర్మించి యాజమాన్య హక్కు కల్పించేలా ప్రణాళిక చేసినట్లు మంత్రి వివరించారు. సమావేశంలో హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతమ్, సీఈ రమణారెడ్డి, ఎల్ఏవో రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల స్థలాల ఎంపిక ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. ఇప్పటివరకు 7 ప్రాంతాలను ఖరారు చేయగా మిగిలిన ప్రాంతాలకు సంబంధించి భూమిని గుర్తించే పనిలో యంత్రాంగం చురుకుగా నిమగ్నమై ఉంది.

## వెట్‌రన్ సక్సెస్..

4 పంపుల్లో మిగిలిన మూడింటికి కూడా వారానికి ఒకటి చొప్పున వెట్‌రన్ నిర్వహించనున్నారు. అన్ని ట్రయల్స్ పూర్తయితే నార్లాపూర్ రిజర్వాయర్‌కు కృష్ణా జలాల ఎత్తిపోతలు పూర్తి స్థాయిలో ప్రారంభం కానున్నాయి.పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కీలక ముందడుగు పడింది. గత రెండు రోజులుగా ఉత్కంఠ రేపిన సాంకేతిక సమస్యలను అధిగమించిన అధికారులు.. నార్లాపూర్ మొదటి లిఫ్ట్ పరిధిలోని తొలి పంపు వెట్‌రన్‌ను సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేశారు. దీంతో నార్లాపూర్ రిజర్వాయర్‌కు కృష్ణా జలాలను ఎత్తిపోసే ప్రక్రియకు లైన్ క్లియర్ అయింది. దీంతో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పురోగతిలో ఇది మరో కీలక మైలురాయిగా నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.ఇటీవల తొలి పంపు వెట్‌రన్ నిర్వహించే సమయంలో పవర్ ట్రిప్పింగ్ వంటి సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. డ్రై రన్ సక్సెస్ అయినప్పటికీ.. వెట్‌రన్ మాత్రం సఫలం కాలేదు. దీంతో నీటిపారుదల శాఖ అధికారులు, ఇంజనీరింగ్ నిపుణులు, ఏజెన్సీ ప్రతినిధులతో కూడిన ప్రత్యేక టెక్నికల్ టీమ్ రంగంలోకి దిగి లోపాలను గుర్తించి రాత్రింబవళ్లు శ్రమించింది. సమస్యలను పూర్తిగా పరిష్కరించిన తర్వాత మళ్లీ పంపును ప్రారంభించగా ఎలాంటి అంతరాయం లేకుండా వెట్‌రన్ సక్సెస్ అయింది.దీంతో దాదాపు 22 నెలల సుదీర్ఘ విరామం తర్వాత పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని తొలి పంపు తిరిగి విజయవంతంగా పనిచేయడం విశేషం. నార్లాపూర్ మొదటి లిఫ్ట్‌లో మొత్తం 4 పంపులను వెట్‌రన్‌కు సిద్ధం చేసిన అధికారులు.. వారానికి ఒక పంపు చొప్పున మిగిలిన 3 పంపుల ట్రయల్స్ నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని పంపుల వెట్‌రన్ పూర్తయిన తర్వాత పూర్తి స్థాయిలో నీటి ఎత్తిపోతలు ప్రారంభించే అవకాశం ఉంది.మొదటి లిఫ్ట్ నుంచి ఎల్లూరు జలాశయానికి నీటిని ఎత్తిపోస్తే ఉమ్మడి పాలమూరు జిల్లాకు తాగునీటి అవసరాలు తీర్చవచ్చని ప్రభుత్వ నీటిపారుదల శాఖ సలహాదారు పెంటారెడ్డి తెలిపారు. కాల్వల పనులు పూర్తి అయిన తర్వాత కర్వెన వరకు జలాశయాలను నింపే అవకాశం ఉంటుందని చెప్పారు. రెండు, మూడు, నాలుగో పంపులు కూడా రెడీగా ఉన్నాయని.. ఎస్ఈ రవీందర్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నార్లాపూర్ రిజర్వాయర్‌ను నింపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్యాకేజీ-3 పనులు డిసెంబర్‌లోపు పూర్తి చేసి.. ఏదుల పంప్ హౌస్‌లోని 4 పంపులకు సెప్టెంబర్ నుంచి వెట్‌రన్ ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.


## మెట్టపంటలే మేలు

కంటే 30 నుంచి 35 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. వచ్చే మూడు నెలల్లో కూడా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున తక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు మాట్లాడుతూ ఎగువ రాష్ట్రాల్లో కూడా వర్షపాతం తక్కువగా ఉండటంతో కృష్ణా, గోదావరి నదుల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందన్నారు. అందువల్ల నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలు సాగు చేయాలని సూచించారు. భూగర్భ జలాల శాఖ డైరెక్టర్ జిల్లాల వారీగా భూగర్భ జలాల పరిస్థితిని వివరించారు. రాబోయే రోజుల్లో నీటి మట్టం మరింత తగ్గే అవకాశం ఉన్నందున వరి, చెరకు వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. రైతు నేస్తం కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి . సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, సహకార శాఖ ప్రత్యేక సంచాలకులు రాహుల్ రాజ్, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్తాస్ జానయ్య, నీటిపారుదల శాఖ ఇంజినీర్- ఇన్-చీఫ్ మధుసూదన్ రావు, లక్ష్మణ్, భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సత్యవతి, ఐఎండీ శాస్త్రవేత్త డాక్టర్ శ్రావణి, భారత నూనెగింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సురేష్, మెట్ట పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ కె.వి. రావు, అలాగే ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ మహాదేవప్ప పాల్గొన్నారు. ఆయా రంగాలకు సంబంధించిన నిపుణులు రైతులకు ఎల్‌ని నో పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే పంటల నిర్వహణ, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ పంటల సాగు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై పలు సూచనలు చేశారు.

## మొన్న వాన్‌డైక్.. నేడు బ్రౌన్

**భారత్‌లో యూస్ మాజీ సైనికుల చొరబాటు**

శ్రీనగర్(జనంసాక్షి):భారత్-నేపాల్ సరిహద్దులో సశస్త్ర సీమా బల్ మరో అమెరికన్‌ను అదుపులోకి తీసుకుంది. మణిపుర్‌లో అమెరికా డ్రోన్ నిపుణుడు మాథ్యూ వాన్‌డైక్‌ను ఇటీవల భారత సైన్యం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా సరిహద్దుల వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న అమెరికా మాజీ సైనికుడిని ఎస్ఎస్‌బి అదుపులోకి తీసుకుంది అతడిని కాలిఫోర్నియాకు చెందిన జోర్డాన్ బ్రౌన్‌గా గుర్తించారు. సరైన ప్రయాణ పత్రాలు లేకుండా నేపాల్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తుండగా అతడిని ఎస్ఎస్‌బి జవాన్ అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. జవాన్ నుంచి తప్పించుకొని పారిపోతుండగా.. స్థానికులు పట్టుకొని భద్రతా సిబ్బందికి అప్పగించారన్నారు.విచారణ సమయంలో బ్రౌన్ పొంతన లేని సమాధానాలు చెప్తున్నాడని అధికారులు తెలిపారు. బ్రౌన్ 2025 నవంబర్‌లో సముద్ర మార్గం ద్వారా భారత్‌లోకి ప్రవేశించి.. అప్పటి నుంచి గోవాలో నివసిస్తున్నట్లు గుర్తించామన్నారు. సరైన పత్రాలు లేకుండా భారత్‌లోకి ప్రవేశించినందుకు ఇమిగ్రేషన్ అధికారులు అతడిపై కేసు నమోదు చేశారు. విచారణలో అతడు బెంగళూరు, లఖ్‌నవూ, గోరఖ్‌పూర్‌లకు వెళ్లినట్లు తేలిందన్నారు. తాను కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో చదువుకున్నానని.. ఆరేళ్లపాటు అమెరికా సైన్యంలో పని చేశానని బ్రౌన్ వెల్లడించారు. రెండేళ్ల క్రితం సైన్యం నుంచి వైదొలిగానన్నారు. మూడేళ్ల క్రితం తాను ఇటలీ పర్యటనలో ఉన్న సమయంలో ఉత్తరాఖండ్‌కు చెందిన ఒక భారతీయ మహిళను కలిశానని.. 2024 అక్టోబర్‌లో ఆమెను వివాహం చేసుకున్నానని తెలిపారు.



అనంతరం టూరిస్ట్ వీసాపై థాయ్‌లాండ్ వెళ్లానని.. అక్కడ పాస్‌పోర్టు పోవడంతో తాను సముద్ర మార్గంలో భారత్‌కు వచ్చినట్లు వెల్లడించారు. గోవాలో పరిచయమైన ఓ నేపాల్ వ్యక్తిని కలవడానికి ఆ దేశానికి వెళున్నట్లు పేర్కొన్నారు. పాస్‌పోర్ట్ గురించి ప్రశ్నించగా బెంగళూరులోని ఓ పరిచయస్థుడి వద్ద ఉందని చెప్పారు.

**భారత్‌లోకి కిరాయి సైనికులు ఎందుకు..?**

కొన్నాళ్ల క్రితం కోల్‌కతాలో అరెస్టైన మాథ్యూ వాన్‌డైక్ బృందం ఐరోపా నుంచి తెచ్చిన డ్రోన్లను ఈశాన్య భారతం గుండా మయన్మార్‌లోని తిరుగుబాటుదారుల గ్రూపులకు అందించినట్లు సమాచారం. ఇలా డ్రోన్లను దొంగ రవాణా చేయడం, వాటి కూర్పు, మరమ్మతులు, ఎలక్ట్రానిక్ యుద్ధరీతులలో మయన్మార్ తిరుగుబాటుదారులకు శిక్షణ ఇవ్వడం వాన్‌డైక్ బృందం పని అని నాడు రష్యా వెల్లడించింది. విదేశీయులు మిజోరంలో ప్రయాణించాలంటే రక్షిత ప్రాంత పర్మిట్ (పీఏపీ) తప్పనిసరి. కానీ, నిందితులు అలాంటి అధికార అనుమతులు లేకుండానే ఈశాన్య భారతం నుంచి మయన్మార్‌లోకి ప్రవేశించారనేది ఆరోపణ.

# డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిసిన నిఖత్ జరీన్



**హైదరాబాద్, జూలై 14 (జనంసాక్షి)** : అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన బాక్సింగ్ ఛాంపియన్, తెలంగాణ పోలీసు శాఖలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా విధులు నిర్వహిస్తున్న నిఖత్ జరీన్ సోమవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీవీ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ నిఖత్ జరీన్ సాధించిన విశిష్ట విజయాలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి భారతదేశానికి, తెలంగాణ రాష్ట్రానికి ఎనలేని గౌరవాన్ని తీసుకువచ్చారని ప్రశంసించారు. ఆమె విజయాలు తెలంగాణ యువతకు, ముఖ్యంగా మహిళా క్రీడాకారిణులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ జాతీయ, అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి తెలంగాణకు, దేశానికి, తెలంగాణ పోలీసు శాఖకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు కనబరిచిన క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతోనే ముందుకు సాగాలని ఆమెకు సూచించారు. తాను కూడా క్రీడాకారుడిగా ఉన్న అనుభవాన్ని పంచుకున్న డీజీపీ, క్రీడల్లో విజయం సాధించాలంటే కఠినమైన క్రమశిక్షణ, నిరంతర శ్రమ, శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం అత్యంత అవసరమని అన్నారు. లక్ష్యంపై ఏకాగ్రతతో ముందుకు సాగుతూ యువతకు ఆదర్శంగా నిలవాలని, ఒకవైపు పోలీసు అధికారిణిగా బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూనే మరోవైపు అంతర్జాతీయ బాక్సింగ్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా నిఖత్ జరీన్ మాట్లాడుతూ తన క్రీడా ప్రతిభను గుర్తించి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా అవకాశం కల్పించిన తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ పోలీసు శాఖకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకాన్ని తాను ఒక గొప్ప గౌరవంగా, మరింత బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. భారతదేశానికి మరిన్ని పతకాలు సాధించి, తెలంగాణ రాష్ట్రానికి, తెలంగాణ పోలీసు శాఖకు అంతర్జాతీయ వేదికలపై మరింత గౌరవం తీసుకురావడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నిఖత్ జరీన్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధి

- ఆస్పత్రుల్లో అభివృద్ధికి కొత్త పాలసీతో ముందుకు వెళుతున్నాం
- ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు
- భద్రాద్రని కొత్తగూడెం జిల్లా ప్రతినిధులతో మంత్రి దామోదర సమీక్ష



**హైదరాబాద్, జూలై14 (జనంసాక్షి)** : భద్రాద్రి కొత్తగూడెం సహా, రాష్ట్రంలోని అన్ని ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధికి కొత్త పాలసీని తీసుకొస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఐటీడీఏల పరిధిలో ఉన్న అన్ని ఏరియా హాస్పిటల్స్‌లో, దశలవారీగా సీటీ స్కాన్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు. ఈ ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికన కాకుండా, ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా దూరాన్ని బట్టి హాస్పిటళ్లను అభివృద్ధి చేస్తామని, అవసరమైన చోట కొత్త సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలను మంజూరు చేస్తామన్నారు. అవసరాన్ని బట్టి ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటళ్లలను అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు కొత్తగూడెం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సెక్రటేరి యట్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనుకయ్య, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్‌ఐడీసీ ఎండీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ఈ రెండున్నర సంవత్సరాల్లో జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో వైద్య సేవలు గణనీయంగా మెరుగయ్యా యన్నారు. జిల్లాలో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నారని, హాస్పిటళ్లలో అన్నిరకాల మెడిసిన్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆరోగ్యశాఖ అవేర్‌నెస్ కార్యక్రమాలు కూడా చేపడుతోందన్నారు. కొత్తగూడెం మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంత్రిని కోరారు. ఎంసీహెచ్, జీజీహెచ్ నడుమ డిస్టెన్స్ ఎక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో ఎంసీహెచ్‌కు ప్రత్యేకంగా ఒక ఇంచార్జ్ సూపరింటెండెంట్‌ను నియమించాలన్నారు. కొంత మంది డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కూనంనేని కోరారు. జిల్లాలో ప్రతి మండలానికి ఒక అంబులెన్స్, కొత్తగా 4 డయాలసిస్ సెంటర్లు మంజూరు చేసినందుకుగానూ ఎమ్మెల్యేలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కమ్యునిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటల్స్‌కు అనుబంధంగా అంబులెన్స్‌లను మంజూరు చేయాలని ఎమ్మెల్యేలు కోరారు. కొత్తగూడెం జిల్లాల్లోని ఏరియా హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని పీహెచ్‌సీలలో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వాటిని అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. టీచింగ్ హాస్పిటల్, జిల్లా హాస్పిటల్, ఏరియా హాస్పిటళ్లు, సీహెచ్‌సీలలో జనరేటర్లు ఇటీవలే ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, తమది అటవీ ప్రాంతం అయినందున వర్షాల సమయంలో పవర్ కట్ సమస్య ఉంటుందని, ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని పీహెచ్‌సీలలోనూ జనరేటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రి దామోదర మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అత్యంత మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. భద్రాచలం, అశ్వారావుపేట, ఎల్లందు సహా ఏజెన్సీ ప్రాంతాల్లోని అన్ని ఏరియా హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ సేవలను దశలవారీగా అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి హామి ఇచ్చారు. ఎమ్మెల్యేలు కోరినట్టుగా కొత్తగూడెం సహా అటవీ ప్రాంతాల్లో ఉన్న అన్ని పీహెచ్‌సీల్లో జనరేటర్లు ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పట్వారిగూడెం, అన్నపెరటిపల్లి పీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేస్తామని, గండుగులపల్లిలో కొత్త సబ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని మంత్రి హామి ఇచ్చారు. కొమురారం హాస్పిటల్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, ఎల్లందు హాస్పిటల్‌లో కొత్త ఐసీయూను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బందిలో ఎవరికైనా భద్రాచలం, అశ్వారావుపేట వంటి అటవీ ప్రాంతాల్లో పనిచేసేందుకు ఆసక్తి ఉంటే.. వారికి ఆయా హాస్పిటళ్లలోనే పోస్టింగ్స్ ఇవ్వాలని ప్రిన్సిపల్ సెక్రటరీకి మంత్రి సూచించారు. అదే సమయంలో, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే డాక్టర్లు, సిబ్బంది కఠినంగా వ్యవహరించాలని హెల్త్ సెక్రటరీనిని మంత్రి ఆదేశించారు. కొత్తగూడెం ఎంసీహెచ్‌లో డాక్టర్లు, సిబ్బంది అటెండెన్స్‌ను మానిటర్ చేసేందుకు ఒక డాక్టర్‌ను ప్రత్యేకంగా నియమించాలని మంత్రి ఆదేశించారు. ఎమ్మెల్యేలు రెగ్యులర్‌గా హాస్పిటల్స్‌ను విజిట్ చేయాలని మంత్రి సూచించారు. కొత్తగూడెం జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు మంత్రి సూచించారు. అన్నిరకాల మెడిసిన్, డయాగ్నస్టిక్ కిట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, అవసరమైన వైద్య పరికరాలు ప్రతి హాస్పిటల్‌లో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అవసరమైతే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు గ్రామ స్థాయిలోనే వైద్య సేవలు అందించాలని సూచించారు. 108, 102 అంబులెన్స్ సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# దుబాయ్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించండి

**బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో దుబాయ్ తెలంగాణ ప్రతినిధుల భేటీ**



**హైదరాబాద్ (జనంసాక్షి)** : దుబాయ్‌లోని తెలంగాణ ప్రవాస ప్రతినిధులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. దుబాయ్‌లో తెలంగాణ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ గతంలో అమెరికాలోని డల్లాస్, మలేషియా తదితర దేశాల్లో తెలంగాణ ప్రవాసులతో విజయవంతంగా నిర్వహించిన సమావేశాల తరహాలోనే, దుబాయ్‌లో కూడా తెలంగాణ ప్రజలు, బీఆర్ఎస్ అభిమానులు, ప్రవాస తెలంగాణవారితో ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని కేటీఆర్‌ని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేష్ బిగాల, దుబాయ్ ప్రతినిధుల తరఫున కిరణ్ పీచర, రాధారపు సత్యం, సుధాకర్ రెడ్డితో పాటు పలువురు ప్రవాస ప్రముఖులు పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రవాసులను ఒకే వేదికపైకి తీసుకువచ్చే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

# సింగరేణిని మరింత బలోపేతం చేస్తాం

- తాడిచెర్ల-2 కేటాయింపు చిత్తశుద్ధికి నిదర్శనం
- బిజెపి ప్రభుత్వంలో సింగరేణికి పూర్వ వైభవం
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/మల్హర్/రామకృష్ణాపూర్ (జనంసాక్షి):** సింగరేణిని మరింత బలోపేతం చేస్తామని, తాడిచెర్ల-2 కేటాయింపు బీజేపీ చిత్తశుద్ధికి నిదర్శనమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని జెన్కో గెస్ట్ హౌజ్ లో బస చేసిన కిషన్ రెడ్డి మంగళవారం ఉదయం కేటీకే-8 సింగరేణి గనిలో గేట్ మీటింగ్, సింగరేణి భరోసా యాత్రలో భాగంగా కార్మికులతో మాట్లాడారు. అలాగే సింగరేణి భరోసా యాత్రలో భాగంగా తాడిచర్లలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. అలాగే మందమర్రి ఏరియా రామకృష్ణాపూర్ ఎమ్మెన్నార్ గార్డెన్ లో ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నరపరాజు రామచంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాలుగా దేశ అభివృద్ధికి ఇంధనంగా నిలుస్తున్న సింగరేణి కార్మికుల కృషి ఎంతో విలువైనదని కొనియాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ ప్రభుత్వాల విధానాలు, వైఫల్యాల కారణంగా సింగరేణి కార్మికుల్లో అభద్రతాభావం, ఆందోళన పెరిగిందని అన్నారు. సింగరేణిని దేశంలోనే అత్యంత కీలకమైన ప్రభుత్వ రంగ సంస్థగా బలోపేతం చేయాల్సిన గత ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జిల్లా ఖనిజ పునాది నిధుల వినియోగంపై తెలంగాణ ప్రభుత్వం పూర్తి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జెన్‌కో సింగరేణికి చెల్లించాల్సిన సుమారు 9 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ బకాయిల కారణంగా సంస్థపై అనవసర ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. మల్హర్‌రావు మండలంలోని ఈ తాడిచర్ల కోల్‌బ్లాక్-2 గనిలో దాదాపు 350 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు అంచనా వేశారు. ఈ భారీ నిల్వలతో రాబోయే 40 నుంచి 50 సంవత్సరాల పాటు నిరంతరాయంగా బొగ్గు ఉత్పత్తిని కొనసాగించే సామర్థ్యం దీనికి ఉందని కేంద్ర మంత్రి వివరించారు. ఇది తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు సరికొత్త ఊపును ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.

**కోట్లలో బొగ్గు స్కాం : ఎంపి ఈటల**

గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో దోచుకున్నది సరిపోదు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహాలో వేల కోట్లలో బొగ్గు స్కాం చేస్తుందని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ మండిపడ్డారు. రెక్కలు ముక్కలుగా కష్టం చేస్తూ రాష్ట్రానికి వెలుగు పంచుతున్న కార్మికుల సొమ్మును రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాయం చేస్తుందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ బిఆర్ఎస్ చీకటి ఒప్పందంతోనే సింగరేణి నష్టాలలోకి వెళ్లిందని ఆరోపించారు. ప్రజలను, సింగరేణి కార్మికులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరును రాష్ట్ర ప్రజానీకం గమనిస్తుందని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కమలం వికసించడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు.

**కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు : బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్ రావు..**

కేంద్ర ప్రభుత్వం నిధులతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చంద్రరావు అన్నారు. తాడిచెర్ల బ్లాక్ 2 గనితో సింగరేణి లాభాల్లోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రహదారుల విస్తరణ, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ, రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలకు నిధులను కేటాయించింది కేంద్ర ప్రభుత్వమని గుర్తు చేశారు. పదేళ్లుగా బిఆర్ఎస్ ప్రభుత్వం మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహారంతో ప్రజలు ఆందోళనలో ఉన్నారని రాబోయే ఎన్నికల్లో బిజెపి పార్టీ అధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు.



## ఎఫ్‌జీజీ టైమ్స్ కంపెండియం ఆఫ్ ఆర్టికల్స్ 2025-26 విడుదల

**హైదరాబాద్ (జనంసాక్షి)** : ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సంస్థ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఐఎఫ్ఎస్ ఎం.పద్మనాభ రెడ్డి అధ్యక్షతన, టి.వివేక్ సంపాదకీయంలో ఏ.రఘురాం సహ సంపాదకీయంలో వెలువడిన ఎఫ్‌జీజీ టైమ్స్ కంపెండియం ఆఫ్ ఆర్టికల్స్ 2025-26ను ముఖ్య అతిథులైన రిటైర్డ్ ఐఏఎస్ కె.పద్మనాభయ్య చేతులమీదుగా విడుదల చేసారు. వ్యాస రచయితలకు అందచేసారు. సోమాజీగూడలోని బిల్లా విస్టా ఏఎస్‌సీఐలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యాస రచయితలు, ఫిల్మ్ డైరెక్టర్/ సామాజిక వ్యాఖ్యాత సయ్యద్ రఫీ, డీసీపీ డాక్టర్ లావణయ ఎనజేపీ, సోమా శ్రీనివాస్ రెడ్డి, శ్రీ రామదాస్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ టి.విజయ కుమార్, డాక్టర్ పి. మోహన్ రావు, సుభాషిణి, పాశం విజయ, అనురాధ, ప్రొఫెసర్ రాయ్ రావ్ రామ్ మోహన్ రావు, డాక్టర్ ధనుంజయ్, టీ.మురళీధర్, లక్ష్మి నారాయణ, బుచ్చయ్య, మంగరి రాజేందర్, జి. శ్యామ్ ప్రసాద్, సి.విజయ్ కుమార్ రెడ్డి, సుబ్బ లక్ష్మి, నాగార్జున రావు, డాక్టర్ నాగ రాజు నాయుడు, ఎం.పద్మనాభ రెడ్డి, టి.వివేక్, ప్రొఫెసర్ ఏ. రఘురాం రావు ఎఫ్‌జీజీ టైమ్స్ కంపెండియంఅందుకున్నారు.

# గుండ మల్లయ్య నియామకం గర్వకారణం

**అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త**



**హైదరాబాద్ (జనంసాక్షి)** : యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా గుండ మల్లయ్య గారిని నియమించడం పట్ల అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త హర్షం వ్యక్తం చేశారు. నాగోల్ లోని తన నివాసానికి వచ్చిన సందర్భంగా ఆయనను సన్మానించారు. ఆర్య వైశ్య సమాజానికి చెందిన వ్యక్తికి ఈ గౌరవప్రదమైన బాధ్యతను అప్పగించడం సమాజానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. గుండ మల్లయ్య తన అనుభవం, సేవాభావంతో యాదాద్రి దేవస్థానం అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఆర్య వైశ్య సామాజిక వర్గానికి చెందిన గుండ మల్లయ్యకు రెండవ తిరుపతి యాదగిరి గుట్ట ట్రస్ట్ బోర్డ్ మెంబెర్ గా అవకాశం కల్పించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గుండ మల్లయ్యకు ఉప్పల శ్రీనివాస్ గుప్త హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, భగవంతుని ఆశీస్సులతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మిరుదొడ్డి శ్యామ్ సుందర్, వాసవి కల్చరల్ కమిటీ అధ్యక్షుడు ఈశ్వర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ముందస్తు అక్రమ అరెస్టులు అన్యాయం
- తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు




**హైదరాబాద్ (జనంసాక్షి)** : వామపక్ష విద్యార్థి సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో పెండింగ్ స్కాలర్షిప్‌లు, ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలనీ కోరుతూ 'చలో సెక్రటేరియట్ ముట్టడి' పిలుపు నేపథ్యంలో తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు, ప్రజా తంత్ర విద్యార్థి సంస్థ జిల్లా కార్యదర్శి భాషిపంగు సునీల్‌లను చివ్వెంల ఎస్ఐ వెంకన్న, పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ ముందస్తు అరెస్ట్ సందర్భంగా తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు మాట్లాడుతూ పెండింగ్ స్కాలర్షిప్ లను, ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలనీ డిమాండ్ చేసారు. ప్రభుత్వం పెండింగ్ స్కాలర్షిప్ లు, ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయి కూడా ఉత్తీర్ణత సాధించిన సర్టిఫికెట్ లను తీసుకోలేని దీన స్థితిలో ఉన్నారని దేశ చరిత్రలోనే ఇప్పటి వరకు ఇటువంటి దౌర్భాగ్యమైన సంఘటనలు జరగలేదని అన్నారు. ముఖ్య మంత్రి వద్దే విద్యా శాఖ ఉన్నప్పటికీ కూడా అటు ప్రయివేట్ విద్యా సంస్థల యాజమాన్యల ఆవేదన , ఇటు విద్యార్థుల ఆందోళన " అరణ్య రోధన " గానే మిగిలిపోతుంది అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండున్నర ఏళ్ల పాలనా ముగిసిన విద్యా శాఖ మంత్రి ని నియమించకపోవడం శోచనీయం అని, గత ఎన్నికల సందర్భంగా పెండింగ్ స్కాలర్షిప్ లు, రియంబర్స్ బకాయిలను విడుదల చేస్తామని మ్యాని ఫెస్టో లో ప్రకటించి, హామీ ఇచ్చి, ప్రభుత్వం ఏర్పడి రెండున్నర ఏళ్ళు గడుస్తున్నా విద్యా రంగా సమస్య లు పరిష్కారించకుండా సమస్య పై ప్రశ్నిస్తే, పోరాడితే ముందస్తు అక్రమ అరెస్ట్ లు చేయడం ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగా సమస్యల పరిష్కారం లో పూర్తిగా విఫలం అయింది అని అన్నారు.

# రైతుల కోసం రక్తదానం

**సౌత్ ఆఫ్రికా ఎన్నారై బీఆర్ఎస్ కార్యకర్త అనీల్ రెడ్డి మిట్టపల్లి సేవాభావం**

**సౌత్ ఆఫ్రికా బీఆర్ఎస్ శాఖ తరఫున నాగరాజు గుర్రాల అభినందనలు**



**హైదరాబాద్ (జనంసాక్షి)** : ఇటీవల ఒక విలేకరి, "కరువు వస్తే పంటలకు రైతులకు నీళ్లు ఎలా అందిస్తారు?" అని ప్రశ్నించగా, ముఖ్యమంత్రి చేసిన "వాళ్లను కోసి పంటల మీద రక్తం చల్లితే అదే పండుతుంది" అనే వ్యాఖ్య రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో సౌత్ ఆఫ్రికా ఎన్నారై బీఆర్ఎస్ కార్యకర్త అనీల్ రెడ్డి మిట్టపల్లిలి వేములవాడలో రైతుల పక్షాన నిలిచి స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమని లిబీఆర్ఎస్ ఎన్నారై నాయకులు నాగరాజు గుర్రాలలి తెలిపారు. రైతుల పట్ల ప్రేమను, బాధ్యతను మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తూ రక్తదానం చేయడం సమాజానికి గొప్ప సందేశమని ఆయన అన్నారు. రైతు సంక్షేమం కోసం సేవ చేయాలనే తపనతో ముందుకు వచ్చిన అనీల్ రెడ్డి మిట్టపల్లి సేవాభావం ప్రశంసనీయమని కొనియాడారు. సౌత్ ఆఫ్రికా బీఆర్ఎస్ శాఖ తరఫున అనీల్ రెడ్డి మిట్టపల్లికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నామనిలి, రైతుల కోసం ఆయన చేసిన ఈ సేవా కార్యక్రమం మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని నాగరాజు గుర్రాల ఆకాంక్షించారు.

# చైనాను వణికిస్తున్న టైఫూన్ బావి

**బీజింగ్, జూలై14 (జనంసాక్షి)** : చైనాను టైఫూన్ బావి వణికిస్తోంది. భారీ వర్షాలతో.. రహదారులు జలమయంగా మారాయి. లియావోనింగ్ ప్రావిన్స్‌లోని 2,60,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరదనీటిలో కార్లు బొమ్మల్లా కొట్టుకుపోయిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మంగళవారం కూడా భారీ వర్షాలకు అవకాశం ఉందని చైనా జాతీయ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. 13 రోజుల క్రితం పసిఫిక్ సముద్రంలో ఏర్పడిన ఈ టైఫూన్ ఫ్రాన్స్ దేశమంతా విస్తీర్ణాన్ని కలిగి ఉంది. దీని ప్రభావం జపాన్, తైవాన్, ఫిలిప్పీన్స్, ఉత్తర కొరియాలోనూ కనిపిస్తోంది.

# కెపిహెచ్‌బి లులూ మాల్ వద్ద ఘర్షణ

- గన్‌తో వ్యక్తి హల్‌చల్ చేయడంతో ఆందోళన
- మాల్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు



**హైదరాబాద్, జూలై 14 (జనంసాక్షి)** : కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని లులు మాల్‌లో ఓ వ్యక్తి గన్‌తో కనిపించడం కలకలం రేపింది. మాల్ పార్కింగ్ వద్ద రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చచెబుతుండగా పాతబస్తీకి చెందిన సిద్దిఖీ అనే వ్యక్తి జేబులో గన్‌ను పోలీసులు గుర్తించారు. సిద్దిఖీ దగ్గర గన్ కనిపించడంతో అప్రమత్తమైన పోలీసులు స్వాధీనం చేసుకుని పరిశీలించారు. కాగా గన్‌కు చెల్లుబాటయ్యే లైసెన్స్ ఉన్నట్లు తేలింది. అయితే గన్‌తో వచ్చిన వ్యక్తిని మాల్‌లోకి అనుమతించడంలో భద్రతా సిబ్బంది నిర్లక్ష్యంపై పోలీసులు సీరియస్ అయ్యారు. మాల్‌లోకి ప్రవేశించేప్పుడు సరైన తనిఖీలు నిర్వహించకపోవడం వల్లే సదరు వ్యక్తి గన్‌తో లోపలికి రాగలిగారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన లులు మాల్ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. మాల్ ప్రవేశ ద్వారం వద్ద భద్రతా సిబ్బంది సరైన తనిఖీలు నిర్వహించకపోవడం వల్లే గన్‌తో సదరు వ్యక్తి లోపలికి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. సాధారణంగా మాల్స్‌లో మెటల్ డిటెక్టర్లు, బ్యాగ్ స్కానింగ్ వంటి భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంది. కానీ ఈ ఘటనలో భద్రతపరంగా నిర్లక్ష్యం జరిగింది. నేపథ్యంలో భద్రతా నిబంధనలను ఉల్లంఘించి నందుకు లులు మాల్ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులు సూచించారు. ఈ ఘటన నగరంలోని ప్రముఖ షాపింగ్ మాల్స్‌లో భద్రతా ఏర్పాట్లపై మరోసారి చర్చకు దారితీసింది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని మాల్స్‌లో భద్రతా తనిఖీలను ఖచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

సంపాదకీయం

# అధికారుల అవినీతి..
# అంతులేని కథ

అధికారం అంటే సేవ అని చెప్పుకునే వ్యవస్థలో, అదే అధికారం అంతులేని దోపిడీకి సాధనంగా మారడం ఈనాటి పాలనా వ్యవస్థలో బహిరంగ రహస్యం. ప్రజాధనాన్ని కాపాడాల్సిన కుర్చీల్లో కూర్చున్నవారే ఆ ధనాన్ని కొల్లగొట్టే దొంగలుగా మారిన వైనం, ఏసీబీ ఇటీవల వెలికితీసిన కేసులు మరోసారి రుజువు చేస్తున్నాయి. ఆరు నెల వ్యవధిలోనే 14 అక్రమాస్తుల కేసులు, 86 ట్రాప్ కేసులు నమోదు కావడం, గత ఏడాది మొత్తం కేసుల సంఖ్యకు సమీపంలోకి చేరుకోవడం.. వ్యవస్థలో అవినీతి ఏ స్థాయిలో వేళ్లూనుకుపోయిందో చెప్పకనే చెబుతోంది.

రూ.83 కోట్ల అక్రమాస్తులు వెలుగులోకి రాగా, వాటి మార్కెట్ విలువ రూ.వెయ్యి కోట్లకు చేరుతుందంటే, ఇది ఒకటీ అరా అధికారుల వ్యక్తిగత దురాశ కాదు.. వ్యవస్థాగతంగా పాతుకుపోయిన రోగం అని అర్థమవుతోంది. ఇంజినీర్-ఇన్-చీఫ్‌లు, డిప్యూటీ కలెక్టర్లు, ఎస్సీలు, ఎక్సైజ్ అధికారులు, హెచ్‌ఎండీఏ ఇంజినీర్లు.. హోదా ఏదైనా, శాఖ ఏదైనా, జేబులు నింపుకోవడంలో మాత్రం అంతా ఒక్కటే అన్నట్లు తయారైన తీరు దిగ్భ్రాంతికరం. ఒక్క డిప్యూటీ కలెక్టర్ వద్దే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు బయటపడటం, సర్వే డైరెక్టర్ స్థాయి అధికారి వద్ద రూ.30 కోట్ల నల్లధనం పోగుపడటం చూస్తుంటే.. వీరు జీతాలతో బతికేవారా, ప్రజాధనాన్ని పీల్చిపిప్పి చేసేవారా అన్న సందేహం కలుగకమానదు.

నగదు, బంగారం, వెండి, విలాసవంతమైన భవనాలు, ఫ్లాట్లు, భూములు.. అన్నీ కూడబెట్టిన అధికారులు, పైకి మాత్రం ప్రజాసేవకులమని చెప్పుకోవడం వ్యవస్థ మీద నమ్మకాన్ని పూర్తిగా దెబ్బతీసే వైనం. లంచం తీసుకోవడం, అక్రమాస్తులు కూడబెట్టడం వీరికి అలవాటుగా మారిందా, లేక వ్యవస్థలోని లొసుగులే వీరిని దోపిడీదారులుగా తీర్చిదిద్దాయా అన్నది ఆలోచించాల్సిన ప్రశ్న. అవినీతి జరిగినప్పుడు తాత్కాలిక సస్పెన్షన్లు, బదిలీలు తప్ప, శాశ్వత శిక్షలు పడని వ్యవస్థే.. ఈ దోపిడీకి ఊతమిస్తోందన్న విమర్శలూ లేకపోలేదు.

ఏసీబీ దాడులు, తనిఖీలు ఎంత ముమ్మరంగా సాగుతున్నా, అవి కేవలం మంచుకొండ కొసని మాత్రమే బయటపెడుతున్నాయన్న వాస్తవాన్ని విస్మరించలేం. అందిన కాడికి దోచుకోవడమే పనిగా పెట్టుకున్న కొందరు ఉన్నతాధికారుల కారణంగా, నిజాయితీగా పనిచేసే వేలాదిమంది ఉద్యోగుల ప్రతిష్ఠ కూడా మసకబారుతోంది. అభివృద్ధి పనుల పేరుతో మంజూరైన నిధులు కాంట్రాక్టర్లు, అధికారుల మధ్య పంపకాలుగా మారిపోయి, చివరకు ప్రజలకు దక్కాల్సిన ఫలాలు గాలికి పోతున్నాయి.

కేవలం కేసులు నమోదు చేయడం, ఆస్తులు జప్తు చేయడంతోనే సరిపెట్టుకుంటే ఈ దోపిడీ పర్వానికి అడ్డుకట్ట పడదు. విచారణలు వేగంగా పూర్తయ్యి, దోషులకు కఠిన శిక్షలు పడినప్పుడే అధికార గణంలో భయం పుడుతుంది. లేకుంటే ఏసీబీ దాడులు వార్తల్లో వచ్చే తాత్కాలిక సంచలనాలుగానే మిగిలిపోయి, అవినీతి అంతులేని కథగానే కొనసాగే ప్రమాదం ఉంది. ప్రజాధనాన్ని కొల్లగొట్టే వారికి ఇక ఉపేక్ష చెల్లదని చాటాల్సిన సమయం ఆసన్నమైంది.

# సంతకాలు దాటిన సమరం

## హర్ముజ్ సెగతో మళ్లీ రగులుతున్న మధ్యప్రాచ్యం



ఫిబ్రవరి 2026 లో మొదలైన అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం అనేక మలుపులు తిరిగింది. ఏప్రిల్‌లో కాల్పుల విరమణ, జూన్‌లో చారిత్రాత్మక అవగాహన ఒప్పందం జరిగినప్పటికీ, జులై నాటికి పరిస్థితి మళ్ళీ మొదటికొచ్చింది. రెండు దేశాలు పరస్పరం దాడులు చేసుకోవడంతో శాంతి ప్రక్రియ ప్రశ్నార్థకంగా మారింది. ఇంతకీ ఈ అంతర్జాతీయ శాంతి ఎందుకు నిలబడలేకపోతోంది? దీని వెనుక ఉన్న అసలు లక్ష్యాలు, సమీకరణాలు ఏమిటో లోతుగా పరిశీలించాల్సి ఉంది.

**యుద్ధం మళ్ళీ ఎందుకు రాజుకుంది?**

ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్‌లు ఇరాన్‌పై భారీ వైమానిక దాడులకు దిగాయి. ఈ దాడుల్లో ఇరాన్ సర్వోన్నత నేత అలీ ఖమేనీ మరణించడంతో ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరాయి. దీనికి ప్రతిచర్యగా ఇరాన్ రంగంలోకి దిగి, అమెరికా సైనిక స్థావరాలపై, ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడులు చేసింది. అంతేకాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ వంటి హర్ముజ్ జలసంధిని మూసివేసింది. లెబనాన్ నుండి హెజ్బొల్లా కూడా ఇజ్రాయెల్‌పై దాడులు ప్రారంభించడంతో యుద్ధం విస్తరించింది. పరిస్థితి చేయిదాటడంతో పాకిస్తాన్ మధ్యవర్తిత్వం వహించింది. ఏప్రిల్ 8న రెండు వారాల కాల్పుల విరమణ కుదిరినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఉల్లంఘనలు నిరంతరం సాగాయి. ఎట్టకేలకు జూన్ 17న డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ 14 అంశాల అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. అన్ని రంగాల్లో సైనిక చర్యలను శాశ్వతంగా నిలిపివేయడం, హర్ముజ్ జలసంధిని వాణిజ్య నౌకలకు తెరవడం, తుది శాంతి ఒప్పందం కోసం 60 రోజుల పాటు చర్చలు జరపడం ఇందులో ముఖ్యమైన అంశాలు. అయితే, ఈ శాంతి ఎక్కువ కాలం నిలవలేదు. జులై 8న ట్రంప్ ఈ కాల్పుల విరమణ ముగిసిందని అధికారికంగా ప్రకటించారు. హర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు చేస్తోందని అమెరికా ఆరోపించడమే దీనికి కారణం. వెనువెంటనే అమెరికా ఇరాన్ భూభాగంలోని 90కి పైగా వ్యూహాత్మక లక్ష్యాలపై దాడులు చేసింది. బుషెహర్ అణు విద్యుత్ కేంద్రం సమీపంలో కూడా పేలుళ్లు సంభవించాయి. దీనికి ప్రతికారంగా ఇరాన్ జోర్డాన్‌తో పాటు గల్ఫ్ దేశాలైన బహ్రెయిన్, కువైట్‌లపై ప్రతిదాడులు చేయడంతో యుద్ధ మేఘాలు మళ్ళీ కమ్ముకున్నాయి.

**వివాదానికి కేంద్ర బిందువు: హర్ముజ్ జలసంధి:**

ప్రపంచ చమురు, గ్యాస్ సరఫరాలో ఐదో వంతు వాటా ఉన్న హర్ముజ్ జలసంధి ఈ వివాదానికి అసలు కేంద్ర బిందువు. యుద్ధానికి ముందు ఈ మార్గం గుండా రోజుకు సగటున 130 వాణిజ్య నౌకలు ప్రయాణించేవి. జూన్ నాటి "ఎంఓయూ " ఒప్పందంలో 60 రోజుల పాటు ఎటువంటి రుసుము లేకుండా నౌకలకు సురక్షిత మార్గం కల్పించేందుకు ఇరాన్ శాయశక్తులా ప్రయత్నిస్తుంది అనే అస్పష్టమైన నిబంధనను చేర్చారు. భవిష్యత్తులో సర్వీస్ ఫీజు విధించే అవకాశాన్ని ఈ వాక్యం కొట్టిపారేయలేదు. దీన్ని ఆసరాగా చేసుకుని జలసంధిపై తన సార్వభౌమత్వాన్ని నిరూపించుకోవాలని ఇరాన్ చూస్తోంది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘలిబాఫ్ మాట్లాడుతూ, హర్ముజ్ జలసంధి ఇరాన్ నిబంధనల ప్రకారమే నడుస్తుంది తప్ప, అమెరికా బెదిరింపులకు లొంగదు అని తేల్చి చెప్పారు. దీనికి భిన్నంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హెచ్చరిస్తూ, ఈ అంతర్జాతీయ జలమార్గం ఎల్లప్పుడూ తెరిచే ఉండా లని, దీన్ని మూసివేయాలని చూస్తే అమెరికా సైన్యం ఊరుకోదని స్పష్టం చేశారు. జులై 13 నాటికి ఇక్కడి పరిస్థితులు మరింత ఆందోళనకరంగా మారాయి. అమెరికా సైనిక రక్షణలో ఆదివారం 80 లక్షలకు పైగా బ్యారెళ్ల చమురు రవాణా అయినప్పటికీ, వాణిజ్య నౌకల రాకపోకలు గణనీయంగా పడిపోయాయి. కప్లర్ సంస్థ గణాంకాల ప్రకారం, ఒమన్ తీరం వెంబడి ఉన్న సురక్షిత దక్షిణ మార్గంలో నౌకల ప్రయాణం స్తంభించింది. గత వారంతో పోలిస్తే ఆదివారం కేవలం 14 నౌకలు మాత్రమే జలసంధిని దాటాయి. ఇది 60 శాతం క్షీణతను సూచిస్తుంది. నౌకలన్నీ తన నియంత్రణలో ఉన్న ఉత్తర మార్గం (ఇరాన్ భూభాగ జలాలు) గుండానే వెళ్లాలని ఇరాన్ పట్టుబడుతోంది. ఇదే సమయంలో, ఇరాన్ నౌకలపై ఆర్థిక దిగ్బంధనం విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. అంతేకాకుండా, జలసంధి దాటే ఇతర నౌకలు తమ సరుకు విలువలో 20 శాతాన్ని రక్షణ రుసుముగా అమెరికాకు చెల్లించాలని డిమాండ్ చేయడం వివాదాన్ని మరింత పెంచింది.

**దాగివున్న వ్యూహాత్మక ఎజెండాలు:**

శాంతి ఒప్పందం జరిగినప్పటికీ యుద్ధం ఎందుకు ఆగడం లేదనేదానిపై భౌగోళిక రాజకీయ విశ్లేషకులు కొన్ని కీలకమైన అంశాలను అంచనా వేస్తున్నారుహర్ముజ్ జలసంధిని శాశ్వతంగా తన ఆధీనంలో ఉంచుకోవడం ద్వారా ప్రపంచ ఇంధన సరఫరాను శాసించాలని ఇరాన్ భావిస్తోంది. అమెరికా మాత్రం దీన్ని తన ఆధీనంలోని స్వేచ్ఛా వాణిజ్య మార్గంగా మార్చాలని చూస్తోంది. ఇరాన్ తన అణు ఇంధన శుద్ధీకరణను పూర్తిగా నిలిపివేయాలని అమెరికా షరతు పెట్టింది. అయితే ఇరాన్ నూతన సర్వోన్నత నేత మొజ్తబా ఖమేనీకి, అధ్యక్షుడు పెజెష్కియాన్‌కు మధ్య ఈ విషయంలో తీవ్ర భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఒప్పందంలో లెబనాన్‌ను చేర్చినప్పటికీ, హెజ్బొల్లా తన ఆయుధాలను వదులుకోవడానికి నిరాకరించింది. ఇజ్రాయెల్, హెజ్బొల్లాలు ఈ ఒప్పందంపై నేరుగా సంతకాలు చేయకపోవడం వల్ల క్షేత్రస్థాయిలో గందరగోళం నెలకొంది. యుద్ధానికి ముందు ఇరాన్ చమురుకు చైనా ప్రధాన కొనుగోలుదారుగా ఉండేది. సుదీర్ఘ నౌకా దిగ్బంధనం ద్వారా చైనా-ఇరాన్ ఇంధన బంధాన్ని దెబ్బతీయాలని అమెరికా వ్యూహకర్తలు యోచిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. లొంగిపోయామనే ముద్ర పడకుండా ఇరు దేశాల నేతలు కఠిన వైఖరిని ప్రదర్శిస్తున్నారు. చర్చలు సమయం వృథా అని ట్రంప్ అంటుంటే, లొంగుబాటుతో యుద్ధం ముగియదని ఇరాన్ ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు.

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం:**

ఈ ఉదంతం వల్ల అంతర్జాతీయ చమురు మార్కెట్ తీవ్రంగా ప్రభావితమవుతోంది. బ్రెంట్ క్రూడ్ ధర జులై 10 నాటికి బ్యారెల్‌కు 76.58 డాలర్లకు చేరుకుంది. ఇది వారం రోజుల్లోనే 4 డాలర్ల పెరుగుదలను చూపించింది. చమురు సరఫరా తగ్గితే ఆగస్టు నాటికి ధరలు మరో 10 నుండి 15 డాలర్లు పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి సముద్ర సంస్థ సమాచారం ప్రకారం, ప్రస్తుతం వందలాది నౌకల్లో సుమారు 6,000 మంది నావికులు చిక్కుకుపోయారు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు వంటి సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతానికి ఈ ఒత్తిడిని తట్టుకుని నిలబడుతోందని పేర్కొన్నాయి.

**పరిష్కార మార్గాలు - భవిష్యత్తు:**


ఈ సంక్షోభానికి శాశ్వత పరిష్కారం లభించాలంటే అంతర్జాతీయ పర్యవేక్షణలో జలసంధి నిర్వహణపై స్పష్టమైన, రాతపూర్వక ఒప్పందం జరగాలి. గల్ఫ్ సహకార మండలి దేశాలను ఈ చర్చల్లో భాగస్వాములను చేయడం ద్వారా నమ్మకాన్ని పెంచవచ్చు. అలాగే, దశలవారీగా ఆంక్షల ఎత్తివేత, ఐఏఈఏ ద్వారా పర్యవేక్షణ, హెజ్బొల్లా అంశంపై ప్రత్యేక చర్చలు జరపడం వంటి చర్యలు అవసరం. ప్రస్తుత పరిస్థితుల బట్టి చూస్తే, ఇరు పక్షాలు పూర్తిస్థాయి యుద్ధానికి వెళ్లే అవకాశం తక్కువగా ఉన్నప్పటికీ, ఈ పరిమిత దాడుల చక్రం మరికొంత కాలం కొనసాగే ప్రమాదం పొంచివుంది. శాంతి అనేది కేవలం కాగితాలపై సంతకాలతో రాదని, పరస్పర వ్యూహాత్మక ప్రయోజనాలను పక్కనపెట్టి నిజాయితీగా కట్టుబడినప్పుడే సాధ్యమవుతుందని ఈ సంక్షోభం నిరూపిస్తోంది.

డా . సూర్యదేవర రామకృష్ణ,
9490754169

# పాత్రలు మారాయి... ప్రశ్న మిగిలింది

### మారుతున్న వైఖరుల వెనుక ఒక మానసిక విశ్లేషణ

*పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయాణాన్ని కేవలం రాజకీయ పరిణామాల క్రమంగా చూడలేం; అది మారుతున్న వైఖరులు, మారుతున్న పాత్రలు, వాటి మధ్య కనిపించే అంతరాలను అర్థం చేసుకోవాల్సిన ఒక సంక్లిష్ట ప్రయాణం. ఒక సందర్భంలో వినిపించే భావన మరో సందర్భంలో కనిపించే వైఖరితో కలిసిపోనప్పుడు, అక్కడే ప్రశ్నలు మొదలవుతాయి. అందుకే ఆయన రాజకీయ ప్రయాణంలో కనిపించే మార్పులను మాత్రమే కాదు, వాటి వెనుక ఉన్న తర్కాన్ని, మాటలకు చర్యలకు మధ్య ఉన్న దూరాన్ని కూడా పరిశీలించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఒక నాయకుడి ప్రయాణాన్ని అతని విజయాలు, వైఫల్యాలు మాత్రమే నిర్వచించవు; అతని లోపల నడిచే సంఘర్షణలు కూడా ఆ ప్రయాణాన్ని ప్రభావితం చేస్తాయి. అందుకే పవన్ కళ్యాణ్ రాజకీయాలపై చర్చలు సమాధానాలతో ముగియవు. ప్రశ్నలతో మొదలవుతాయి.*



స్విస్ మనోవిజ్ఞాన శాస్త్రవేత్త కార్ల్ యుంగ్ వ్యక్తిత్వ వికాసాన్ని మనిషిలోని విభిన్న కోణాలను ఒక సమగ్ర స్వరూపంగా మలచుకునే ప్రక్రియగా చూశాడు. జర్మన్‌బి అమెరికన్ మనోవిజ్ఞాన శాస్త్రవేత్త ఎరిక్ ఎరిక్సన్ వ్యక్తి జీవితంలో స్వీకరించే విభిన్న పాత్రల మధ్య ఒక స్థిరమైన గుర్తింపును నిర్మించుకోవాల్సిన అవసరాన్ని ప్రస్తావించాడు. ఈ కోణంలో పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయాణాన్ని పరిశీలిస్తే, ఆయన స్వీకరించిన విభిన్న భావనలను అనుసంధానించే ఒక స్థిరమైన అంతర్లీన తర్కం స్పష్టంగా కనిపించదు. ఆయన రాజకీయ భాషలో వ్యవస్థపై అసంతృప్తి వినిపిస్తుంది. మార్పు అవసరమనే పిలుపు ఉంటుంది. అదే సమయంలో అధికార కేంద్రాలకు చేరువ కావాలనే ప్రయత్నం కూడా కనిపిస్తుంది. ఒక వైపు తిరుగుబాటు, మరోవైపు అధికార ఆకర్షణ; ఒక సందర్భంలో విప్లవ ప్రతీకలు, మరో సందర్భంలో సాంప్రదాయ ప్రతీకలుబి ఈ మార్పులను కేవలం రాజకీయ వ్యూహంగా మాత్రమే చూడలేం. కొన్నిసార్లు ఇది ఒక బలమైన ప్రజా గుర్తింపును నిర్మించుకోవాలనే తపనకి, విభిన్న పాత్రలను స్వీకరించాలనే ప్రవృత్తికి మధ్య జరిగే అంతర్గత సంఘర్షణగా కనిపిస్తుంది. మనోవిజ్ఞాన శాస్త్రంలో ఒక ప్రసిద్ధ వాక్యం ఉంది."ఙట్రఖ్ అం అశే తీవంశీశ్రీజవస ఙఅ్ట్రఱఅ ఙఱశ్రీశ్రీ ఎవ ఖఙవస శీబ్ ఙఅ్ట్రశీబ్"(లోపల పరిష్కారం కానిది బయట ప్రవర్తనగా వ్యక్తం అవుతుంది). అందుకే అతని రాజకీయాల్లో నిర్ణయాల కంటే ఆ నిర్ణయాల వెనుక ఉన్న మానసిక గమనం ఎక్కువ ప్రశ్నలను రేకెత్తిస్తుంది.


అలాగే ఆయన ప్రసంగాల్లో భావోద్వేగ తీవ్రత చాలా బలంగా ఉంటుంది. కోపం, ఆవేదన,ఆశ, ఆత్మవిశ్వాసం అన్ని కనిపిస్తాయి. కానీ ఆ భావోద్వేగాలను ఒక స్థిరమైన రాజకీయ దిశగా మలచే క్రమబద్ధత మాత్రం ఎప్పుడూ స్పష్టంగా కనిపించదు. మనోవిజ్ఞాన శాస్త్రం ప్రకారం భావోద్వేగ తీవ్రత ఎప్పుడూ స్పష్టతకు సంకేతం కాదు. కొన్నిసార్లు అది అంతర్గత సందిగ్ధతను కూడా దాచిపెడుతుంది. అందుకే ఆయన రాజకీయాలు ఒక సిద్ధాంతం చుట్టూ తిరుగుతున్నట్టుగా కాకుండా సందర్భానుసారంగా మారే స్పందనల ప్రవాహంలా కనిపిస్తాయి.

ఇక్కడ కనిపించే మరో గమనించదగ్గ అంశం జ్ఞానానికి జ్ఞాన ప్రదర్శనకి మధ్య ఉన్న దూరం. తన ప్రసంగాల్లో తాత్వికులు వస్తారు, చారిత్రక వ్యక్తులు వస్తారు, అనేక భావనలు వినిపిస్తాయి. కానీ వాటన్నింటినీ కలిపి చూసినప్పుడు ఒక సమగ్ర మేధోనిర్మాణం కనిపించకపోవడం ఒక ముఖ్యమైన ఖాళీని సూచిస్తుంది. అంతేకాదు కొన్నిసార్లు ఆయన విభిన్న సందర్భాల్లో చేసిన ప్రకటనలు పరస్పరం సంఘర్షించుకోవడం కంటే, పరస్పరం విభేదించుకుంటున్నట్టుగా కనిపిస్తాయి. ఫలితంగా ప్రత్యర్థుల కంటే ఆయన గత ప్రకటనలే ఆయన ప్రస్తుత ప్రకటనలను ఎక్కువగా ప్రశ్నిస్తున్నట్టుగా అనిపిస్తుంది.

ఈ రాజకీయ జీవితంలో కనిపించే ముఖ్యమైన వైరుధ్యాలలో ఒకటి భావనకూ వ్యక్తీకరణకు మధ్య ఉన్న దూరం. ఆయన చెప్పే భావనలు ఒక దిశలో ప్రయాణిస్తున్నట్టుగా అనిపిస్తే వాటిని వ్యక్తపరిచే శరీర భాష(ఎశీఎఎ శ్రీఖఅ్ట్రబఖ్ట్రవ) మాత్రం మరో దశలో నడుస్తున్నట్టుగా కనిపిస్తుంది. ఫలితంగా కొన్నిసార్లు ఆయన ప్రదర్శించే ఆత్మవిశ్వాసం వెనక ఒక అంతర్గత అనిచ్ఛితి దాగి ఉన్నట్టుగా అనిపిస్తుంది. అందుకే ప్రజలు ఆయన చెప్పిన విషయాల గురించి మాత్రమే కాదు. వాటిని చెప్పిన విధానం గురించి కూడా చర్చిస్తుంటారు.

బహుశా పవన్ కళ్యాణ్ రాజకీయాలపై వస్తున్న సందేహాల మూలం కూడా ఇక్కడే ఉండవచ్చు. సమస్య ఆలోచన లేకపోవడంలో లేదు. ఆ విభిన్న,వైఖరులు అన్నింటిని కలిపే అంతర్లీన వ్యక్తిత్వ స్వరూపం ఇంకా మౌలిక రూపంలో లేకపోవడంలో ఉండొచ్చు. అలా చూస్తే ఆయన రాజకీయ ప్రయాణం ఒక స్థిరమైన భావజాలం నుంచి ఉద్భవించినట్టుగా కాకుండా సందర్భానుసారంగా రూపం మార్చుకుంటూ ముందుకు సాగుతున్న ప్రయాణంలా కనిపిస్తుంది.

అందుకే పవన్ కళ్యాణ్ ను అర్థం చేసుకోవాలనుకునేవారు తన ప్రసంగాలు మాత్రమే కాదు, ఆయన వైరుధ్యాలను కూడా చదవాల్సి వస్తుంది. ఎందుకంటే ఒక నాయకుడిని అతని సమాధానాలు ఎంత నిర్వచిస్తాయో అతని వైరుధ్యాలు కూడా అంతే నిర్వచిస్తాయి. ఆ వైరుధ్యాలకు ఒక స్థిరమైన మానసిక, తాత్విక అర్థం దొరికేంతవరకు వాటి నుండి పుట్టే ప్రశ్నలు పవన్కల్యాణ్ ను మాత్రమే కాదు. ఆయన రాజకీయ ప్రయాణాన్ని కూడా వెంటాడుతూనే ఉంటాయి.



అయిరబోయిన బిక్షపతి. (అగల్ జోయా).
7993248717.

**గమ్ము నుండుడా**
**గుతుప ఎత్తుడా..**

దైనందిన కార్యాల్లో
మన్నసందు చర్యల
బలహీనతా బలాల
కొమ్మును కాస్తూ..
పాదులు తీస్తూ
నిటారుగెదుగగ
నీళ్లను పోస్తూ
తన్మయమౌతూ..
కీర్తుల చింతల
రేయిం బవళ్లు
రాసుకు తిరిగిన

రాజ్య మైత్రులూ..
నిండుగ మునిగి
బెండుగ తేలిన
తెలివిడి తగలడి
తూలిన క్షణాన..
అపరాత్రెపుడో
అలిసిన రెప్పలు
మూసుకునే వేళ
సోయిల కొచ్చి..
చేతులు చాచి
తానా పాపో
తబా కొరకని
దువా జేసుడా..
తిని తాగి తిరిగే

సర్వ సంసారపు
కలివిడి పనులెల్లా
అలాయ్బలాయ్లే..
హోషిడిసిన ఆ
సందుల సోపతి
నాజిజ దోస్తాన్లు
దాగవ్ నిజాల్..
గంతులో గంతై
ఇరిగిన సదుగై
చేసిన న్యత్యాల్
ఫాసిజ సక్కాల్..
శ్వాసా స్వప్నం
ప్రతి ఆకాంక్షల
తానై జొచ్చితే



ఆకొండ చిలువ..
మూరెడు కర్రతో
మీసాల్ దివ్వుతూ
గమ్మునుండుడా
గుతుప ఎత్తుడా..

- ఇక్బాల్.

## ప్రశ్నలకు జవాబు లేని పాలన కూడా

# ప్రజాస్వామ్యంలో భాగమా?



ప్రజాస్వామ్యంలో అధికారంలో ఉన్న ప్రభుత్వానికి గొప్ప బలం ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ కాదు; ప్రజల ప్రశ్నలకు పారదర్శకంగా సమాధానం చెప్పే ధైర్యం. అధికారాన్ని విమర్శించడం ప్రజాస్వామ్య వ్యతిరేకత కాదు, ప్రజాస్వామ్యాన్ని బలపరిచే ప్రక్రియ. గత కొన్నేళ్లుగా భారత రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ), దాని భావజాల సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) ఆధిపత్యం పెరిగిన కొద్దీ, అధికార కేంద్రీకరణతో పాటు జవాబుదారీతనంపై కూడా ప్రశ్నలు పెరుగుతున్నాయి. ఎన్నికల విజయాల కంటే పాలనలో పారదర్శకత, సంస్థల స్వతంత్రత, అవినీతిపై ఒకే ప్రమాణం పాటిస్తున్నారా అనే సందేహాలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.

ఇటీవలి కాలంలో అయోధ్య రామమందిరంలో విరాళాల నిర్వహణ, భద్రత, ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన వివాదాలు జాతీయ చర్చకు దారితీశాయి. అదే సమయంలో రాజస్థాన్‌లోని ఖటాటి ధామ్ ఆలయ నిధుల నిర్వహణపై కూడా కోట్ల రూపాయల అక్రమాలకు సంబంధించిన ఆరోపణలు వెలుగులోకి రావడం ప్రజల్లో ఆందోళన కలిగించింది. ఈ ఆరోపణలన్నీ చట్టపరంగా తుది నిర్ధారణకు రావాల్సి ఉన్నప్పటికీ, ప్రజల విరాళాలతో నడిచే ఆధ్యాత్మిక సంస్థల్లో పారదర్శకత తప్పనిసరి అనే ప్రశ్న మరింత బలపడింది. దేవాలయాలు రాజకీయ ప్రచారానికి చిహ్నాలుగా మారుతున్నప్పుడు, వాటి ఆర్థిక నిర్వహణపై మరింత కఠినమైన పర్యవేక్షణ కూడా ఉండాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అవినీతిపై బీజేపీ మొదటి నుంచి "జీరో టాలరెన్స్" విధానాన్ని ప్రకటించింది. అయితే ప్రతిపక్ష పార్టీల్లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న నాయకులు బీజేపీలో చేరిన తర్వాత విచారణల వేగం తగ్గడం లేదా రాజకీయ విమర్శలు తగ్గిపోవడం వంటి సంఘటనలు తరచుగా చర్చకు వస్తున్నాయి. దీనివల్ల "పార్టీ మారితే పాపాలు మాఫీ అవుతాయా?" అనే ప్రశ్నను ప్రతిపక్షాలు మాత్రమే కాదు, స్వతంత్ర రాజకీయ విశ్లేషకులు కూడా లేవనెత్తుతున్నారు. చట్టం అందరికీ ఒకేలా వర్తించాలంటే అధికార, ప్రతిపక్ష భేదం లేకుండా ఒకే ప్రమాణం అవసరం.

ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉండాలి. ఇటీవల ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు), ఓటర్ల జాబితాలు, ఎన్నికల నిర్వహణపై ప్రతిపక్షాలు అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా రాహుల్ గాంధీతో పాటు పలువురు ప్రతిపక్ష నాయకులు ఎన్నికల పారదర్శకతపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘం వాటిని ఖండించినప్పటికీ, ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరచడానికి అన్ని రాజకీయ పక్షాలతో కలిసి పారదర్శక సమీక్షలు, సాంకేతిక ఆడిట్లు, బహిరంగ వివరణలు ఇవ్వడం అవసరం. ప్రజాస్వామ్యంలో అనుమానాలను నిర్లక్ష్యం చేయడం కన్నా వాటిని నివృత్తి చేయడమే మంచిది.

ఇక ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలు కూడా చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వం వాటి ద్వారా విదేశీ పెట్టుబడులు, వ్యూహాత్మక భాగస్వామ్యాలు, రక్షణ ఒప్పందాలు, భారత ప్రతిష్ఠ పెరిగిందని చెబుతోంది. మరోవైపు విమర్శకులు మాత్రం ఈ పర్యటనల వల్ల సాధారణ భారతీయుడి జీవితంలో ఎంత ప్రత్యక్ష ప్రయోజనం కలిగిందో ప్రభుత్వం స్పష్టంగా వివరించాలని కోరుతున్నారు. ప్రజా ధనంతో జరిగే ప్రతి విదేశీ పర్యటన ఫలితాలపై వార్షిక నివేదికలను పారదర్శకంగా విడుదల చేయడం ప్రజాస్వామ్యానికి మేలు చేస్తుంది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్-అమెరికా సంబంధాలపై కూడా కొత్త చర్చ మొదలైంది. వాణిజ్య సుంకాలు, వ్యూహాత్మక ఒత్తిళ్లు, రక్షణ ఒప్పందాల నేపథ్యంలో భారత్ తన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని ఎంతవరకు కాపాడుకుంటోంది అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అంతర్జాతీయ సంబంధాల్లో రాజీ అనివార్యమైనా, జాతీయ ప్రయోజనాలు దెబ్బతినకుండా సమతుల్యత పాటించడం ప్రభుత్వ బాధ్యత.

దేశంలో ప్రతి ఎన్నికల ముందు ఉగ్రవాద ఘటనలు లేదా సరిహద్దు ఉద్రిక్తతలు రాజకీయ చర్చకు కేంద్రబిందువుగా మారుతున్నాయి. పుల్వామా దాడి, బాలాకోట్ వైమానిక దాడులు వంటి సంఘటనల తర్వాత భద్రతా అంశాలు ఎన్నికల ప్రచారంలో ప్రధాన అజెండాగా మారాయి. జాతీయ భద్రత అత్యంత కీలకమైన అంశమే అయినప్పటికీ, దానిని ఎన్నికల రాజకీయాలతో ముడిపెట్టకుండా, భద్రతా వ్యవస్థలను రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా నిర్వహించడం ప్రజాస్వామ్య విలువలకు అనుగుణం.

దేశంలో మత విద్వేషాలు, ద్వేష ప్రసంగాలు, సామాజిక విభజనలు పెరుగుతున్నాయనే ఆందోళనలను దేశీయ, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు పలుమార్లు ప్రస్తావించాయి. పాలకులు అన్ని మతాల పట్ల సమదృష్టి ప్రదర్శించి, చట్టాన్ని నిష్పాక్షికంగా అమలు చేయాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. ఒకవైపు "సబ్కా సాథ్, సబ్కా వికాస్" అని ప్రకటిస్తూ, మరోవైపు సమాజంలో విభజన భావన పెరుగుతోందనే విమర్శలు వస్తే, వాటికి ప్రభుత్వం కార్యాచరణతో సమాధానం చెప్పాల్సిందే.

ఆర్థిక రంగంలో కూడా సంపద కేంద్రీకరణపై ప్రశ్నలు పెరుగుతున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్నప్పటికీ, సంపదలో పెద్ద భాగం కొద్దిమంది అత్యంత ధనవంతుల చేతుల్లోనే కేంద్రీకృతమవుతోందని పలు అంతర్జాతీయ నివేదికలు పేర్కొంటున్నాయి. అదానీ, అంబానీ వంటి పారిశ్రామిక వర్గాలకు ప్రభుత్వ విధానాలు అనుకూలంగా ఉన్నాయనే విమర్శలను ప్రభుత్వం ఎన్నోసార్లు ఖండించింది. అయినప్పటికీ ప్రభుత్వ నిర్ణయాలు, టెండర్లు, ఆస్తుల బదిలీలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వంటి అంశాల్లో మరింత పారదర్శకత అవసరమనే అభిప్రాయం బలపడుతోంది.

ప్రెస్ కాన్ఫరెన్సులు నిర్వహించి స్వేచ్ఛగా ప్రశ్నలకు సమాధానం చెప్పడం ప్రజాస్వామ్య నాయకత్వానికి గుర్తుగా భావిస్తారు. భారత ప్రధానమంత్రి ప్రత్యక్ష విలేకరుల సమావేశాలు చాలా అరుదుగా నిర్వహిస్తున్నారనే విమర్శ చాలా కాలంగా వినిపిస్తోంది. ప్రజల తరఫున మీడియా అడిగే కఠినమైన ప్రశ్నలకు కూడా సమాధానం చెప్పే సంస్కృతి బలపడితే ప్రజాస్వామ్యంపై విశ్వాసం మరింత పెరుగుతుంది.

ప్రజాస్వామ్యంలో ఏ ప్రభుత్వం విమర్శలకు అతీతం కాదు. అలాగే ఏ ఆరోపణనైనా తుది నిజంగా భావించడం కూడా సరైంది కాదు. అందుకే ఆరోపణలపై స్వతంత్ర విచారణలు, చట్టపరమైన చర్యలు, పారదర్శక నివేదికలు, ప్రజలకు జవాబుదారీతనం అత్యంత అవసరం. అధికారంలో ఉన్నవారు తమపై వచ్చిన ప్రశ్నలను దేశద్రోహంగా కాకుండా ప్రజాస్వామ్య బాధ్యతగా స్వీకరించినప్పుడే ప్రజల విశ్వాసం నిలుస్తుంది. ఎన్నికల్లో గెలవడం పాలనకు ప్రారంభం మాత్రమే; నిజమైన విజయం ప్రతి ప్రశ్నకు వాస్తవాలతో, పారదర్శకతతో, నిష్పాక్షికతతో సమాధానం చెప్పగలిగినప్పుడే సాధ్యమవుతుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తి వేసేందుకు ప్రభుత్వ కుట్ర

- పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి
- తాండూరులో కళాశాలల బంద్ విజయవంతం
- ఎబివిపి తాండూరు నగర అధ్యక్షులు నర్సింలు



**తాండూరు, జూలై 14 (జనంసాక్షి) :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఎబివిపి తాండూరు నగర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల ల బంద్ నిర్వహించారు ఈ సందర్భంగా తాండూరు నగర అధ్యక్షులు నర్సింలు మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్లపై ఆధారపడి చదువుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం సరైన సమయంలో ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయని కారణంగా 11000 కోట్ల బకాయిలు పేరుకు పోయాయన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రతి యేట 2 లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారని, వేలాది మంది విద్యార్థులు సర్టిఫికెట్స్ తీసుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఇక్కడి విద్యార్థులు పక్క రాష్ట్రాలకు వలసవెళ్లే పరిస్థితి దాపురించిందన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని తుంగలో తొక్కుతూ పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నదని, మా ప్రభుత్వంలో బకాయిలు చెల్లించడంతో పాటుగా, గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి ప్రతి నెల ఫీజులు చెల్లిస్తామని చెప్పిన నేటి ముఖ్యమంత్రి తానే విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ఇప్పటి వరకు బకాయిలు విడుదల చేయకపోవడంతో ఈ విషయం కోర్టు మెట్లు ఎక్కిందనీ అన్నారు.ప్రైవేట్ కాలేజీలు ప్రభుత్వం కలిసి ఆడుతున్న నాటకంలో విద్యార్థులు బలి అవుతున్నారని, బడ్జెట్ కాలేజిలు సైతం మూతపడుతున్నాయని, పొట్టకూటి కోసం లెక్చరర్ గా మారిన నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని దీనికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమే అన్నారు. రీయింబర్స్ మెంట్, స్కాలర్షిప్స్ అనేవి విద్యార్థుల హక్కు అని ప్రభుత్వం వేసే బిక్ష కాదన్నారు. రీయింబర్స్ మెంట్ కోసం అడిగితే విద్యార్థులపై ఉక్కుపాదం మోపుతున్నారని, నిరసన చేస్తే లాఠీచార్జీలు చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని, కానీ తెలంగాణ విద్యార్థులకు ఇవి కొత్తేమీ కాదన్నారు. రేవంత్ రెడ్డి మాట తప్పారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరవాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి అంకురార్పణ చేస్తామని, అన్ని కళాశాల ప్రాంగణాలు,విశ్వవిద్యాలయాలు మరోసారి ఉద్యమ వేదికలై కాంగ్రెస్ పార్టీకి మరణశాసనం రాస్తాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు అజయ్, పవన్, నవీన్, మధుసూదన్ రెడ్డి, ఉమేష్, జాఫర్, భరత్, రాజేష్, కాశిఫ్, సందీప్, గోవర్ధన్, భాను ప్రసాద్, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి



**చేవెళ్ళ, జూలై 14 (జనంసాక్షి) :** రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుర్వ మహిపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏబీవీపీ తెలంగాణ శాఖ పిలుపు మేరకు చేవెళ్ల మండలంలోని కళాశాలల్లో బంద్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ బకాయిలతో పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కాలర్‌షిప్ ప్రభుత్వం ఇచ్చే బిక్ష కాదని, అది విద్యార్థుల హక్కు అని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు వివేకానంద, శివ, లోకేష్, జైపాల్, కార్తీక్, ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.

## బహుజన రాజ్యాధికారం దిశగా మున్నూరుకాపులు కదలాలి



**తాండూరు, జూలై 14 (జనంసాక్షి) :** సమాజంలో ఇతర కులాలను కలుపుకొని మున్నూరు కాపులు సంఘటితంగా ముందుకు సాగి బహుజన రాజ్యాధికారం సాధించేందుకు అడుగులు వేయాలని మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమరావు పటేల్ పిలుపునిచ్చారు. మంగళవారం తాండూరు పట్టణం తులసి గార్డెన్‌లో మున్నూరు కాపు సంఘం పట్టణ అధ్యక్షులు పట్లోళ్ల బాల్ రెడ్డి పటేల్ అధ్యక్షత సమావేశం. ఏర్పాటు చేశారు. మున్నూరు కాపు ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయంగా బలంగా ఎదిగినప్పుడే సమాజంలో మన ఉనికి గుర్తింపు పొందుతుందని అన్నారు. అతి త్వరలో వికారాబాద్ జిల్లాలో ఎన్నికలు నిర్వహించాలని ఈ సందర్భంగా కోరారు.కార్యక్రమం చివరలో రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమరావు పటేల్ ను నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సిములు పటేల్, ఆవుల రామారావు పటేల్,రాష్ట్ర కార్యదర్శులు బెజ్జు శ్రీధర్ పటేల్, కార్యనిర్వహణ కార్యదర్శి నింగాల శంకర్ పటేల్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి బురకని నాగేష్ పటేల్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అరిగే అనంత ప్రసాద్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మున్నూరు బుచప్ప పటేల్,రాష్ట్ర యువత ఉపాధ్యక్షులు తాండ్ర నరేష్ పటేల్, కోట్ల నరేందర్ పటేల్, వెంకట రామారెడ్డి పటేల్, రాములు పటేల్, మున్నూరు కిరణ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## చిలకనగర్‌లో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం



**ఉప్పల్/చిలకనగర్, జూలై 14 (జనం సాక్షి) :** చిలకనగర్ డివిజన్‌లోని బాలేందర్ షాప్ ఎదురుగా ఉన్న వీధిలో చాలా కాలంగా ప్రజలను ఇబ్బంది పెడుతున్న డ్రైనేజీ సమస్యకు పరిష్కారం దిశగా కొత్త డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులను చిలకనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ప్రారంభించారు. ఆ ప్రాంతంలో డ్రైనేజీ పొంగిపొర్లుతూ మురుగునీరు రోడ్డుపైకి రావడంతో దుర్వాసన వెదజల్లుతూ స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీ వాసులు మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆమె వెంటనే స్పందించి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో సంబంధిత అధికారులతో మాట్లాడి కొత్త డ్రైనేజీ లైన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టించారు. డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌తో పాటు సంబంధిత అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏదుల్ల కొండల్ రెడ్డి, జల్లి మోహన్, మాస శేఖర్, సందేపల్లి శ్రీనివాస్, బాలేందర్, ఎం.డి. షఫీ, నర్సింగ్ నేత, బాబా తదితరులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

**చేవెళ్ళ, జూలై 14 (జనంసాక్షి) :** విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ప్రజాస్వామ్య ఉద్యమాలను అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ అన్నారు. మంగళవారం చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి వెళ్లకుండా తనను తెల్లవారుజామునే ముందస్తుగా అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థి నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, విద్యార్థుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఎస్ఎఫ్ఐ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్బంధ రాజకీయాలను వీడి విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ మరింత బలంగా ఉద్యమిస్తుందని, ఎలాంటి బెదిరింపులు, అక్రమ అరెస్టులకు భయపడబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ఈయూ డివిజన్ నాయకులు జైపాల్, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ సహాయ కార్యదర్శి మణి గౌడ్, చేవెళ్ల మండల కార్యదర్శి మాల చందు తదితరులు పాల్గొన్నారు.



# నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా ధ్యేయం

- ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క




**గద్వాల నడిగడ్డ, జూలై 15 (జనం సాక్షి) :** నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉప కేంద్రాలను నిర్మిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంగళవారం వడ్డేపల్లి మండలం శాంతినగర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చాపర్ లో వచ్చిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర అతిథులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పుష్పగుచ్చాలు, మొక్కలతో స్వాగతం పలికి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. జులేకల్ గ్రామానికి రోడ్డు మార్గంలో చేరుకొని అలంపూర్ నియోజకవర్గంలోని జులేకల్, పచ్చర్ల, పుల్లూరు, మేడికొండ ప్రాంతాల్లో నిర్మించిన 33/11 కెవి ఉపకేంద్రాలను ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, మత్స్య, పశుసంవర్ధక, క్రీడల శాఖల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. అలాగే ఎర్రవల్లి మండల కేంద్రం వద్ద రూ.155 కోట్ల నిధులతో 220/132/33 కెవి ఉపకేంద్రం నిర్మాణానికి కూడా ఇక్కడే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ట్రాన్స్ఫార్మర్లను పంపిణీ చేశారు. అనంతరం సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రసంగించారు. జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా మంగళవారం రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవాలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ట్రాన్స్కో సీఎండి కృష్ణ భాస్కర్, టీజీ ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్, సంస్థ డైరెక్టర్లు శివాజీ, నరసింహులు, రూరల్ జోన్ సీఈ బాలస్వామి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు,ఆర్డీవో శ్రీనివాసరావు,విద్యుత్ శాఖ ఇన్చార్జి ఎస్ఈ నాగరాజు,డిఈ రవి ప్రసాద్,ఇతర ప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు, జిల్లా నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతనాలు, కార్మిక హక్కుల సాధన కోసం బహిరంగ సభను జయప్రదం చేద్దాం

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. చంద్రశేఖర్




**నిజాంపేట్, జూలై 13 (జనం సాక్షి) :** పారిశ్రామిక ప్రాంతంలో పని చేస్తున్న ప్రతి కార్మికుడికి ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 6 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి చంద్ర శేఖర్ తెలిపారు. ఈనెల 18వ తేదీన నిర్వహించిన భారీ బహిరంగ సభ విజయవంతం చేయాలని మంగళవారం ప్రగతి నగర్ లోని సుందరయ్య భవన్ లో బాచుపల్లి మండలంలో సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ. పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 06 ప్రకారం కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ, పీఎఫ్ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలను కల్పించాలని, కార్మికులపై యాజమాన్యాలు కొనసాగిస్తున్న వేధింపులను వెంటనే నిలిపివేయాలని కోరారు. అన్ని ట్రేడ్ యూనియన్లు కనీస వేతనాన్ని 26,000గా నిర్ణయించాలని డిమాండ్ చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయ విధానాన్ని అనుసరించకుండా అతి తక్కువ వేతనాలతో కనీస వేతనాల జీవోను విడుదల చేసిందని ఆయన విమర్శించారు. అలాగే వి.డి.ఏ. (వీడిఏ) మార్చి - 2001 సిరీస్‌ను ఆధారంగా తీసుకొని పాయింట్ రేటును అతి తక్కువగా నిర్ణయించడం వల్ల కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే కనీస వేతనాలను శాస్త్రీయ పద్ధతిలో సవరించి, చట్టబద్ధమైన కార్మిక హక్కులను కచ్చితంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జూలై 18న జరిగే భారీ బహిరంగ సభకు పారిశ్రామిక కార్మికులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు బి.వెంకట రామయ్య , సిఐటియు బాచుపల్లి మండల కమిటీ సభ్యులు నాగభూషణ్ , పెంటయ్య, ఎల్లమ్మ, స్వామి, భాస్కర్, వెంకట్ స్వామి, నాగరాజు, ఏడుకొండలు, డేవిడ్, పవన్, సతీష్, శ్రీను, మదిలేటి, చెన్నయ్య, మనీ, బుజ్జమ్మ, నాగశేషు, తిరుపతయ్య, శీను, అంజి, లక్ష్మీ, కార్మికులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ గర్జనను జయప్రదం చేయాలి

- జూలై 15న హైదరాబాద్‌లో సీపీఎం మహాధర్నా
- సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు



**ఉప్పునుంతల, జూలై 14 (జనం సాక్షి) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 15న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే "నిరుద్యోగ గర్జన" మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి కలిగిన దేశం భారత్ అయినప్పటికీ, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. 2014లో ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తూ ప్రైవేటీకరణకు ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం యువత త్యాగాల ఫలితంగా ఏర్పడిందని, అయినప్పటికీ గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం కూడా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో రెండు లక్షలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటు, స్వయం ఉపాధి అవకాశాల కల్పనలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. నిరుద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జూలై 15న జరిగే నిరుద్యోగ గర్జన మహాధర్నాలో నిరుద్యోగ యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మల్లేష్, మహేష్, తిరుపతయ్య తదితర నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

# గుడిసెలు లేని గ్రామాలే లక్ష్యం

- మొదటి విడత లబ్ధిదారులు వెంటనే ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించాలి
- నిజమైన అర్హులను గుర్తించి ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందించాలి
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**కొల్చారం, జూలై 14 (జనం సాక్షి) :** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల ద్వారా ప్రతి అర్హ కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మంగళవారం కొల్చారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని హౌసింగ్ పీడీ మాణిక్యం, తహసిల్దార్ శ్రీనివాస చారి, ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా బేగం, గ్రామ సర్పంచ్ దేవన్న గారి శేఖర్ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రెండో విడత గుడిసెల ధ్రువీకరణ, మొదటి విడత ఇళ్ల నిర్మాణాల పురోగతి, రెండో విడత లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో పారదర్శకత, జవాబుదారితనం, వేగం ఉండేలా అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమయానికి పూర్తి చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మొదటి విడతలో ఇండ్లు మంజూరై సంవత్సరం కావస్తున్నప్పటికీ ఇంకా నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండో విడతలో కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానున్న నేపథ్యంలో, మొదటి విడత లక్ష్యాలను పూర్తి చేయడం అత్యంత కీలకమన్నారు. జిల్లాలో మొదటి విడతలు 9,000ఇళ్లు మంజూరు కాగా, మొత్తము పురోగతి 83 శాతానికి చేరుకుందని తెలిపారు. ఇప్పటివరకు 1,700ఇళ్లు పూర్తయి గృహప్రవేశాలు జరిగాయని, 2,400 ఇళ్లు స్లాబ్ పూర్తి చేసి ఫినిషింగ్ దశలో 650 ఇళ్లు రూమ్ లెవెల్ లో, 1,400ఇళ్లు బేస్మెంట్ దశలో ఉండగా, మిగిలినవి పునాది దశలో ఉన్నాయని వివరించారు. ఇప్పటికీ 1,600 మంది లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించలేదని, వారిలో అవగాహన కల్పించి త్వరగా తిన పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దారిద్ర రేఖకు దిగువన ఉన్న నిరుపేద కుటుంబాలకు మహిళ సంఘాల ద్వారా రుణాలు



మంజూరు చేసి ఉన్న నిర్మాణాలు పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండు విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జిల్లాలో గుడిసెల సర్వే పూర్తయిందని, గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవన్న గారి శేఖర్, వార్డు సభ్యులు, నాయకులు మహేశ్వర్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
15 జూలై 2026

# అద్దె వాహనాల బిల్లులు పెంచాలి

- పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్‌కు అద్దె
- వాహన యజమానుల సంఘం వినతి



**నాగర్‌కర్నూల్, జూలై 14 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలకు గత అనేక సంవత్సరాలుగా అద్దె ప్రాతిపదికన వాహనాలను సమకూరుస్తున్న వాహన యజమానులు తమ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. 2017 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు అద్దె వాహనాల హైర్ ఛార్జీలలో ఎలాంటి పెంపు జరగకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని జిల్లా అధ్యక్షులు అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అశోక్ మాట్లాడుతూ, గత తొమ్మిది సంవత్సరాల కాలంలో డీజిల్ ధరలు గణనీయంగా పెరిగాయని, వాహనాల విడిభాగాల ధరలు, మరమ్మతుల ఖర్చులు, ఇన్సూరెన్స్ ప్రీమియం, టైర్లు, ఇంజిన్ ఆయిల్, డ్రైవర్ల వేతనాలు, నిర్వహణ వ్యయాలు తదితర అన్ని ఖర్చులు పలుమార్లు పెరిగినప్పటికీ, ప్రభుత్వ శాఖలకు అందిస్తున్న అద్దె వాహనాల బిల్లులు మాత్రం ఇప్పటికీ 2017 నాటి రేట్లకే పరిమితమై ఉన్నాయని తెలిపారు. దీంతో వాహనాల నిర్వహణ భారంగా మారి, వాహన యజమానులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని తెలిపారు. అదేవిధంగా గత రెండు సంవత్సరాలుగా అద్దె వాహనాలకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. బ్యాంకు రుణాల ఈఎంఐలు, వాహనాల నిర్వహణ ఖర్చులు, ఇన్సూరెన్స్ చెల్లింపులు, పన్నులు, డ్రైవర్ల జీతాలు చెల్లించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. బిల్లులు సకాలంలో విడుదల కాకపోవడంతో అనేక మంది వాహన యజమానులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అద్దె వాహన యజమానుల సంఘం సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి, ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఈ నెల 15వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు అందిస్తున్న అద్దె వాహనాల సేవలను నిలిపివేయాలని, నిరసన కార్యక్రమాలు తెలియజేయునట్లు నిర్ణయించినట్లు వారు వెల్లడించారు. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్‌కు అధికారికంగా వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని అద్దె వాహనాల హైర్ ఛార్జీలను ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని, అలాగే గత రెండు సంవత్సరాలుగా వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను అత్యవసరంగా విడుదల చేసి వాహన యజమానులకు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అద్దె వాహన దారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తే ప్రభుత్వ సేవలకు యథావిధిగా సహకరిస్తామని, లేనిపక్షంలో అద్దె వాహనాల సేవలను నిలిపివేయడం తప్ప తమకు మరో మార్గం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అశోక్, వైస్ ప్రెసిడెంట్ శంకర్, సభ్యులు బాలరాజ్ గౌడ్, నరేందర్, సందీప్, రామకృష్ణ, శ్రీధర్ తదితర అద్దె వాహన యజమానుల సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి పూర్తి సహకారం

- భవాని మాత విగ్రహ పునఃప్రతిష్ఠలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**రామచంద్రాపురం, జూలై 14 (జనం సాక్షి) :** నూతన దేవాలయాల నిర్మాణం, అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని వెలిమెల తండాలో భవాని మాత ఆలయంలో నిర్వహించిన విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఆలయ నిర్మాణానికి తన సొంత నిధులను వినియోగించిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, తండా ప్రజలు పాల్గొన్నారు.

## వత్తుగుండ్ల పాఠశాల వంట ఏజెన్సీని రద్దు చేసిన కలెక్టర్

- పాఠశాల హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు జారీ



**నారాయణపేట జిల్లా బ్యూరో జూలై 14 (జనం సాక్షి) :** దామర గిద్ద మండలం వత్తు గుండ్ల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీని జిల్లా కలెక్టర్ ప్రియాంక రద్దు (సస్పెషన్) చేశారు. మంగళ వారం వత్తు గుండ్ల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీకి వెళ్లిన కలెక్టర్ అక్కడ విద్యార్థులు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులు చేస్తున్న భోజనంలో అన్నంతో పాటు నీళ్ళ చారు ఉండటం గమనించిన కలెక్టర్ ఆ పాఠశాల ఉపాధ్యాయుడు, వంట ఏజెన్సీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళ వారం మెనూ లో వెజిటబుల్ కర్రీ, సాంబార్ ఉందని, కానీ విద్యార్థులకు కేవలం (నీళ్ల శాతమే ఎక్కువగా ఉన్న) చారు ను వడ్డించడం ఏమిటని వంట ఏజెన్సీ నిర్వాహకులను నిలదీశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించకుండా, భోజనాన్ని రుచి చూడకుండా సంబంధిత ఉపాధ్యాయులు ఏం చేస్తున్నారని, విద్యార్థులకు ఎలా వడ్డింప చేశారని ప్రశ్నించారు. దీనిపై తీవ్రంగా స్పందించిన కలెక్టర్ ఆ పాఠశాల వంట ఏజెన్సీ ని (సస్పెన్షన్) రద్దు చేసి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల హెచ్ ఎం కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని డీ ఈ ఓ గోవింద రాజులు ను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ఆ గ్రామంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ పత్రాలు పూరించే ప్రక్రియను పరిశీలించి, నాలుగు రోజులలో గ్రామంలోని ఓటర్ల అందరితో ఎన్యూమరేషన్ పత్రాలను తీసుకుని డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సాయిబాబా, తహసిల్దార్ తిరుపతయ్య, బీ ఎల్ వో, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకే విద్యుత్ శాఖ ప్రజాబాట



**నారాయణపేట, జూలై 14 (జనం సాక్షి) :** నారాయణపేట మండ లం సింగారం గ్రామంలో బుధవారం ప్రజావాట కార్యక్రమంలో నారాయణ పేట సర్కిల్ ఎస్.ఈ. డి.నవీన్ కూమార్ పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామాలలో విద్యుత్తు ప్రమాదాల నివారించేందుకు ప్రభుత్వం ఈ ప్రజా బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పొలాల గట్ల దగ్గర, గ్రామీణ జనావాస పరిసరాల్లో విద్యుత్ నియంత్రికలు ప్రమాదపరితంగా ఉన్న వాటిని గుర్తించి వాటికి కంచ ఏర్పాటు చేయాలని అధికా రులకు సూచించారు. విద్యుత్తు తీగలు ఎక్కడైనా లూస్ లైన్ ఉన్నట్లయితే, డ్యామేజ్ అయిన తో పోల్స్ ను సరి చేసేందుకు కార్యక్ర మాన్ని నిర్వహించినట్లు ఎస్.ఈ.నవీన్ కుమార్ అన్నారు. చింతల్ రాయుడు దేవాలయం దారిలో ఉన్న విద్యుత్ నియంత్రిక కు కంచె ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు ఎస.ఈ సూచించారు. సింగారం రైతులకు విద్యుత్ పరమైన సమస్యలు ఉన్నట్లయితే గ్రామీణ ఏఈ సాయినాథ్ రెడ్డికి సూచించాలని గ్రామస్తులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎల్.ఐ. రవీంద్ర చారీ, దేవణ్ణ, ఏ.ఎల్.ఎమ్. రామకృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## డబుల్ ఓట్లను తొలగించాలి

- జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 14 (జనం సాక్షి) :** ఒక ఓటరుకు రెండు చోట్ల ఓటు ఉంటే ఒక ఓటును తీసివేయాలని, అలాగే చనిపోయిన ఓటర్లను జాబితాలో నుంచి తొలగించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. మంగళ వారం నారాయణపేట మండలంలోని జిలాల్‌పూర్, పేరపళ్ళ గ్రామ పంచాయతీ కార్యాలయాలలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ పత్రాలు పూరించే ప్రక్రియను కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో డబుల్ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు ఎన్ని ఉన్నాయని బీ ఎల్ వో లను అడిగి తెలుసుకున్నారు. డబుల్ ఓట్లు, చనిపోయిన వాళ్ల ఓట్లు జాబితాలో నుంచి శాశ్వతంగా తొలగించాలన్నారు. ఓటర్లు పూరించి ఇచ్చిన ఎన్యూమరేషన్ పత్రాలను వెంటనే డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. గ్రామాలలో ఎన్యూమరేషన్ పత్రాలు తీసుకుని, ఇంకా పూరించి ఇవ్వని ఓటర్ల వివరాలు సేకరించి ఫాలోఅప్ చేయాలన్నారు. ఒకవేళ పత్రాలు నింపడం తెలియని ఓటర్లు ఉంటే బీ ఎల్ వో లే అన్ని వివరాలతో పత్రాలు పూరించి యాప్ లో అప్లోడ్ చేయాలని ఆమె ఆదేశించారు. జిలాల్ పూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలను, అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్ వాడీ కేంద్రంలో నిల్వ ఉంచిన బియ్యాన్ని పరిశీలించారు. బాలామృతశీ సక్రమంగా పంపిణీ చేస్తున్నారా లేదా ? అంగన్ వాడీ కేంద్రం పరిధిలో ఎంత మంది గర్భిణీలు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు.

### పేరపళ్ళ పల్లె దవాఖానా తనిఖీ

పేరపళ్ళ గ్రామంలోని పల్లె దవాఖానాను కలెక్టర్ ప్రియాంక తనిఖీ చేశారు. పల్లె దవాఖానా ద్వారా గ్రామస్తులకు అందుతున్న వైద్య సేవల పై అక్కడి వైద్య సిబ్బంది తో ఆరా తీశారు. ఇన్ సీ డీ స్క్రీనింగ్ ఎలా చేస్తున్నారని, అవసరమైన మందులు ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అయితే పల్లె దవాఖానా వెనక భాగంలో నిర్మాణం పూర్తయిన సబ్ సెంటర్ భవనం తాళం వేశారని, సబ్ సెంటర్ తాళం తెరిపించి ప్రారంభించాలని గ్రామ సర్పంచి ఆంజనేయులు జిల్లా కలెక్టర్ ను కోరారు. స్పందించిన కలెక్టర్ వెంటనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్ కు ఫోన్ చేసి సబ్ సెంటర్ ను ఎందుకు ప్రారంభించ లేదని ప్రశ్నించగా, భవనం నిర్మాణ బిల్లు ఇంకా చెల్లించాల్సి ఉందని, అందుకే ఇంకా ప్రారంభించ లేదని జవాబిచ్చారు. వీలైనంత తొందరగా బిల్లు చెల్లించి సబ్ సెంటర్ ను ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీ టీ రామ కృష్ణ, రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, జీ.పీ.వో లు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**కొల్చారం, జూలై 14 (జనం సాక్షి) :** ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మంగళవారం, కొల్చారం మండలం వరిగుంతం గ్రామంలో ఎస్ ఐ ఆర్ ను తాసిల్దార్ ఎంపీడీవోతో కలిసి బిఎల్వోలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను క్షేత్రస్థాయిలో ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ బూత్ స్థాయిలో ఫారాల పంపిణీ, స్వీకరణ, డేటా ఎంట్రీ పురోగతిపై ఆరా తీశారు. ఫారాలు పంపిణీ చేయడం మాత్రమే కాకుండా, పూర్తిగా పూరించిన దరఖాస్తులను తిరిగి సేకరించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబాన్ని సంప్రదించాలని, ఒక కుటుంబంలో ఒక సభ్యుడి మ్యాపింగ్ పూర్తయితే మిగిలిన అర్హులైన సభ్యులందరికీ మ్యాపింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంకా ఫారాలు సమర్పించని కుటుంబాలను గుర్తించి, ప్రత్యేకంగా తిరిగి సంప్రదించాలన్నారు. మరణించిన, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేసి, నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలన్నారు. బిఎల్ఓలు ఓటర్లతో మర్యాదగా వ్యవహరించి, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. ఈ పర్యటనలో గ్రామ కార్యదర్శి శ్రీదేవి, జిపిఓ సత్యనారాయణ, బిఎల్ఓలు, గ్రామ సర్పంచ్ పుట్ల గళ్ళ మోహన్ ,ఉప సర్పంచ్ బాంచ వీరేశం, వార్డు సభ్యులు రమేష్, గ్రామ పెద్దలు తుడుము రామకృష్ణ గ్రామస్తులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను వేగవంతం చేయాలి


- అడిషనల్ కలెక్టర్ హరిప్రియ



ఉర్కొండ, జూలై 14 (జనం సాక్షి) : కుటుంబ సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ హరిప్రియ అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా ఉర్కొండ మండలంలోని ఊరుకొండ పేట గ్రామంలో సర్ ప్రక్రియను అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచనలు చేశారు. ఇంటింట ప్రతీ ఓటరు నుండి పత్రాన్ని తీసుకోవాలని సూచించారు. ఓటర్లకు అందించిన పత్రాలలో వివరాలను నమోదు చేసిన తరువాత బీఎల్వోలు తీసుకోవాలని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని, తప్పులుంటే సూచనలు చేయాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీర్వాదాలు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ యూసఫ్ అలీ, సర్పంచ్ అబ్దుల్ రషీద్, నాయకులు వహీదోద్దీన్, పంచాయతీ కార్యదర్శి ఇబ్రాహీం గ్రామస్థులు తది తరులు ఉన్నారు.

## పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- డయల్ 100 కాల్స్ పట్ల నిర్లక్ష్యానికి తావులేదు
- జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్



**నాగర్‌కర్నూల్, జూలై 14 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లాలో నమోదవుతున్న వివిధ కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మంత్లీ క్రైమ్ రివ్యూ సమావేశంలో ఎస్పీ జిల్లా వ్యాప్తంగా నమోదైన నేరాలు, వాటి దర్యాప్తు పురోగతి, మిస్సింగ్ కేసులు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులు, గ్రేవ్, నాన్-గ్రేవ్ కేసులు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ అమలు చర్యలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మిస్సింగ్ కేసుల దర్యాప్తును అత్యంత ప్రాధాన్యంతో చేపట్టి, అదృశ్యమైన వారి ఆచూకీ త్వరితగతిన గుర్తించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ/ఎస్టీ కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యానికి తావు లేకుండా చట్టపరమైన గడువుల్లోనే దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. గ్రేవ్, నాన్-గ్రేవ్ కేసుల దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించాలని పేర్కొన్నారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (జజుచీూ) డేటాను తప్పనిసరిగా నవీకరించాలని, మాన్యువల్ రికార్డులు మరియు సీసీటీఎన్‌ఎస్ నమోదుల మధ్య ఉన్న వ్యత్యాసాలను వెంటనే సరిచేయాలని సూచించారు. ప్రతి కేసుకు సంబంధించిన వివరాలు సకాలంలో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా ఎన్‌సీఆర్‌పీ (చీజ౧ా) పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, ఫేక్ నెంబర్ ప్లేట్లపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డయల్-100కు వచ్చే ఫిర్యాదులపై పోలీసులు వెంటనే స్పందించాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సకాలంలో సహాయం అందేలా ప్రతి కాల్‌ను అత్యంత ప్రాధాన్యంతో పరిగణించాలని ఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు సాయి వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, బుర్రి శ్రీనివాస్, సీఐలు అశోక్ రెడ్డి, శంకర్, నాగరాజు, భీమ్ కుమార్, మహేష్, రఘువీరారెడ్డి, చంద్రయ్య, పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# 2.93 కోట్లతో మెదక్ అభివృద్ధి పనులకు శ్రీకారం

- పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ శంకుస్థాపన



**మెదక్ టౌన్, జూలై 14 (జనం సాక్షి) :** మెదక్ పట్టణ సమగ్రాభివృద్ధి దిశగా మరో కీలక ముందడుగు పడింది. రూ. 2 కోట్ల 93 లక్షల వ్యయంతో పట్టణంలోని 31, 30, 23, 22, 20, 16, 17, 18, 19, 21, 28 వార్డుల్లో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణ పనులకు మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి అభివృద్ధి కార్యక్రమాలపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మెదక్ ప్రజలు తనపై ఉంచిన విశ్వాసానికి ప్రతిఫలంగా ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి అన్ని మౌలిక వసతులను మెరుగుపరచి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గతంలో అభివృద్ధికి నోచుకోని ప్రాంతాల్లో కూడా ప్రస్తుతం సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా ప్రతి వార్డులో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. మెదక్ పట్టణాన్ని ఆధునిక మౌలిక వసతులతో కూడిన ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో భారీ నిధులను తీసుకువస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. హామీలకే పరిమితం కాకుండా పనులతోనే అభివృద్ధిని నిరూపించడమే తమ లక్ష్యమని, ప్రజల్లోనే ఉంటూ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడమే తన ధ్యేయమని, ఏ వార్డు వెనుకబడకుండా సమాన అభివృద్ధి జరిగేలా కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అధికారులు, కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధికా-భూపతి రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఫీవర్ సర్వేను హెచ్‌పివి వ్యాక్సినేషన్ పరిశీలించిన డిఎంహెచ్‌ఓ



**హనుమకొండ ప్రతినిధి, జూలై 14 (జనంసాక్షి) :** ప్రభుత్వ వైద్య బృందం జ్వర సర్వేలో భాగంగా గృహ సందర్శన చేసినప్పుడు జ్వరము ఇతర ఆరోగ్య సమస్యలు అడగడమే కాకుండా వారికి సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు డ్రైడే ప్రాముఖ్యతను కూడా వివరించాలని హనుమకొండ డిఎంహెచ్వో డాక్టర్ ఏ అప్పయ్య సూచించారు. మంగళవారం హనుమకొండ నగరంలోని పోచమ్మ కుంట పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో నిర్వహిస్తున్న ఇంటింటి జ్వర సర్వేను అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ టి మదన్ మోహన్ రావు తో కలిసి పరిశీలించారు. ప్రజలు కూడా తమ ఇంటితోపాటు తమ యొక్క పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో ప్రభుత్వ విభాగాలతో సమన్వయంగా పనిచేయాలని, ప్రజలు కూడా భాగస్వాములు కావాలని అక్కడి ప్రజలకు సూచించారు. నీరు నిల్వ ఉండకుండా ఎప్పుడూ పారే విధంగా చూడాలన్నారు. అలాగే పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా క్లినిక్ ను సందర్శించారు. మెప్మా రిసోర్స్ పర్సన్స్, సిబ్బంది ద్వారా మహిళలను సేవలను వినియోగించుకునేలా చూడాలన్నారు. అనంతరం లష్కర్ సింగారం పట్టణ ఆరోగ్యకేంద్ర పరిధిలోనిర్వహిస్తున్న హెచ్పీవీ వ్యాక్సినేషన్ శిబిరాన్ని ఆయన సందర్శించారు. 30 మంది బాలికలకు వ్యాక్సిన్ ఇవ్వడం జరిగిందని వైద్యాధికారి డాక్టర్ హైదర్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ దీప్తి డాక్టర్ రాజా హైదర్ జిల్లా మాస్ మీడియా అధికారి వి అశోక్ రెడ్డి సబ్ యూనిట్ అధికారి ఖాదర్ అబ్బాస్, సూపర్వైజర్లు హెల్త్ అసిస్టెంట్లు, ఏయన్‌యంలు పాల్గొన్నారు.

## ఆర్థిక పరిస్థితులెలా ఉన్నా పథకాల పంపిణీలో ఆటంకం రాదు

- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**రేగొండ, జూలై 14( జనం సాక్షి):** రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా ప్రజా ప్రభుత్వంలో పథకాల పంపిణీలో తేడారాదని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ, గోరుకొత్తపల్లి మండలాలకు చెందిన 43 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను రేగొండ రైతు వేదికలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పంపిణీ చేశారు. రేగొండ మండలానికి చెందిన 32 మంది, గోరుకొత్తపల్లి మండలానికి చెందిన 11 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా అమలు చేస్తోందన్నారు. సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. అలాగే గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి సర్వేలు నిర్వహించి, హద్దుల నిర్ధారణతో పాటు అర్హులకు పట్టాలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గుటూజు కృష్ణయ్య రేగొండ తహసీల్దార్ సీత రావు, గోరికొత్తపల్లి తహసీల్దార్ హేమ, సర్పంచ్ వారణాశి మౌనిక,కాంగ్రెస్ పార్టీ నాయకులు విజ్ఞాన్ రావు,పున్నం రవి, పెండెల ఉపేందర్,వావిలాల రమేష్,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం పోడు భూముల సమస్యల పరిష్కారం

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**చెన్నూర్, జూలై 14 (జనం సాక్షి) :** ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టంకు లోబడి పోడు భూముల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని కోటపల్లి మండలం ఎడగట్ట గ్రామంలో నిబంధనలను అతిక్రమించి సాగు చేస్తున్న అటవీ భూములను జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, కోటపల్లి సి.ఐ. కృష్ణ, అటవీ డివిజనల్ అధికారి సర్వేశ్వర్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టానికి లోబడి పోడు భూముల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. చట్టం ప్రకారం 2005 కు ముందు సాగులో ఉండి పట్టా పొందిన అర్హులైన గిరిజన రైతులకు మాత్రమే చట్టం వర్తిస్తుందని తెలిపారు. చట్ట ప్రకారం 2005 నాటికి 75 సంవత్సరాలు కాస్తులో ఉండి పట్టా పొందిన గిరిజనేతరులకు మాత్రమే అవకాశం ఉంటుందని, 2005 తర్వాత నూతనంగా అటవీ భూములు సాగు చేస్తున్న వారు చట్ట పరిధిలోకి రారని తెలిపారు. అనర్హులు, నూతనంగా అటవీ భూములను సాగు చేయకుండా స్థానికులు అర్థమయ్యేలా వివరించాలని తెలిపారు. ఇట్టి భూములకు సంబంధించి చెన్నూర్ అటవీ రేంజ్ కార్యాలయంలో మ్యాప్ అందుబాటులో ఉందని, సందేహాలు ఉన్నవారు మ్యాప్ ను పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మా నీళ్లు మాకే కావాలి

- జోగంపల్లి పంప్ హౌస్ వద్ద రైతుల ధర్నా
- సమతుల్యమైన నీటి నిల్వలు చలి వాగు ప్రాజెక్టులో ఉండట్లేదు
- మా పంటలు ఎండుతుంటే నీళ్లు ఇతర ప్రాంతాలకు పంపించడం ఏంటి?
- అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేసిన రైతన్నలు

**శాయంపేట, జూలై 14 (జనం సాక్షి) :** శాయంపేట మండలంలోని పెద్ద కోడెపాక ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులు పంటలకు నీరు అందక పంప్ హౌస్ ద్వారా నీటిని వేరే ప్రాంతానికి పంపు చేయడాన్ని నిరసిస్తూ జోగంపల్లి పంప్ హౌస్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. చలి వాగు ప్రాజెక్ట్ యందు సమతుల్యమైన నీటి నిల్వలు ఉంచకుండా ఇతర ప్రాంతాలకు అధికారులు పంపు చేయడంపై నిరసన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు లో 16 ఫీట్ల వరకు నీటి నిల్వలు ఉంచి పంపిణీ చేయవలసిన అధికారులు 10 ఫీట్లు నీటి నిల్వలు ఉంచి పంపు చేయడం వల్ల పంటలకు నీరందక చలివాగు ఆయకట్ట రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. తమ ప్రాంత రైతుల కోసం ఏదైనా చేస్తాం, ఎంత దూరమైనా పోతామని అన్నారు. సంబంధిత అధికారులతో ఫోనులో మాట్లాడి వెంటనే పంపును ఆఫ్ చేయాలని లేనియెడల నిరసన ఉదృతం చేస్తామని అన్నారు. మా పంటలు ఎండిపోతుంటే నీళ్లు ఇతర ప్రాంతాలకు పంపించడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. స్పందించిన అధికారులు పంపు చేయడం ఆపేశారు. నీటి నిల్వ పెంచిన తర్వాతనే పంపింగ్ చేస్తామని మాట ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాయంపేట ఎస్సై పరమేశ్వర్ రైతులకు ,అధికారుల మధ్య సమన్వయకర్తగా తన వంతు బాధ్యతను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో జోగంపల్లి సర్పంచ్ మారబోయిన ప్రభాకర్, పెద్దకోడపాక సర్పంచ్ దీనా ప్రభాకర్, వసంతపూర్ సర్పంచ్ హింగే భాస్కర్, అబ్బు ప్రకాశ్ రెడ్డి, ఏకు శంకర్, రైతులు పాల్గొన్నారు.

# 20లోగా ఓటర్ల సవరణ పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ
- గణపురంలో క్షేత్రస్థాయి పరిశీలన
- 5 రోజుల్లో నమోదు పూర్తికి ఆదేశం
- యాప్ ద్వారా సులభ నమోదు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఈ నెల 20లోగా ఓటర్ల సమగ్ర సవరణ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం 306 పోలింగ్ కేంద్రంలో బీఎల్ఓ నమోదు ప్రక్రియను పరిశీలించారు. మిగిలిన పనులను 5 రోజుల్లో పూర్తి చేయాలని, ఎన్నికల సంఘం యాప్ ద్వారా ఓటరు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### ఉత్తమ విద్యాబోధనకు శిక్షణ అవసరం..

ఆధునిక శిక్షణతో విద్యాబోధన మెరుగవుతుందని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గణపురం మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు ఇస్తున్న ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్‌ను పరిశీలించారు. ఏఐ వినియోగంతో బోధనా నాణ్యత, విద్యార్థుల సామర్థ్యాలు పెరుగుతాయని చెప్పారు. జిల్లాలో 6 పాఠశాలల్లో ఏఐ శిక్షణ పూర్తైందని, మరిన్నింటికి విస్తరిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈఓ రాజేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### యూరియా అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు

రైతులకు యూరియా సరఫరాలో ఇబ్బందులు ఉండకూడదని, అధిక ధరలకు అమ్మితే దుకాణాలు సీజ్ చేస్తామని కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. గణపురం పీఏసీఎస్‌ను తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడాలని సూచించారు. గత ఏడాది కేటాయింపు, వినియోగంపై నివేదిక ఇవ్వాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

# బోధనలో నాణ్యతే లక్ష్యం

- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద
- సామర్థ్యాభివృద్ధి శిక్షణా తరగతుల పరిశీలన



**వరంగల్ బ్యూరో, జూలై 14 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలంటే ఉపాధ్యాయులు నిరంతరం తమ బోధనా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని జిల్లా కలెక్టర్ డా. సత్యశారద అన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న సామర్థ్యాభివృద్ధి శిక్షణలను మంగళవారం జీహెచ్ఎస్ కరీంబాద్, జీహెచ్ఎస్ శంభునిపేట కేంద్రాల్లో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి బోధనా విధానాలు, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదల, కార్యాచరణ ఆధారిత బోధన, తరగతి గది నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిక్షణలు కేవలం హాజరుకే పరిమితం కాకుండా తరగతి గదిలో స్పష్టమైన మార్పు తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల అభ్యాస స్థాయికి అనుగుణంగా బోధన సాగించాలని, ఖాన్ అకాడమీ, ఎల్ఐపీ, ఎఫ్ఎల్ఎన్, ఏఐ ఆధారిత బోధన, డిజిటల్ లెర్నింగ్, లైబ్రరీ కార్నర్స్ వంటి విద్యా కార్యక్రమాలను ప్రతి పాఠశాలలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, విశ్లేషణ, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందేలా బోధన ఉండాలని సూచించారు. శిక్షణలో అదనపు కలెక్టర్ వై వి గణేష్ ,డీఈఓ రంగయ్య నాయుడు, ఏఎంఓ ఉంద్రాతి సుజన్ తేజ, ఉల్లాస్ కోఆర్డినేటర్ నాగేశ్వర్ రావు, డీఆర్పీలు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## యూరియా కోసం రైతుల పడిగాపులు

**చెన్నూర్ జూన్ 14(జనం సాక్షి) :** ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో యూరియా కోసం మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గ కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తిరుమల గిడ్డంగుల వద్ద రైతులు భారీగా బారులు తీరారు. వ్యవసాయ శాఖ యూరియా పంపిణీ చేస్తామని ప్రకటించడంతో వేకువజామున నుంచే మండలంలోని పలు గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని క్యూలో నిల్చున్నారు. యూరియా కోసం మహిళా రైతులు కూడా పెద్ద సంఖ్యలో తరలిరావడం విశేషంగా నిలిచింది. రైతుల రద్దీతో గిడ్డంగి పరిసరాల్లో సందడి నెలకొనగా, యూరియా పంపిణీ సజావుగా జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

## మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్



**పర్వతగిరి, జూలై 14 (జనంసాక్షి) :** పర్వతగిరి మండలంలో మంగళవారం రోజున సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో పెండింగ్ బిల్లులు చెల్లించి మాజీ సర్పంచులకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని డిమాండ్ చేసిన నేపథ్యంలో అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ప్రస్తుత సోమారం సర్పంచ్ ఏర్పుల శ్రీనివాస్, వడ్లకొండ మాజీ సర్పంచ్ మాజీ సర్పంచుల ఫోరం పర్వతగిరి మండల అధ్యక్షుడు అమడగాని రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలి


- అనధికార నిర్మాణాలు, శిథిల భవనాలు, ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న



**వరంగల్ ఎంజీఎం, జూలై 13(జనంసాక్షి):** పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా, నాణ్యమైన సేవలు అందేలా అధికారులు పనిచేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న ఆదేశించారు. మంగళవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ పట్టణ ప్రణాళికకు సంబంధించిన పలు కీలక అంశాలపై విభాగాల వారీగా సమీక్ష నిర్వహించి అధికారులకు పలు దిశానిర్దేశాలు చేశారు. ఈ సందర్భంగా నగరంలో కొనసాగుతున్న అనధికార నిర్మాణాలు, శిథిలావస్థలో ఉన్న ప్రమాదకర భవనాలు, లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల పరిష్కారం, టిడిఆర్‌ల జారీ, ప్రభుత్వ స్థలాలు, రహదారులపై ఆక్రమణల తొలగింపు, అనధికార హోర్డింగ్‌లు, పోస్టర్లు, ఫ్లెక్సీల తొలగింపు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలను గుర్తించి వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భవన నిర్మాణ నిబంధనలను ఉల్లంఘిస్తూ చేపడుతున్న నిర్మాణాలు, సెల్లార్ దుర్వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిరంతర తనిఖీలు నిర్వహించి నిబంధనల అమలులో రాజీ లేకుండా వ్యవహరించాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని శిథిలావస్థకు చేరిన ప్రమాదకర భవనాలను వెంటనే గుర్తించి, యజమానులకు నోటీసులు జారీ చేయాలని తెలిపారు. నివాసయోగ్యం కాని భవనాల్లో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి, ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసి, అర్హులైన దరఖాస్తుదారులకు నిర్ణీత గడువులో పరిష్కారం అందించాలని సూచించారు. టిడిఆర్ జారీ ప్రక్రియను కూడా వేగవంతం చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు, రహదారులు, కాలువలు, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణతో తొలగించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నగరాన్ని క్రమబద్ధంగా అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ పేర్కొన్నారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నగరాభివృద్ధికి సంబంధించిన ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిబంధనల అమలులో రాజీ లేకుండా పనిచేస్తూ సుస్థిరమైన, ప్రణాళికాబద్ధమైన నగరాభివృద్ధికి కృషి చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డీఎఫ్‌వో శంకర్ లింగం, హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, ఏసీపీలు ఖలీల్, నస్రీన్ భాను, ప్రశాంత్, టీపీఎస్‌లు, టీపీబీఓలు, టౌన్ ప్లానింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అర్హుల ఓటు జాబితాలో నమోదయ్యేలా చూడాలి

- ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి




**తాండూర్, జులై 14(జనం సాక్షి) :** మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలోని తాండూర్ గ్రామపంచాయతీ బీసీ కమిటీ హాల్‌లో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ( ఎస్ ఐ ఆర్ --2026) అవగాహన కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి, డిసిసి అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి పాల్గొని మండల బీఎల్ఏలు, సర్పంచులు,ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా, అనర్హుల పేర్ల తొలగింపు, వివరాల సవరణ వంటి అంశాల్లో బీఎల్ఏలు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి ఎంతో విలువైనదని, ప్రజల ఓటు హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ఇంటింటికీ వెళ్లి అర్హులైన ఓటర్లకు అవసరమైన సూచనలు అందించాలని బీఎల్ఏలకు పిలుపునిచ్చారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసే ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి, డిసిసి అధ్యక్షుడు పెన్నింటి రఘునాథ్ రెడ్డి , బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం సుకుమార్ , డిసిసి ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి , మాజీ గ్రంథాల చైర్మన్ సాల్వాజి మహేందర్ రావు , తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్దబోయిన శంకర్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవీందర్ రావు, శంకర్ గౌడ్, మాజీ జడ్పిటిసి సాలిగామ బానయ్య , మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ , తాండూరు సర్పంచ్ ముడిమడుగుల సురేష్, కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వెంకటేష్, మాదారం సర్పంచ్ లక్ష్మణ్ , గోపాల్ నగర్ సర్పంచ్ గాట్ల నరసయ్య , అచలాపూర్ సర్పంచ్ మా రి శెట్టి స్రవంతి శ్రీనివాస్ , నర్సాపూర్ సర్పంచ్ పరపతి రావు , బోయపల్లి సర్పంచ్ సుందిళ్ల భూమయ్య , ద్వారకాపూర్ సర్పంచ్ మాసాడి తిరుపతి , కాసిపేట సర్పంచ్ వనజగోవర్ధన్ , మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కామని శ్రీనివాస్, సాత నాగరాజు, ఉపాధ్యక్షులు మోమినాలి, చిట్ల రమేష్, శంకర్ గౌడ్, బి ఎల్ ఎ కోఆర్డినేటర్స్, ఎండి గౌస్, మేడి శంకర్, పెద్ది నాగేష్, కాంగ్రెస్ నాయకులు మాస వెంకటస్వామి , కంపెల చిన్నయ్య, దామోదర్ రెడ్డి, సుభాష్ ,పుట్ట శీను కడప నవీన్ జావిద్ , పెద్దబోయిన రవీందర్ , పప్పి దుర్గామహేందర్ మండల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, బీఎల్ఏలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
15 జూలై 2026

# భూ సేకరణ, ఎస్ఐఆర్ ప్రక్రియలను వేగవంతం చేయాలి

- విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్



**చంద్రుగొండ, జూలై 14 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం చంద్రుగొండ మండలంలో విస్తృతంగా పర్యటించి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తిప్పనపల్లి గ్రామంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ భూసేకరణ సర్వే, మద్దుకూరులో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, అనంతరం చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూసేకరణ, ఎస్ఐఆర్ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం, క్రీడలకు ప్రాధాన్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. తిప్పనపల్లిలో కొనసాగుతున్న భూసేకరణ సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్, 70 ఎకరాలకు సంబంధించిన సర్వేను వేగవంతం చేసి గడువులో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి భూ యజమానికి సంబంధించిన వివరాలతో పాటు బోర్లు, సాగులో ఉన్న పంటలు, ఆయిల్‌పామ్ తోటలు, ఇతర శాశ్వత ఆస్తుల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం మద్దుకూరు గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్, దరఖాస్తుల పరిశీలన, డిజిటలైజేషన్, రికార్డుల నిర్వహణపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటికే 65 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని అధికారులు తెలియజేయగా, మిగిలిన ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తును నిబంధనలకు అనుగుణంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఓటరు జాబితా సవరణ చేపట్టాలని సూచించారు. తదనంతరం చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సాంబార్ పలుచగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతి, యూనిఫాంల పంపిణీపై ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతి విద్యార్థి వాలీబాల్, కబడ్డీ వంటి క్రీడల్లో పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పోషకాహారం, మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కొత్తగూడెం ఆర్డీవో మధు, చంద్రుగొండ తహసీల్దార్ జగదీశ్వరరావు, ఎంపీడీవో అశోక్, ఇరిగేషన్, సర్వే శాఖల అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ పక్కాగా నిర్వహించాలి

**వెల్దండ, జూలై 14 (జనంసాక్షి) :** కల్వకుర్తి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో మంగళవారం టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తాలూకాస్థాయి బిఎల్ఎల సర్ సమీక్ష సమావేశంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, ఎలాంటి అర్హులైన ఓటరు పేరు జాబితా నుంచి మిస్ కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని, ప్రజల్లో అవగాహన కల్పించి ఎక్కువ మంది ఈ కార్యక్రమాన్ని వినియోగించుకునేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, పార్టీ సభ్యత్వ ఇంచార్జ్ రజిని సాయిచంద్, మాజీ మున్సిపాలిటీ చైర్మన్ సత్యం, మండల పార్టీ అధ్యక్షుడు పుట్ట.రాంరెడ్డి, తెలంగాణ ఉద్యమకారులను మాజీ జెడ్పిటిసి ద్యాప విజితా రెడ్డి,ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



## సీతారామ ప్రాజెక్టు నీటికి నోచుకోని పెనుబల్లి రైతులు

- లిఫ్టు ట్రాన్స్‌ఫార్మర్లు దొంగల పాలు
- నిరుపయోగంగా ఎత్తిపోతల పథకం



**పెనుబల్లి, జూలై 14 (జనం సాక్షి) :** పెనుబల్లి మండల కేంద్రం చుట్టుపక్కల గ్రామాల రైతులకు రాతోని చెరువు ఎత్తిపోతల పథకం ఓ వరప్రదాయిని వంటిది. పక్కనే ఉన్న నాగార్జున సాగర్ ఎడమ కాలువకు వచ్చే కృష్ణా జలాలకు తోడు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను కూడా అనుసంధానం చేయడంతో ఈ ప్రాంత ప్రజలు ఎంతో ఆనంద పడుతున్నారు.కానీ ఆ నీటిని ఎత్తిపోసే పథకం మూలన పడింది. ఈ పథకానికి సంబంధించిన రెండు ట్రాన్స్ఫర్మర్లను గత ఏప్రిల్ నెలలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. పెనుబల్లి,గంగదేవిపాడు, గోపాలపురం,బయన్నగూడెం, ఎడ్లబంజర, రామచంద్ర రావుబంజర గ్రామాల ఆయకట్టుకు ఈ లిఫ్టు ద్వారానే సాగునీరు అందుతుంది. ఇప్పుడు ఈ పథకం పనిచేయకపోవడంతో వేలాది ఎకరాలు సాగు చేస్తున్న ఐదు గ్రామాల రైతులు నష్టపోతున్నారు. వర్షాభావ పరిస్థితులలో ఈ పథకం రైతులకు ఎంతో మేలు చేస్తుంది. లిఫ్టు నీటిని నమ్ముకునే రైతులు వ్యవసాయ పనులు మొదలుపెట్టారు. దుక్కులు దున్ని నారు పోశారు. పోసిన నారుమళ్లు ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు,స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి ట్రాన్స్ ఫార్మర్లకు మరమ్మత్తులు చేసి గానీ, నూతన ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేసి గానీ ఎత్తిపోతల పథకం పనిచేసే విధంగా చర్యలు చేపడితే ఈ పథకం ఆయకట్టు రైతులకు పుష్కలంగా సీతారామ ప్రాజెక్టు సాగునీరు అందుతాయి. సీతారామ ప్రాజెక్ట్ సాగునీటి కోసం ఎదురు చూస్తున్న రైతుల పంట పండుతుంది.

# సిలికాన్ వ్యాలీ సమస్యల పరిష్కారానికి కృషి

- సిఎంసి కమిషనర్ సృజన



**శేరిలింగంపల్లి, జూలై 14 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ పరిధి సిలికాన్ వ్యాలీ ప్రాంత సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతతో కూడిన కార్యాచరణ ఉంటుందని సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారిణి డాక్టర్ జి. సృజన పేర్కొన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వినూత్నంగా ప్రారంభించిన 'వన్ డే వన్ వార్డ్' కార్యక్రమానికి ప్రజల నుండి అపూర్వ స్పందనకుతోడు సమస్యలు తప్పకుండా పరిష్కారం అవుతుండడంతో ఈ కార్యక్రమం విశేష ఆదరణ పొందిన విషయం విధితమే. ఈ నేపథ్యంలోనే మంగళవారం కూకట్పల్లి జోన్ పరిధి మాదాపూర్ డివిజన్ సిలికాన్ వ్యాలీ పార్కులో ఏర్పాటుచేసిన 'వన్ డేవన్ వార్డ్' కార్యక్రమానికి సిఎంసి కమిషనర్ తోపాటు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కూకట్పల్లి జోన్ కమిషనర్ మయాంక్ సింగ్, సర్కిల్ డిసి తోపాటు వివిధ విభాగాల అధికారులు హాజరు కావడం జరిగింది. ఇందులో భాగంగా సిలికాన్ వ్యాలీ రెసిడెన్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానికులతో సిఎంసి కమిషనర్ తోపాటు అతిధులు ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ప్రధానంగా పౌర సదుపాయాలు మౌలిక వసతులకు సంబంధించిన వివిధ అంశాల పట్ల అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు నిర్మాణాత్మక చర్చలు జరపడం జరిగింది. బోర్ వెల్ మరమ్మత్తులు, భూగర్భ డ్రైనేజీ నెట్వర్క్ అప్ గ్రేడేషన్, రక్షిత మంచినీటి సరఫరా, కాలనీలో కొనసాగుతున్న తక్కువ నీటి ఒత్తిడి, వాటర్ ట్యాంక్ సేవలకు సంబంధించిన సమస్యలను వారు కులంకషంగా చర్చించడంతోపాటు రహదారుల మరమ్మత్తులు, వివిధ అభివృద్ధి పనులు, వాటి కారణంగా రోడ్లపై ఏర్పడిన వ్యర్థాలు, శిథిలాల తొలగింపు, ఆక్రమణల తొలగింపు, అక్రమ పార్కింగ్‌పై చర్యలు, ఓపెన్ జిమ్‌లు, చిన్నారుల ఆటపరికరాల ఏర్పాటు మరియు సిలికాన్ వ్యాలీ పార్కుల అభివృద్ధి విషయమై స్థానికులతో కలిసి సమీక్షించి వాటి పరిష్కారానికి నిర్దిష్టమైన కార్యాచరణతో త్వరలోనే అనుకున్న ఫలితాలను రాబడతామని అధికారులు భరోసాని వ్యక్తం చేశారు. ట్రాఫిక్ సమస్యలు, పార్కుల పరిసరాల్లో పెట్రోలింగ్ పెంపు, చెట్ల కొమ్మల కత్తిరింపు వల్ల ఏర్పడే గ్రీన్ వేస్ట్ ను సకాలంలో తొలగించడం, సీఎస్ తాండా స్మశాన వాటిక సమస్యలు, చెత్తను ఇష్టానుసారంగా పారవేయడం వ్యర్థాల నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలు, పాటించని వారిపై చర్యలు, హాస్టల్లో నీటి వినియోగం తదితర అంశాలపట్ల స్థానికులు తెలిపిన విషయాలను అధికారులు సావధానంగా ఆలకించడం జరిగింది. సిలికాన్ వ్యాలీ ప్రతినిధులు, స్థానికులు వివరించిన సమస్యలను అధికారులు నోట్ చేసుకోవడంతో పాటు వాటిని ప్రాధాన్యత క్రమంలో వీలైనంత త్వరగా పరిష్కరించి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సిఎంసి కమిషనర్ సూచించారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ



**ఖమ్మం కార్పొరేషన్, జూలై 14 (జనం సాక్షి) :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ఓటర్లకు పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను సకాలంలో తిరిగి స్వీకరించి, నిర్ణీత గడువులోగా వాటి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.

మంగళవారం పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండల కేంద్రంలో శివాలయం వీధిలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. బూత్ స్థాయిలో ఫారాల పంపిణీ, స్వీకరణ, డేటా ఎంట్రీ, డిజిటలైజేషన్ పనుల పురోగతిని తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి, ఫారాలు పంపిణీ చేయడమే కాకుండా వాటిని పూర్తిగా పూరింపజేసి తిరిగి స్వీకరించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఒక్కో ఫారం డేటా ఎంట్రీకి ఎక్కువ సమయం పడుతున్న ప్రాంతాల్లో అవసరమైన అదనపు సిబ్బందిని వినియోగించి పెండింగ్ తగ్గించాలని అన్నారు. ప్రతి ఇంటిని సందర్శిస్తూ అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించి, ఒక కుటుంబంలో ఒకరి మ్యాపింగ్ పూర్తయితే మిగిలిన అర్హులైన సభ్యులందరికీ కూడా మ్యాపింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమైన ప్రక్రియ అని పేర్కొన్నారు, బీఎల్ఓలు తమ పోలింగ్ కేంద్రాల పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి వంద శాతం ఫారాల పంపిణీ, సేకరణ పూర్తి చేయాలని, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, సూపర్వైజర్లు ప్రతిరోజూ బీఎల్ఓల పనితీరును సమీక్షిస్తూ అవసరమైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు.

ఈ నెల 24వ తేదీలోగా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉన్నందున, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో కూసుమంచి తహసీల్దార్ సైదులు, సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# టిఎస్ఆర్టీసీని నిర్వీర్యం చేసేందుకు కుట్ర

- కార్మికుల హక్కుల పరిరక్షనే ఎంప్లాయిస్ యూనియన్ లక్ష్యం
- కార్మికులపై అధికారుల వేధింపుల ఆపాలి
- ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న
- మెదక్‌లో ఎంప్లాయిస్ యూనియన్ భారీ ర్యాలీ



**మెదక్ బ్యూరో, జూలై 14 (జనం సాక్షి) :** తెలంగాణ ఆర్టీసీని ప్రభుత్వం యూనియన్ తీసేందుకు కుట్ర చేస్తుందని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న విమర్శించారు. సోమవారం మెదక్ పట్టణంలోని టీఎన్జీవోభవన్లో ఎంప్లాయిస్ యూనియన్ మెదక్ రీజియన్ మహాసభ జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వెంకన్న మాట్లాడుతూ ఎగ్రజెండ్ ద్వారానే కార్మికుల హక్కులు పరిష్కరించబడతాయన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షనే ఎంప్లాయిస్ యూనియన్ లక్ష్యమనన్నారు. కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మెజార్టీ బస్సులు స్క్రాప్ దశకు చేరాయని, వాటి స్థానంలో కొత్త బస్సులు ఏర్పాటు చేసి ప్రయాణికులకు సేవలందించాలన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే బెనిఫిట్స్ ఆర్టీసీ కార్మికులకు కల్పించాలన్నారు. సేవా సంస్థలను లాభాల దృష్టిలో చూడొద్దని, ప్రజలకు ఏ విదంగా సేవలు అందుతున్నాయో చూడాలన్నారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం, కార్పొరేషన్ ఇవ్వాల్సిన బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులపై అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. లేకుంటే ఆర్టీసీ మనుగడకే ప్రమాదం వాటిల్లే పరిస్థితులు ఉన్నాయన్నారు. ఈ సందర్బంగా వివిధ డిపోల ఇతర యూనియన్ లలో నుండి కార్మికులు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న సమక్షంలో వందల సంఖ్యలో ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరారు. ఈ సందర్బంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ మెదక్రీజియన్ నాయకులు ఎన్ ప్రసాద్ రెడ్డి, టిఎల్ రావు, జి. శేషు, మెదక్ డిపో గౌరవ అధ్యక్షులు టి .సుభాష్ చంద్ర భోస్,మెదక్ డిపో నాయకులు సర్వన్, కిష్టయ్య, అనంతం, మల్లేష్, దేవేందర్ గౌడ్, శేఖర్ గౌడ్, ఆంజనేయులు యేసు, షకీల్, శేఖమ్మ, శ్రవంతి, భాగ్యమ్మ, మేనక, నరేందర్ మరియు వివిధ డిపోల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫామ్ పాండ్లు, నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి

- జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్



**ఖమ్మం కార్పొరేషన్, జూలై 14 (జనం సాక్షి) :** జిల్లాలో తక్కువ వర్షపాతం నేపథ్యంలో ఫామ్ పాండ్ల ఏర్పాటు, నీటి సంరక్షణ కార్యక్రమాలను ఉద్యమంలా చేపట్టి భూగర్భ జలాల పెంపుతో పాటు రైతులను తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ, జూలై నెలాఖరులోగా ఫామ్ పాండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి పనులు ప్రారంభించాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీలో ఐదు కమ్యూనిటీ సోక్‌పిట్లు నిర్మించి, ఆగస్టు 15లోపు నీటి సంరక్షణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వరి, పత్తికి బదులుగా కంది, పెసర, చిరుధాన్యాల వంటి స్వల్పకాలిక పంటలను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.ప్రతి గ్రామపంచాయతీలో ఐదు కమ్యూనిటీ సోక్‌పిట్లు నిర్మించాలని, స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామపంచాయతీ నిధులను వీబీజీఆర్ఏఎంజీ నిధులతో అనుసంధానం చేసి ఆగస్టు 15లోపు అన్ని నీటి సంరక్షణ నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు.

# పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయాలి

- పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం కార్పొరేషన్, జూలై 14 (జనం సాక్షి) :** పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తిచేసి అభియోగపత్రాన్ని నిర్ణీత గడువులోగా న్యాయస్థానంలో సమర్పించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ అధికారుల నేరసమీక్ష సమావేశం పోలీస్ కాన్ఫిరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ...నేర విచారణలో నిందితులకు శిక్షల శాతం పెరగడం అత్యంత ముఖ్యమని, దీనికోసం పకడ్బందీ దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, పోలీసు–ప్రాసిక్యూషన్ సమన్వయం అవసరమన్నారు. కొత్త చట్టాల ప్రకారం నిర్ణీత గడువులోగా ట్రయల్ పూర్తి చేయాలని, సాక్షులు భయపడకుండా భరోసా కల్పిస్తూ...న్యాయస్థానానికి హాజరయ్యేలా చూడాలన్నారు. ఎన్డీపీఎస్ కేసులో న్యాయస్థానంలో నేరాన్ని రుజువు చేయడానికి ఆయా కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయి / మాదకద్రవ్యాల స్వభావం, పరిమాణాన్ని శాస్త్రీయంగా నిర్ధారించే ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీ నివేదిక ప్రధాన ఆధారమని అన్నారు. అదేవిదంగా జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలను అరికట్టడానికి స్పెషల్ దృష్టి పెట్టాలని, ఈగల్ బృందాలు, టాస్క్ ఫోర్స్, స్థానిక పోలీసుల సమన్వయంతో మూలలను కనిపెట్టాలని అన్నారు. వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తూ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. చోరీల నివారణకు, దొంగిలించబడిన సొత్తును బాధితులకు తిరిగి అప్పగించడానికి పోలీసులు సాంకేతికతను ఉపయోగిస్తూ రికవరీపై ప్రత్యేక దృష్టి పెట్టాలాని, నిందితుల గుర్తింపు, రికవరీ వేగవంతం చెయాలన్నారు.

విచారణలో భాగంగా ప్రతి కేసు ను సాంకేతిక ఆధారాలు, ఫోరెన్సిక్ సాక్ష్యాలు, డిజిటల్ సాక్ష్యాలను సమర్థవంతంగా వినియోగించి దర్యాప్తు చేపట్టాలని సూచించారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేస్తూ...నేరాలు జరిగిన తరువాత స్పందించడం కంటే..ముందస్తు నివారణ చర్యలు తీసుకోవడమే సమర్థవంతమైన పోలీసింగ్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. శాంతిభద్రతలు,నేరాల ధోరణి, పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్, పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే హాట్‌స్పాట్‌లు లేదా బ్లాక్ స్పాట్‌లలో ప్రాణనష్టాన్ని నివారించడానికి రోడ్డు భద్రతా చర్యలు, ఇంజనీరింగ్ మార్పులు, కఠినమైన ట్రాఫిక్ నియంత్రణలు చాలా ముఖ్యన్నారు. ప్రమాదకర మలుపులు, కూడళ్ల వద్ద స్పష్టమైన సైన్‌బోర్డులు, బ్లింకర్స్, స్పీడ్ బ్రేకర్లు, రంబిల్ స్ట్రిప్స్, గరిష్ఠ వేగపరిమితి సూచికలు పెట్టడం, రాత్రి సమయంలో స్పష్టత కోసం సోలార్ లైట్లు, వీధి దీపాలు మెరుగుపరచడం. గుంతలను పూడ్చడం, జారుడు రోడ్లకు తగిన గుర్తులు వేయడం వంటి చర్యలు సంబంధిత అధికారుల సమన్వయంతో ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీలు వసుందర యాదవ్, రమణమూర్తి, తిరుపతి రెడ్డి, సారంగపాణి, ఫణిందర్,నర్సింహారావు, సర్వర్, సత్యనారాయణ, సాంబరాజు పాల్గొన్నారు.




# చమురు ధరలకు రెక్కలు.. సూచీల నేల చూపులు






## భారత్‌లో క్లాడ్ ఏఐ సబ్‌స్క్రిప్షన్ ప్రకటించిన ఆంథ్రోపిక్..

**న్యూఢిల్లీ:**ఆంథ్రోపిక్ భారత్‌లో తన క్లాడ్ ఏఐ సబ్‌స్క్రిప్షన్ ధరలను ప్రకటించింది. దీంతో ఇక్కడి వినియోగదారులకు చెల్లింపులు మరింత సులభతరం కానున్నాయి. ఇకపై డాలర్లకు బదులుగా రూపాయిల్లోనే చెల్లింపులు చేయొచ్చు. మొబైల్, వెబ్ యూజర్ల కోసం పెయిడ్ ప్లాన్‌లను అందుబాటులోకి తెచ్చింది. భారత్‌తో క్లాడ్ ప్రో, మ్యాక్స్, టీమ్ పేరిట మూడు రకాల సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌లను ఆంథ్రోపిక్ తీసుకొచ్చింది. జీఎస్‌టీతో కలుపుకొని ఈ ప్లాన్ ధరలను ప్రకటించింది. క్లాడ్ ప్రో సబ్‌స్క్రిప్షన్ ధర నెలకు రూ. 2000గా కంపెనీ నిర్ణయించింది. క్లాడ్ మ్యాక్స్ ధర నెలకు రూ. 11,999 నుంచి ప్రారంభమవుతుంది. గరిష్ఠంగా రూ. 23,999 వరకు ఉంటుంది. క్లాడ్ టీమ్ ధర నెలకు రూ. 2,399 నుంచి మొదలై ప్రీమియం ప్లాన్ ధర రూ. 11,999 వరకు ఉంటుంది. అమెరికా తర్వాత క్లాడ్ ఏఐకి భారత్ రెండో అతిపెద్ద మార్కెట్‌గా ఉంది. అంతర్జాతీయ యూజర్లలో 5.8 శాతం మంది ఇక్కడి నుంచే ఉన్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకు భారతీయ కరెన్సీలో బిల్లింగ్ విధానం తీసుకొచ్చింది. వ్యాపార లావాదేవీలు సులభతరం చేయడానికి ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ రేజర్‌పేతోనూ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో బెంగళూరులో తన కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది.

### అమెరికా, యూరప్ మార్కెట్లకు వన్‌ప్లస్ గుడ్‌బై!

**న్యూఢిల్లీ:**ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ వన్‌ప్లస్ మరోసారి వార్తల్లో నిలిచింది. అమెరికా, యూరోపియన్ మార్కెట్లకు ఈ కంపెనీ స్వస్తి పలికేందుకు సిద్ధమైనట్లు సమాచారం. అక్కడ కార్యకలాపాలను నిలిపివేయబోతోందని జర్మనీకి చెందిన విన్‌ఫ్యూచర్ నివేదిక పేర్కొంది. వారం రోజుల్లో దీనిపై కంపెనీ నుంచి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే వన్‌ప్లస్ ఫోన్లు వాడుతున్న యూరప్, అమెరికా వినియోగదారులకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు, సేవల పరంగా ఎలాంటి ఇబ్బందులూ ఉండవని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇచ్చిన కాలపరిమితి వరకు సేవలు కొనసాగించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం స్టాక్ అయిపోయాక ఎలాంటి కొత్త ఫోన్లను లాంచ్ చేయబోదని తెలుస్తోంది. అదే సమయంలో భారత్, చైనా వంటి ఇతర మార్కెట్లలో మాత్రం తన కార్యకలపాలను యథావిధిగా కొనసాగిస్తుందని సమాచారం.

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా మళ్లీ క్రూడాయిల్ ధరలు పెరగడం, వడ్డీ రేట్లు పెరుగుతాయన్న భయాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి మిశ్రమ సంకేతాల నడుమ మన మార్కెట్ సూచీలూ నష్టాలు చవిచూశాయి. ముఖ్యంగా ఆటో, ఫైనాన్షియల్, ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీలపై ప్రభావం చూపింది. దీంతో బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ. 3 లక్షల కోట్ల మేర ఆవిరైంది. సెన్సెక్స్ ఉదయం 77,272.34 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,616.40) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లో కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 600 పాయింట్లకు పైగా నష్టంతో 77,001.48 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 561.46 పాయింట్ల నష్టంతో 77,054.94 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 158.95 పాయింట్ల నష్టంతో 24,052.05 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.22గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎస్‌బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండిగో షేర్లు ప్రధానంగా నష్టాలు చవిచూశాయి. భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా, టాటా స్టీల్, టీసీఎస్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభపడ్డాయి.

ఎందుకు పడ్డాయ్?

ఇరాన్– అమెరికా మధ్య ఉద్రిక్తతలు మళ్లీ తీవ్ర రూపం దాల్చడం స్టాక్‌మార్కెట్‌పై ప్రభావం చూపాయి. ఇరు దేశాల మధ్య మళ్లీ అగ్గి రాజుకోవడంతో అంతర్జాతీయంగా చమురు




సరఫరాకు విఘాతం కలుగుతుందన్న భయాలు నెలకొన్నాయి. దీంతో చమురు ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర ఏకంగా 87 డాలర్ల స్థాయికి చేరడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతీసింది. అటు అమెరికా, ఇటు భారత్‌లోనూ ద్రవ్యోల్బణం కారణంగా వడ్డీ రేట్లు పెరగొచ్చన్న అంచనాలూ సూచీలను పడేశాయి. దీనికితోడు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నిరాశజనక ఫలితాలు వెలువరించడం, డాలరుతో రూపాయి మారకం విలువ 96 డాలర్ల స్థాయికి చేరడం ప్రతికూల ప్రభావం చూపింది. అంతకుముందు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ తీవ్రం కావడం, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగిన నేపథ్యంలో మన సూచీలూ నష్టాలతో ఆరంభమయ్యాయి. అయితే ఐటీ షేర్లకు లభించిన కొనుగోళ్ల మద్దతుతో, చివరకు స్వల్ప లాభాలతో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 30 పైసలు తగ్గి 95.68 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 8.93% పెరిగి 82.80 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ. 66,000 కోట్లు పెరిగి రూ. 482.41 లక్షల కోట్లు (5.03 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

మధ్యాహ్నం లాభాల్లోకి..: ఉదయం బీఎస్‌ఈ సెన్సెక్స్ 76,963.35 పాయింట్ల వద్ద నష్టాలతో (క్రితం ముగింపు 77,569.39) ఆరంభమైంది. ఆ తర్వాత నష్టాలను క్రమంగా తగ్గించుకుంటూ మధ్యాహ్నం తర్వాత లాభాల్లోకి వచ్చింది. ఒక దశలో 77,789.29 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 47.01 పాయింట్ల లాభంతో 77,616.40 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 4.10 పాయింట్లు పెరిగి 24,211 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,259.80 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 24,000.20 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని ఈ సూచీ నమోదుచేసింది.

12 పైకి.. 18 కిందకు: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 12 మినహా మిగతావి నష్టాల్లో ముగిశాయి. టాటా స్టీల్ 2.09%, ఎటర్నల్ 1.55%, ఇండిగో 1.52%, మారుతీ సుజుకీ 1.2%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.11%, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ 1.01%, భారతీ ఎయిర్‌టెల్ 1.01%, ఏషియన్ పెయింట్స్ 0.98% తగ్గాయి. టీసీఎస్ 5.43%, హెచ్‌సీఎల్ టెక్ 5.02%, టెక్ మహీంద్రా 3.17%, ఎన్‌టీపీసీ 2.18%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.83% పెరిగాయి.

నష్టపోయిన రక్షణ రంగ షేర్లు..: క్షిపణి తయారీ విభాగంలో ప్రైవేటు సంస్థల ప్రవేశం ఖాయమనే వార్తలతో సోమవారం మార్కెట్లో రక్షణ రంగ షేర్ల ధరలు ఒడిదొడుకులను ఎదుర్కొన్నాయి. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ షేరు ధర సోమవారం బీఎస్‌ఈలో 3.16% క్షీణించి, రూ. 1,302.40 వద్ద ముగిసింది. పోటీ పెరుగుతున్నందున ప్రైవేటు రంగంలోని ఎంటార్ టెక్నాలజీస్ షేరు 5% నష్టపోయి రూ. 6748.90కి చేరింది. అస్ట్రా మైక్రోవేవ్ ప్రోడక్ట్స్ షేరు 4.97% తగ్గి, రూ. 1,714.15 వద్ద ముగిసింది. విద్యుత్ కేబుళ్లు, ట్రాన్స్‌మిషన్ ఉత్పత్తుల తయారీ సంస్థ లేజర్ పవర్ అండ్ ఇన్‌ఫ్రా తొలి పబ్లిక్ ఆఫర్ ముగిసేసరికి 38.94 రెట్ల స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలో 6.59 రెట్లు అధికంగా బిడ్‌లు దాఖలయ్యాయి.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |


**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,53,140 (22 క్యారెట్లు) | ₹ 1,67,064 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,60,000

### చమురు మంటల్లో కరుగుతోన్న సూచీల లాభం..

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా మార్కెట్లు ఒడుదొడుకులను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ప్రారంభయ్యాయి హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలతో చమురు మంటలు భగ్గుమంటున్నాయి. దాంతో సూచీలపై ప్రతికూల ప్రభావం పడింది. హర్మూజ్‌ను దిగ్బంధిస్తున్నాం.. టోల్ వసూలు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో మరోసారి చమురు ధరలు భారీగా పెరిగాయి. నెలరోజుల గరిష్ఠానికి చేరాయి. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ఒక బ్యారెల్‌కు రెండు శాతం పెరిగి 85 డాలర్లకు చేరింది. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ రెండు శాతం పెరిగి 80 డాలర్లకు పెరిగింది. గత సెషన్‌లో 9.6 శాతం పెరిగింది. 2020 మే తర్వాత ఒకేరోజు ఈ స్థాయి పెరుగుదల నమోదైంది. ఈ పరిణామాల నేపథ్యంలో.. ఉదయం 9.39 గంటల సమయంలో సెన్సెక్స్ 412 పాయింట్లు పడిపోయి, 77,203 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 107 పాయింట్లు నష్టపోయి, 24,103 వద్ద కదలాడుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 42 పైసలు పడిపోయి, 96.10కి కుంగింది. నిఫ్టీ సూచీలో హిందాల్కో, సిప్లా, భారతీ ఎయిర్‌టెల్, నెస్లె, టీసీఎస్ షేర్లు లాభాల్లో ఉండగా.. శ్రీరామ్ ఫైనాన్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎంఅండ్ఎం షేర్లు నష్టపోతున్నాయి. ఇక, సోమవారం అమెరికా మార్కెట్లు నష్టపోగా.. ఆసియా మార్కెట్లు అదే బాటలో ఉన్నాయి.



# మొదలైన ఎస్‌బీఐ ఫండ్స్ ఐపీఓ..




**ముంబై:**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుబంధ ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు (ూఃఎ ఈబీనిటబ ఓజీనిజీణవఎవనిబి ఎఖూ) రానుంది. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ పేరిట అతిపెద్ద అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీగా కొనసాగుతోంది. 15.5 శాతం మార్కెట్ వాటా ఉంది. వివిధ పథకాల కింద సుమారు రూ. 12 లక్షల కోట్లకు పైగా ఆస్తులను నిర్వహిస్తోంది. నేటి నుంచి (జులై 14) ఈ పబ్లిక్ ఇష్యూ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఐపీఓకు సంబంధించిన కొన్ని వివరాలు.. పబ్లిక్ ఇష్యూ ద్వారా ఎస్‌బీఐ ఫండ్స్ మార్కెట్ నుంచి రూ. 9,813 కోట్లు సమీకరించనుంది. వాస్తవానికి రూ. 11,693 కోట్ల పబ్లిక్ ఇష్యూ అనుకున్నప్పటికీ ఐపీఓ సైజ్ తగ్గింది. ప్రీ ఐపీఓ ప్లేస్‌మెంట్ ద్వారా యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 1,655 కోట్లు సమీకరించడంతో ఆ మేర పరిమాణం తగ్గింది. జులై 14న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై 16న ముగుస్తుంది. ఐపీఓ ధరల శ్రేణిని రూ. 545–574గా నిర్ణయించారు. సుమారు రూ. 1.17 లక్షల కోట్ల మార్కెట్ విలువతో ఐపీఓకు వస్తోంది. జులై 21న లిస్టింగ్‌కు రానుంది. ఈ పబ్లిక్ ఇష్యూ పూర్తి ఆఫర్ ఫర్ సేల్ (ూఈఖూ) రూపంలో జరగనుంది. కంపెనీకి ఎలాంటి నిధులూ రావు. ఎస్‌బీఐ, అముండీ ఇండియా హోల్డింగ్ ఐపీఓలో భాగంగా తమ వాటాలు విక్రయిస్తున్నాయి.

ఎన్ని షేర్లు కొనాలి?

రిటైల్ ఇన్వెస్టర్లకు 35 శాతం, స్మాల్ హెచ్‌ఎన్ఐలకు 5 శాతం, బిగ్ హెచ్‌ఎన్ఐలకు 10 శాతం, 50 శాతం క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బిడ్డర్లకు రిజర్వ్ చేశారు. రిటైల్ ఇన్వెస్టర్లు ఈ ఐపీఓలో పాల్గొనాలంటే కనీసం 26 షేర్లు (లాట్) కొనుగోలు చేయాల్సి ఉంటుంది. గరిష్ఠ ప్రైస్ బ్యాండ్ వద్ద రూ. 14,924 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. గరిష్ఠంగా 13 లాట్‌లు కొనుగోలు చేయొచ్చు. ఎస్‌బీఐ ఉద్యోగులకు రూ. 170 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను రిజర్వ్ చేశారు. ఒక్కో షేరుపై రూ. 54 డిస్కౌంట్ లభిస్తుంది.

రిస్కులు ఏంటి?

షేర్ మార్కెట్‌లో హెచ్చుతగ్గులు; మ్యూచువల్ ఫండ్స్ ఫీజులు; కమిషన్ల విషయంలో సెబీ ఎప్పటికప్పుడు తీసుకొచ్చే కఠిన నిబంధనలు; ఇప్పటికే ఉన్న కంపెనీలతో పాటు మరిన్ని డిజిటల్ కంపెనీలు అసెట్ మేనేజ్‌మెంట్‌లోకి ప్రవేశిస్తుండడంతో ఆ మేర లాభాల మార్జిన్ తగ్గే అవకాశం ఉంది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, యూటీఐ ఏఎంసీ, ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఏఎంసీ, శ్రీరామ్ ఏఎంసీ, నిప్పాన్ లైఫ్ ఇండియా అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థల నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటోంది. ఆయా కంపెనీలు ఇప్పటికే స్టాక్ మార్కెట్‌లో లిస్టయ్యాయి.

గ్రే మార్కెట్ ప్రీమియం ఎంత?

ఎస్‌బీఐ ఫండ్స్ షేర్లు గ్రే మార్కెట్‌లో (ఉఓఖ) దాదాపు 18 శాతం ప్రీమియంతో ట్రేడవుతున్నాయి. దీంతో రూ. 680 వద్ద షేర్లు లిస్టయ్యే అవకాశం ఉంది. ఇష్యూ ధరతో పోలిస్తే రూ. 106 ప్రీమియంతో షేర్లు లిస్టయ్యే అవకాశం ఉందని జీఎంపీ సూచిస్తోంది. అయితే, జీఎంపీ అంచనాలన్నీ అన్నిసార్లూ నిజం కాకపోవచ్చు. కొన్నిసార్లు అంచనాలు తప్పొచ్చు. కాబట్టి, ఐపీఓకు దరఖాస్తు చేసేముందు కంపెనీ ఆర్థిక పరిస్థితి, భవిష్యత్ వ్యాపారం, వ్యాల్యుయేషన్ వంటి అంశాలను పరిశీలించడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

## ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఎంపిక

**కేంద్రమంత్రి మన్సూఖ్ మాండవియాకు మంత్రుల కృతజ్ఞతలు**

హైదరాబాద్,జూలై14(జనంసాక్షి): 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణను ఎంపిక చేసినందుకుగాను కేంద్ర యువజన వ్యవహారాలు / క్రీడల శాఖ మంత్రి మన్సుక్ మాండవి యాను రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి , రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిలు కలిసి ధన్యవాదములు తెలిపారు. 2026లో నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణను ప్రకటించిన అనంతరం హైదరాబాద్ కు వచ్చిన కేంద్రమంత్రి మన్సుక్ మాండవియను మంత్రి వాకిటి శ్రీహరి కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కేంద్రం ప్రోత్సాహంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను క్రీడారంగంలో అగ్రగామిగా నిలుపుతామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేసారు.

### మూడో భాషపై పరీక్షలు ఉండవు

విధించింది. మూడో భాష.. విదేశీ భాష ఎంచుకునేందుకు వీలు కల్పించింది. ఒక వేళ పది ఇంటర్నల్‌లో తప్పితే.. ఫైనల్ ఫలితాల కంటే ముందే మరోసారి రీ అసెస్‌మెంట్ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. 8వ తరగతిలోని 3 భాషలే తొమ్మిదో తరగతిలోనూ కొనసాగుతాయని తెలిపింది. అయితే, ప్రస్తుత పదో తరగతి విద్యార్థులకు మాత్రం.. పాత విధానమే అమల్లో ఉంటుందని, మూడో భాష నిబంధన వర్తించదని బోర్డు స్పష్టం చేసింది. కొత్త నిబంధనలు 2027–28 పదోతరగతి బ్యాచ్ నుంచి అమలు చేయనున్నట్లు తెలిపింది. ఈ మేరకు ఎన్‌సీఈఆర్‌టీ వెబ్‌సైట్‌లో ఆర్3 మెటీరియల్‌ను అందుబాటులో ఉంచింది.



## వెట్టి చాకిరీ కార్మికులు తయారు చేసే వస్తువులపై భారత్‌లో నిషేధం!

**దిల్లీ:** వెట్టిచాకిరీ చేసే కార్మికులు తయారు చేసే ఉత్పత్తులు, వస్తువుల దిగుమతులపై భారత్ కీలక నిర్ణయం తీసుకుంది. ఫారిన్ ట్రేడ్ పాలసీని (ఈఖఖ) సవరిస్తూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఎప్పటికప్పుడు ఈ ఉత్పత్తులపై విచారణ జరిపి ప్రభుత్వం నిషేధం విధించేందుకు ఈ సవరణ వీలుకల్పిస్తుంది. దీనిపై అధికారిక గెజిట్ వెలువడిన నెల రోజుల తర్వాత కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. అంతర్జాతీయ కార్మిక చట్టాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఈ మార్పు చేసింది. వెట్టిచాకిరీలో ఉన్న కార్మికులు తయారుచేసిన వస్తువులను తమకు ఎగుమతి చేయడం, అదనపు పారిశ్రామిక సామర్థ్యానికి సంబంధించిన ఆందోళనలపై ఈ ఏడాది మార్చి 11, 12 తేదీల్లో రెండు విచారణలను అమెరికా వాణిజ్య ప్రతినిధి బృందం ప్రారంభించింది. ఈ జాబితాలో భారత్ కూడా ఉంది. దీంతో తన వాణిజ్య భాగస్వాములపై అదనపు సుంకం విధించాలని అమెరికా ప్రతిపాదించింది. బలవంతపు చాకిరీ నిర్మూలనకు తమ వాణిజ్య భాగస్వాములు చర్యలు తీసుకుంటున్నాయనా లేదా అనే అంశంపై అమెరికా ప్రస్తుతం దర్యాప్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో భారత్ నుంచి ఈ నిర్ణయం వెలువడింది. బలవంతపు చాకిరీ ద్వారా తయారు చేసిన ఉత్పత్తులను దిగుమతి అవుతున్నట్లు కేంద్రం దృష్టికొస్తే.. దానిపై విచారణ జరిపి ఎప్పటికప్పుడు వాటిపై నిషేధం విధిస్తూ వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేస్తుంది.

## మిన్నంటిన ఆందోళనలు

తెగిపోయాయని నిరసనకారులు పేర్కొన్నారు. ఆ ఘర్షణల నేపథ్యంలో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పీవోకే ప్రజలు పేర్కొంటున్నారు. తమ ప్రాణాలను కాపాడాలని.. మానవతా సాయాన్ని అందించడంలో జోక్యం చేసుకోవాలని భారత్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు. తమకు మానవతా సాయం అందేలా పూంఛ్, దోడా సెక్టార్ల వద్ద నియంత్రణ రేఖను తెరవాలని కోరారు.

**పాకిస్థాన్‌పై భారత్ విమర్శలు**

పీవోకేలో కొనసాగుతున్న పాక్ దమనకాండను భారత్ తీవ్రంగా విమర్శించింది ఎన్నో ఏళ్లుగా ఆ ప్రాంతంలో జరుగుతున్న వ్యవస్థాగత దోపిడీ, బలవంతపు ఆక్రమణలు, పరిపాలనాపరమైన అణచివేత వల్లే ఈ ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయని విదేశాంగ మంత్రిత్వ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ పేర్కొన్నారు. ఆహారం, మందులతో సహా నిత్యావసర వస్తువుల సరఫరా నిలిపివేత, ఇంటర్నెట్ బ్లాక్ అవుట్, ప్రజలను తీవ్రంగా హింసించడం పాక్ క్రూరత్వానికి నిదర్శనమని విమర్శించారు.

**వైట్‌హౌస్‌ను తాకిన నిరసన సెగలు..**

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజలపై పాక్ అణచివేత ధోరణిని వ్యతిరేకిస్తూ.. అమెరికాలో స్థిరపడిన పీవోకే పౌరులు.. అధ్యక్ష కార్యాలయం ముందు నిరసన చేపట్టారు.

## జూన్ ఎగుమతుల్లో 15.5% వృద్ధి

దిల్లీ: ఈ ఏడాది జూన్‌లో మనదేశం నుంచి 40.41 బిలియన్ డాలర్ల (రూ. 3.84 లక్షల కోట్లు) విలువైన ఎగుమతులు జరిగాయి. గతేడాది జూన్ ఎగుమతులు 34.98 బి.డా. కంటే ఇవి 15.5% అధికం. ఇదే సమయంలో ముడిచమురు అధిక ధరల వల్ల, దిగుమతులు బిల్లు భారం 31% వృద్ధితో 70.84 బి.డాలర్లకు చేరింది. ఫలితంగా వాణిజ్య లోటు 5 నెలల గరిష్ఠమైన 30.43 బిలియన్ డాలర్లు (రూ. 2.89 లక్షల కోటు)గా నమోదైంది. ముడిచమురు దిగుమతులు 40% అధికమై 19.32 బి.డాలర్లకు పెరిగాయి. జూన్ ప్రథమార్ధంలో 90 డాలర్లుగా ఉన్న బ్యారెల్ ముడిచమురు ధర, ప్రస్తుతం 80 డాలర్ల దిగువకు చేరింది. గత నెలలో ఎలక్ట్రానిక్స్ దిగుమతులు 58.77% పెరిగి 13.4 బి.డాలర్లకు, యంత్రాలు 30.9% పెరిగి 5.8 బి.డాలర్లకు, పసిడి 7% వృద్ధితో 2 బిలియన్ డాలర్లకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూన్‌లో ఎగుమతులు 15.92% పెరిగి 129.32 బి.డాలర్లకు చేరాయి. ఇదే సమయంలో దిగుమతులు 19.89% అధికమై 216.18 బి.డాలర్లుగా నమోదయ్యాయి. వాణిజ్య లోటు 68.75 బి.డాలర్ల నుంచి 86.86 బి.డాలర్లకు చేరింది. పసిడి దిగుమతులు 2025 ఏప్రిల్–జూన్‌లో 7.49 బి.డాలర్లు కాగా, ఈ ఏడాది ఇదే త్రైమాసికంలో



11.01 బి.డాలర్లకు పెరిగాయి. అమెరికాకు తగ్గిన ఎగుమతులు: జూన్‌లో అమెరికాకు భారత ఎగుమతులు 1.21% తగ్గి 8.17 బి.డాలర్లకు పరిమితమయ్యాయి. దిగుమతులు మాత్రం 33.86% పెరిగి 5.5 బి.డాలర్లుగా నమోదయ్యాయి. 2025 జూన్‌లో అమెరికాకు భారత ఎగుమతులు 8.27 బి.డాలర్లుగా, అక్కడ నుంచి దిగుమతులు 4.11 బి.డాలర్లుగా ఉన్నాయి.

**జూన్‌లో రిటెయిల్ ద్రవ్యోల్బణం 4.38%**

ఈ ఏడాది జూన్‌లో దేశీయంగా రిటెయిల్ ద్రవ్యోల్బణం 4.38 శాతానికి పెరిగింది. ఆహార వస్తువులు ప్రియం కావడంతో, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మధ్యస్థ లక్ష్యిత స్థాయి 4% కంటే పైకి ద్రవ్యోల్బణం చేరింది. 2024ను ఆధార సంవత్సరంగా తీసుకున్న కొత్త సిరీస్ ఈ ఏడాది జనవరిలో ప్రారంభయ్యాక, రిటెయిల్ ద్రవ్యోల్బణం 4 శాతాన్ని మించడం ఇప్పుడే. ఈ ఏడాది మే నెలలో రిటెయిల్ ద్రవ్యోల్బణం 3.93 శాతంగా నమోదైంది. జాతీయ గణాంక కార్యాలయం విడుదల చేసిన సీపీఐ గణాంకాల ప్రకారం.. అధిక ద్రవ్యోల్బణం నమోదు చేసిన టాప్–5 వస్తువుల్లో వెండి, పసిడి, వజ్రాలు, ప్లాటినమ్ ఆభరణాలు, అల్లం, టమాటా, కిస్మిస్, మొనాకా ఉన్నాయి. అత్యల్ప ద్రవ్యోల్బణం నమోదైన వాటిలో బంగాళాదుంపలు, బఠానీలు, మోటారు కారు, జీపు, జీలకర్ర, మోటార్‌సైకిల్, స్కూటర్లు ఉన్నాయి. జాతీయ సగటు ద్రవ్యోల్బణం 4.38 శాతంగా ఉంటే, గ్రామీణ ప్రాంతాల్లో ఇది 4.74%, పట్టణ ప్రాంతాల్లో 3.92 శాతంగా నమోదైంది. రాష్ట్రాల వారీగా చూస్తే రిటెయిల్ ద్రవ్యోల్బణం తెలంగాణలో అత్యధికంగా 6.36 శాతంగా నమోదైంది. అత్యల్పంగా మిజోరంలో 1.63 శాతానికి పరిమితమైంది. 'పెట్రోలు, డీజిల్ ధరలు పెంచిన తర్వాత తొలి పూర్తి నెల (జూన్‌లో) ద్రవ్యోల్బణం 4.38 శాతానికి పెరిగింది. ఇక్రా అంచనా వేసిన 4.3% కంటే కొద్దిగా ఎక్కువగా నమోదైంది. ఆహార వస్తువులు, పానీయాలు, రవాణా, రెస్టారెంట్ల విభాగాల నుంచి ద్రవ్యోల్బణం పెరిగింది. ఆగస్టు సమీక్షలో ఆర్‌బీఐ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచేందుకే మొగ్గు చూపొచ్చ'ని ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితి నాయర్ వెల్లడించారు.

# ఆహార నాణ్యత, పరిశుభ్రత రేటింగ్స్ పారదర్శకంగా ఉండాలి

- ఆహార భద్రత, వినియోగదారుల రక్షణకు సైబరాబాద్ సీఎంసీ కీలక చర్యలు
- స్విగ్గీ, జొమాటోలకు ఆదేశాలు
- చెల్లుబాటు అయ్యే లైసెన్సులు ఉన్న సంస్థలనే నమోదు చేయాలి
- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు



**శేరిలింగంపల్లి, జూలై 14 (జనంసాక్షి) :** ఆహార భద్రత, ప్రజారోగ్యం, వినియోగదారుల రక్షణను మరింత బలోపేతం చేసే దిశగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ముందుకు సాగుతున్నారు. సీఎంసీ పరిధిలో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫారమ్‌లలో నమోదైన ఆహార వ్యాపార సంస్థల ఆన్‌బోర్డింగ్, పర్యవేక్షణ మరియు నిర్వహణకు సంబంధించి స్విగ్గీ, జొమాటో సంస్థలకు ఈ సందర్భంగా కీలక ఆదేశాలను జారీ చేసింది.
చెల్లుబాటు అయ్యే ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్/రిజిస్ట్రేషన్ మరియు సీఎంసీ జారీ చేసిన ట్రేడ్ లైసెన్స్ కలిగిన ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లను మాత్రమే తమ ప్లాట్‌ఫారమ్‌లలో నమోదు చేయాలని ఆదేశించింది. లైసెన్స్ గడువు ముగిసిన, సస్పెండ్ లేదా రద్దు చేయబడిన లేదా సీఎంసితోపాటు ఇతర సంబంధిత అధికార సంస్థలు డీ-లిస్ట్ చేయాలని ఆదేశించిన ఆహార వ్యాపార సంస్థలను తక్షణమే ప్లాట్‌ఫారమ్ నుంచి సస్పెండ్ లేదా తొలగించాలని సీఎంసీ కార్యాలయం స్పష్టం చేసింది. ఆహార నాణ్యత రేటింగ్స్, పరిశుభ్రత రేటింగ్స్, వినియోగదారుల సమీక్షలకు సంబంధించి అనుసరిస్తున్న ప్రమాణాలు, విధానాలను పారదర్శకత మరియు నియంత్రణ సమీక్ష కోసం సీఎంసీకి సమర్పించాలని సంబంధించిన ఫుడ్ డెలివరీ సంస్థలకు సూచించింది.
సమాచార మార్పిడి, కంప్లయన్స్ నివేదికలు, తనిఖీలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం నోడల్ అధికారిని నియమించి సీఎంసితో అధికారిక కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్విగ్గీ, జొమాటో సంస్థలను ఆదేశించింది. వినియోగదారులు ఇచ్చే ప్రతికూల సమీక్షలు, రేటింగ్స్‌ను తొలగించడం, మార్చడం లేదా దాచిపెట్టడం చేయరాదని, తప్పనిసరిగా వినియోగదారుల ఫీడ్‌బ్యాక్ విధానం ప్రకారం అవసరమైన సందర్భాల్లో మాత్రమే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ప్లాట్‌ఫారమ్‌లో నమోదైన ప్రతి ఆహార సంస్థ యొక్క ఖచ్చితమైన జియో-లొకేషన్‌ను ధృవీకరించి అనుమతి పొందిన, నమోదైన ప్రాంగణం నుంచే ఆహారం తయారుచేసి డెలివరీ చేయబడుతున్నట్లు నిర్ధారించాలని సూచించింది. ప్రతి ఆహార వ్యాపార సంస్థ వద్ద చెల్లుబాటు అయ్యే సీఎంసీ ట్రేడ్ లైసెన్స్ ప్రదర్శనను నిర్ధారించడంతోపాటు లైసెన్స్ చెల్లుబాటును క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించింది. సీఎంసీ పరిధిలో తమ ప్లాట్‌ఫారమ్‌లలో నమోదైన ఆహార సంస్థల జాబితాతో పాటు వివరణాత్మక కంప్లయన్స్ నివేదికను వారం రోజుల్లో సమర్పించాలనిఓస్విగ్గీ, జొమాటో సంస్థలకు సీఎంసీ స్పష్టం చేసింది. ఈ ఆదేశాలను పాటించని పక్షంలో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ 2006, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ రెగ్యులేషన్స్, జీహెచ్ఎంసీ యాక్ట్ 1955లోని వర్తించే నిబంధనలు, ఇతర మున్సిపల్ చట్టాల ప్రకారం చర్యలు తీసుకోబడతాయని కమిషనర్ స్పష్టం చేశారు.

# వరదనీటి కాల్వ నిర్మాణంతో శాశ్వత పరిష్కారం

- సరోవర్ ఎన్‌క్లేవ్ కాలనీలలో యూసీడీ సమస్య పరిష్కారానికి అరికెపూడి గాంధీ చర్యలు
- వైశాలి నగర్, సరోవర్ ఎన్‌క్లేవ్‌లలో క్షేత్రస్థాయి పర్యటన
- చెరువు సుందరీకరణ, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి
- ప్రజల సౌకర్యమే ప్రధాన లక్ష్యం



**శేరిలింగంపల్లి, జూలై 14 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధి వైశాలి నగర్, సరోవర్ ఎన్‌క్లేవ్ కాలనీలలో నెలకొన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్య పరిష్కారానికై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానికులతో కలిసి అవుట్‌లెట్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ వైశాలి నగర్ మరియు సరోవర్ ఎన్‌క్లేవ్ కాలనీలలో నెలకొన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని, వరదనీటి కాల్వ నిర్మాణం పనులు చేపడుతున్నామని తెలిపారు.వరదనీటి ప్రవాహాన్ని పరిగణలోకి తీసుకోవాలని, మళ్లీ వరద ముంపు సమస్య పునరావృతం కాకుండా కాల్వ నిర్మాణం చేపట్టాలని, నిర్మాణపు పనులపై అధికారులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఈర్ల చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులు చేపడుతున్నామని, త్వరలోనే చెరువును అన్ని హంగులతో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. చెరువులో కలుషితనీరు కలవకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, చెరువు చుట్టూ డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు.
శేరిలింగంపల్లి పరిధిలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని, ఈ క్రమంలో వరదనీటి కాల్వ నిర్మాణం పనులను ఎలాంటి రాజీ లేకుండా నాణ్యత ప్రమాణాలతో కూడిన విధంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ఆయన అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామని, శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన ప్రజా జీవనాన్ని పొందేలా సహకారం అందిస్తానని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్ మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య కార్మికులకు ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ

**నమస్తే డే,అమృత్ 3.0 కార్యక్రమాలలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్**

**శంకర్ పల్లి, జూలై 14(జనం సాక్షి) :** పారిశుద్ధ కార్మికులకు ఆరోగ్య అవగాహన పై శిక్షణ వారి జీవన ప్రమాణాలను మెరుపు పరచటమే ప్రధాన లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ అన్నారు. నమస్తే డే సందర్భంగా మంగళవారం పారిశుద్ధ్య కార్మికులకు మరియు ఇన్ఫార్మల్ వేస్ట్ పిక్కర్స్ అనగా అనధికార చెత్త సేకరణదారులకు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణాన్ని శుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని,వారి ఆరోగ్యం, భద్రత ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. అనంతరం అమృత్ 3.0 కార్యక్రమంలో భాగంగా క్యాచ్ ది రెయిన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ముఖ్య ఉద్దేశం వర్షపు నీటిని పొదుపు చేయుటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో హోర్డింగ్స్‌ఏర్పాటు చేశామని అన్నారు. మోడల్ స్కూల్ రేయిన్ వాటర్ హార్వెస్టింగ్ ఫిట్ ఏర్పాటు చేశారు.వర్షపు నీటిని వృథా చేయకుండా భూగర్భ జలాలు తీసుకోవాల్సిన వాటి గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ యోగేష్,మల్లేష్, ఆనంద్,కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో ఆటలొద్దు

- రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల వెంటనే విడుదల చేయాలి
- ఇందిరా పార్కు వద్ద సత్యగ్రహ దీక్ష చేపట్టిన ఆర్.కృష్ణయ్య
- దీక్షలో పాల్గొన్న మండల సంక్షేమ సంఘం అధ్యక్షులు గూజ్జారి రాఘువేందర్



**తలకొండపల్లి జూలై 14(జనంసాక్షి):** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని నిరసిస్తూ..హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య సత్యాగ్రహ దీక్ష,ను చేపట్టారు.దీక్షకు సంఘీభావంగా తలకొండపల్లి సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు గుజ్జారి రాఘువేందర్ దీక్షలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కింద పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయడంలో ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తోందని ఆయన ఆరోపించారు.విద్యార్థుల జీవితాలతో ఆటలోద్దని తెలిపారు.సుమారు రూ.8 వేల కోట్ల బకాయిలు విడుదల కాకపోవడంతో రాష్ట్రంలోని దాదాపు 14 లక్షల మంది విద్యార్థుల ఉన్నత విద్య తీవ్రంగా దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.లేనిచో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు.

# కులాలను కించపరిచే వ్యాఖ్యలు సహించం

- అనుచిత వ్యాఖ్యలపై అధిష్టానం చర్యలు తీసుకోవాలి: యువజన కాంగ్రెస్ నేతలు
- బీసీ వర్గాల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలపై ఆగ్రహం
- శివ చరణ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కాంగ్రెస్ ఎప్పుడూ అండగానే ఉంటుందన్న నేతలు



**హయత్‌నగర్, జూలై 14 (జనం సాక్షి):** కాంగ్రెస్ పార్టీలో కులాలను కించపరిచే సంస్కృతికి ఎప్పుడూ చోటు లేదని, బీసీ వర్గాల మనోభావాలను దెబ్బతీసేలా ఎవరైనా వ్యాఖ్యలు చేసినా పార్టీ సహించదని యువజన కాంగ్రెస్ మాజీ, ప్రస్తుత నాయకులు స్పష్టం చేశారు. ఇటీవల యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి, ఆయన తండ్రి ప్రభాకర్ రెడ్డి చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలు యాదవ, గౌడ తదితర బీసీ వర్గాలను తీవ్రంగా బాధించాయని వారు అన్నారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో యువజన కాంగ్రెస్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు భీమిడి రామకృష్ణారెడ్డి, పర్వతి గణేష్ రెడ్డి, పన్యాల జైపాల్ రెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినయ్ పటేల్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి నికేష్ తదితరులు మాట్లాడారు. అవగాహన లేకుండా చేసిన వ్యాఖ్యలు పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించాయని, కాంగ్రెస్ పార్టీ భావజాలానికి పూర్తిగా విరుద్ధమని పేర్కొన్నారు.
కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, అట్టడుగు వర్గాల అభ్యున్నతికే కట్టుబడి పనిచేసిందని గుర్తు చేశారు. బీసీ వర్గాలపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న శివ చరణ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ క్రమశిక్షణను దెబ్బతీసేలా ఎవరైనా వ్యవహరిస్తే, వారు ఎంతటి పదవిలో ఉన్నా అధిష్ఠానం తగిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. గత రెండు రోజులుగా ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో చోటుచేసుకున్న పరిణామాలను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి, ఆర్‌డీసీ మాజీ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి సమీక్షిస్తున్నారని తెలిపారు. ఈ అంశాన్ని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు వెల్లడించారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం పార్టీ అధిష్ఠానం తగిన నిర్ణయం తీసుకుంటుందనే విశ్వాసం వ్యక్తం చేశారు.
గత రెండు రోజుల పరిణామాల వల్ల ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేసిన నాయకులు, పార్టీ బలోపేతం కోసం ఎన్నో ఏళ్లుగా కార్యకర్తలు అంకితభావంతో పనిచేస్తున్నారని చెప్పారు. పార్టీ ఐక్యత, క్రమశిక్షణ, సామాజిక న్యాయ విలువలను పరిరక్షించేలా నాయకత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు.దీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ వారి హక్కులు, గౌరవం కోసం నిలబడుతుందని భరోసా ఇచ్చారు. సమస్య పరిష్కారానికి పార్టీ అధిష్ఠానం ఇప్పటికే చర్యలు ప్రారంభించిందని తెలిపారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి దుర్గేష్, ఉపాధ్యక్షులు కోటేష్, వంశీ, మధుసూదన్, శ్రీనివాస్, హరి తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీదేవి పల్లి రిజర్వేర్ భూ సర్వే షురూ!

- అధికారులను ఆదేశించిన అడిషనల్ కలెక్టర్ చంద్రరెడ్డి!
- మండలానికి చెందిన 265 ఎకరాల భూమి సర్వే పూర్తి చేయాలి



**జిల్లేడు చౌదరిగూడ (జనంసాక్షి) :** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా లక్ష్మీదేవి పల్లి రిజర్వేర్ భూ సర్వే చేసేందుకు ఎట్టకెలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది ఇందులో భాగంగా మంగళవారం నాడు అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి జిల్లేడు చౌదరి గుడా ఎంపీడీవో కార్యాలయంలో మూడు డిపార్ట్మెంట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు ఇందులో లక్ష్మి దేవి పల్లి రిజర్వాయర్ భూ సర్వే నేటి నుంచే ప్రారంభించాలని ఆదేశించారు. 3రోజులో జిల్లేడు చౌదరిగూడ మండల పరిధికి చెందిన 265 ఎకరాల 30 గుంటల భూమి సర్వే పూర్తి చేసి రిపోర్టు అందించాలని పాత్రికేయుల ముకంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భూమి కోల్పోయిన రైతులకు ప్రభుత్వం తగిన సహాయం అందిస్తుందని తెలపాలని పేర్కొన్నారు. లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ భూ సర్వేకు రైతులందరూ సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సరిత, తహసీల్దార్ జగదీశ్వర్,ఉప తహసీల్దార్ భాస్కర్. ఆర్ఐ. సీనియర్ అసిస్టెంట్ మహేందర్. ఇరిగేషన్ అధికారులు. జిల్లా సర్వే అధికారి, విద్యుత్ అధికారులు ఏడి, ఏఈ, మండల వ్యవసాయ అధికారి రాజేందర్ రెడ్డిలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్

**వెంటనే డిజిటలైజేషన్ చేయాలి: అదనపు కలెక్టర్ విక్టర్**



**పెద్ద కొడప్గల్ జూలై 14 (జనంసాక్షి):** ఎన్యూమరేషన్ పత్రాలను వెంటవెంటనే డిజిటలైజేషన్ చేయాలని కామారెడ్డి అదనపు కలెక్టర్ వి. విక్టర్ తెలిపారు. మంగళవారం పెద్ద కొడప్గల్ మండలంలోని చిన్న తక్కడ్ పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్యూమరేషన్ పత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. తహశీల్దార్ రాజశేఖర్ మండల వ్యాప్తంగా ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ 77 శాతం పూర్తయిందని తెలుపగా సంతోషం వ్యక్తం చేస్తూ 100 శాతం పూర్తి దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వినోద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్యామప్ప పటేల్, పోచారం సర్పంచ్ బాలాజీ రావు పటేల్, బూత్ స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పేద మహిళ మహిళా సంఘంలో సభ్యురాలే కావాలి

**కామారెడ్డి, జూలై 14 (జనం సాక్షి):**
జిల్లాలో మహిళా సంఘాల్లో సభ్యత్వం లేని ప్రతి పేద మహిళను స్వయం సహాయక సంఘాల్లో చేర్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), సెర్ప్ ఆధ్వర్యంలో మంగళవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఏపీఎంలు, సీసీల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సెర్ప్ సీఈవో జూలై నెలను లిలి"ప్రత్యేక మహిళా సంఘాల సభ్యత్వ నమోదు మాసం"లిలిగా ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో ఒక్క అర్హురాలు కూడా సంఘానికి దూరంగా ఉండకూడదని స్పష్టం చేశారు. సంఘాల్లో సభ్యత్వం కల్పించడం ఏపీఎంలు, సీసీల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లాలో ఆశించిన స్థాయిలో సభ్యత్వ నమోదు జరగడం లేదని పేర్కొంటూ, అర్హులైన ప్రతి దివ్యాంగుడు, 60 ఏళ్లు దాటిన ప్రతి మహిళను సంబంధిత సంఘాల్లో ఈ నెలాఖరులోగా చేర్చాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.
ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మొత్తం 33,102 మంది మహిళలకు చీరలు పంపిణీ చేయగా, అందులో 20,619 మంది మహిళలను మహిళా సంఘాల్లో సభ్యులుగా చేర్చాలని సెర్ప్ లక్ష్యంగా నిర్దేశించిందని తెలిపారు. ఈ లక్ష్యాన్ని జూలై 31లోగా తప్పనిసరిగా పూర్తి చేయాలని ఏపీఎంలు, సీసీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గ్రామ సంఘాలు, మహిళా సంఘాల ప్రతినిధుల సహకారంతో ఇంటింటికీ వెళ్లి అర్హులైన మహిళలు, దివ్యాంగులు, వృద్ధ మహిళలను గుర్తించి సంఘాల్లో సభ్యులుగా చేర్చే కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి, అదనపు డీఆర్‌డీఓ, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారి పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ

**సిబ్బంది పనితీరును మెరుగుపరచుకోవాలి: డిఎంహెచ్ఓ వెంకట్**

పెద్ద కొడప్గల్ జూలై 14 (జనంసాక్షి): పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డీఎం ఉ హెచ్ఓ డాక్టర్ వెంకట్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష చేశారు. గర్భిణులు, చిన్నపిల్లలకు అందిస్తున్న వైద్య సేవలపై సమీక్షించారు. ఫీవర్ సర్వేతో పాటు ఎన్‌సీడీ స్క్రీనింగ్ చేసి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు.
నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని, సిబ్బంది అందరూ తమ పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు ఉమాకాంత్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రూ.211 కోట్లతో అత్యాధునిక ఈఎస్ఐ ఓపీడీ బ్లాక్ ప్రారంభం






- సనత్‌నగర్‌కు నూతన వైద్య సదుపాయం.. తెలంగాణకు మరిన్ని ఈఎస్ఐ సేవలపై విజ్ఞప్తి
- కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవియా చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- దేశవ్యాప్తంగా రూ.668 కోట్ల ఆరోగ్య ప్రాజెక్టులకు వర్చువల్ ప్రారంభం
- రాష్ట్రానికి కొత్త ఈఎస్ఐ డిస్పెన్సరీలు, డయాలసిస్ కేంద్రాలు మంజూరు చేయాలని వినతి
- ఏఐ యుగానికి అనుగుణంగా కార్మికులకు నైపుణ్య శిక్షణ అవసరమన్న కేంద్ర మంత్రి

**హైదరాబాద్, జూలై 14 (జనం సాక్షి):** హైదరాబాద్ సనత్‌నగర్‌లో రూ.211 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక ఉద్యోగుల రాష్ట్ర బీమా సంస్థ (ఈఎస్ఐసీ) బాహ్య రోగుల విభాగం (ఓపీడీ) నూతన భవనాన్ని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియా మంగళవారం ప్రారంభించారు. ఆధునిక వైద్య పరికరాలు, విస్తృత చికిత్సా సౌకర్యాలతో నిర్మించిన ఈ భవనం ద్వారా లక్షలాది ఈఎస్ఐ లబ్ధిదారులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.
ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి, ఈఎస్ఐసీ డైరెక్టర్ జనరల్ అశోక్ కుమార్ సింగ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఏడు ప్రాంతాల్లో రూ.668 కోట్ల వ్యయంతో నిర్మించిన వివిధ ఆరోగ్య మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కేంద్ర మంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి నిర్మాణంలో విశేష సేవలందించిన కార్మికులను కేంద్ర మంత్రి సన్మానించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే మరణించిన ఈఎస్ఐ లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు, దివ్యాంగులకు వివిధ నగదు ప్రయోజనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి మాట్లాడుతూ, తెలంగాణలో పారిశ్రామిక ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఈఎస్ఐ వైద్య సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కొత్త ఈఎస్ఐ డిస్పెన్సరీలు, డయాలసిస్ కేంద్రాలను మంజూరు చేయాలని కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవియాను కోరారు.
అంతకుముందు బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరమ్‌లో పాల్గొన్న కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవియా మాట్లాడుతూ, సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ మానవ శ్రమకు ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు. కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతలను సమర్థంగా వినియోగించుకునేలా కార్మికులు, యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.
పారిశ్రామిక కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంతో పాటు ఆధునిక ఆరోగ్య మౌలిక సదుపాయాల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, సనత్‌నగర్‌లో ప్రారంభమైన నూతన ఈఎస్ఐ ఓపీడీ బ్లాక్ ఆ దిశగా మరో కీలక అడుగుగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు.

# భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

**భూభారతి సర్వేలో రైతులు సహకరించాలి: ఎమ్మెల్యే కాలే యాదయ్య**
**ప్రభుత్వ భూములను స్వచ్ఛందంగా అప్పగించాలని ప్రజలకు విజ్ఞప్తి**
**పట్టా భూములను సర్వే చేసి యజమానులకు అప్పగిస్తామని హామీ**
**ఏక్‌మామిడి రెవెన్యూ పరిధిలో భూభారతి అవగాహన సదస్సు**




**నవాబుపేట్, జూలై 14:**
తెలంగాణ ప్రభుత్వం భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చేపట్టిన భూభారతి భూ సర్వే కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పిలుపునిచ్చారు. మంగళవారం నవాబుపేట్ మండలం ఏక్‌మామిడి గ్రామంలో నిర్వహించిన భూభారతి భూ సర్వే అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేదలకు చట్టబద్ధంగా రావాల్సిన భూములను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పట్టాదారుల భూములను కచ్చితంగా సర్వే చేసి వారికి అప్పగిస్తామని, ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారు స్వచ్ఛందంగా వాటిని ప్రభుత్వానికి అప్పగించాలని కోరారు. భూ వివాదాలకు ముగింపు పలికి రైతులకు పూర్తి భూ హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచార్యులు మాట్లాడుతూ, ఏక్‌మామిడి రెవెన్యూ పరిధిలోని మహ్మదాన్‌పల్లి, కుమ్మరిగూడ, మూలమడ గ్రామాల్లో భూభారతి సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తామని చెప్పారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూములను గుర్తించి, పట్టాదారుల భూములను కొలతలు వేసి వారికి అప్పగిస్తామని వివరించారు.
ఏక్‌మామిడి రెవెన్యూ పరిధిలో సుమారు 4,816 ఎకరాలు ప్రస్తుతం ప్రజల ఆధీనంలో ఉండగా, అందులో ప్రభుత్వ రికార్డుల ప్రకారం 1,276 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. భూభారతి సర్వే ద్వారా ప్రతి ఎకరాను కొలిచి, పట్టా పాస్‌బుక్‌లలో నమోదైన మేరకు రైతులకు భూమిని అప్పగించి, మిగిలిన ప్రభుత్వ భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుంటామని తెలిపారు.గత మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు ఈ సర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి రైతు తన పట్టా పాస్‌బుక్‌లో నమోదైన మేరకు భూమిని పొందేలా నిష్పాక్షికంగా సర్వే నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాథోడ్ గీతా సింగ్, పీఏసీసీఎస్ చైర్మన్ రామ్‌రెడ్డి, పాపిరెడ్డి, ఏక్‌మామిడి సర్పంచ్ చిట్టపు నర్మద మల్లారెడ్డి, తహసీల్దార్ బుచ్చయ్య, డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్ రెడ్డి, ఆర్ఐ రాజు, మండల సర్వేయర్ ఆనంద్‌కుమార్, జీపీఓ శ్రీశైలం, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ దుర్మార్గపు విధానాలతోనే సింగరేణి నష్టాలు

- కెసిఆర్ మార్గంలోనే కాంగ్రెస్ నడుస్తోంది
- సింగరేణి సొత్తును దోచుకుంటున్నారని ఆరోపణ
- కార్మికుల భవిష్యత్తుకు భరోసా ఇచ్చిన కిషన్ రెడ్డి
- 60 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్




**గోదావరిఖని, జూలై 13:** రాష్ట్ర ప్రభుత్వ దుర్మార్గపు విధానాల కారణంగానే సింగరేణి సంస్థ కష్టనష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. గత కెసిఆర్ ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సింగరేణి సంస్థను బంగారు బాతులా భావిస్తూ ఇష్టారాజ్యంగా దోచుకుంటుందని విమర్శించారు. మంగళవారం సింగరేణి భరోసా యాత్రలో భాగంగా బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో కలిసి మధ్యాహ్నం కిషన్ రెడ్డి గోదావరిఖని ఓసీ-5 ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సభలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ, సింగరేణి సొత్తును దోచుకోవడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించిన వైఖరినే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. కెసిఆర్ హయాంలో హరీష్ రావు, కేటీఆర్, కవిత సింగరేణిలో దోపిడీలకు పాల్పడితే, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా మంత్రులందరూ దోపిడీకి తెగబడుతున్నారని పేర్కొన్నారు.

సింగరేణి భవిష్యత్తుకు భరోసాను కల్పించాలనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోడీ నాడు నైని బ్లాక్‌ను, నేడు తాడిచెర్ల-2 బ్లాక్‌ను సింగరేణి సంస్థకు కేటాయించినట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఏకైక బొగ్గు పరిశ్రమ అయిన సింగరేణి సంస్థను పరిరక్షించేందుకు మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. సింగరేణి కార్మికులపై నిజంగా ప్రేమ ఉంటే వెంటనే 60 వేల కోట్ల రూపాయల బకాయిలను చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తు విషయంలో సింగరేణియులు ఎవరు ఆందోళన చెందవద్దని, బీజేపీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

లీకేజీ ప్రకారం విద్యుత్ సంస్థలకు బొగ్గు సరఫరా చేసేలా యాజమాన్యం తగు చర్యలు చేపట్టాలని సూచించారు. టెండర్ ప్రక్రియ ద్వారా రాష్ట్రంలోని అన్ని బొగ్గు బ్లాకులు సింగరేణి సంస్థకు లభించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు మాట్లాడుతూ సింగరేణి వ్యవహారంలో గత ప్రభుత్వం చేసిన తప్పులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేస్తోందని ఆరోపించారు. నష్టాల్లో ఉన్న సింగరేణి భవిష్యత్తుపై ఆలోచన చేయకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి సింగరేణి సొత్తుతో ఫుట్‌బాల్ ఆడుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ సాధన కోసం తెగించి పోరాడిన సింగరేణి కార్మికుల ఆకాంక్షలు ఇంకా నెరవేరలేదని అన్నారు. 51 శాతం వాటాను కలిగి ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వ సహకారంతో సింగరేణి సంస్థను బాగు చేయాలని ఆలోచన చేయకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య మాట్లాడుతూ సింగరేణి సంస్థ నాశనం కావడానికి పెరిగిన రాజకీయ జోక్యమే ప్రధాన కారణమని ఆరోపించారు. సింగరేణి సంస్థను కోల్ ఇండియాలో విలీనం చేసి భవిష్యత్తుకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రాజెక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

## కులం పేరుతో దూషించిన వారిపై కేసు నమోదు

**గన్నేరువరం, జూలై 14 (జనంసాక్షి):** గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి ఎక్స్ రోడ్డు గ్రామంలోని బేతల్లి రాజేందర్ రెడ్డి సిమెంట్ బ్రిక్స్ వద్ద ఈనెల 13 వ తేదీన సోమవారం నాడు శ్రావణ్, స్నేహితుడు పైడిపాల మల్లేష్ ఉన్న సమయంలో గుండ్లపల్లి గ్రామానికి చెందిన బేతల్లి రాజేందర్ రెడ్డి, పంబాల సంపత్, కొమ్మెర ప్రశాంత్ రెడ్డి లు సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు వారితో వివాదం తలెత్తింది. ఈ వివాదంతో బేతల్లి రాజేందర్ రెడ్డి, పంబాల సంపత్, కొమ్మెర ప్రశాంత్ రెడ్డి, కులం పేరుతో దూషించి, దుర్భాషలాడి, దాడి చేసినట్లు మంగళవారం గన్నేరువరం పోలీస్ స్టేషన్లో శ్రావణ్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి. నరేందర్ రెడ్డి తెలిపారు. గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి ఎక్స్ రోడ్ గ్రామంలో సోమవారం బేతల్లి రాజేందర్ రెడ్డి సిమెంట్ బ్రిక్స్ షాప్ వద్దకు సాయంత్రం మూడున్నర సమయంలో వెళ్లగా బిగుళ్ల శ్రావణ్, పైడిపాల మల్లేశం మద్యం సేవిస్తుండంగా వారిని ఎందుకు తాగుతున్నారని అడగగా రాజేందర్ రెడ్డి పైకి దురుసుగా ప్రవర్తిస్తూ, ఇద్దరూ దాడి చేశారని గన్నేరువరం పోలీస్ స్టేషన్ లో మంగళవారం బేతల్లి రాజేందర్ రెడ్డి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు బిగుళ్ల శ్రావణ్, పైడిపాల మల్లేశం లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి. నరేందర్ రెడ్డి తెలిపారు.

## భూ భారతి రి సర్వేపై ప్రజలకు అవగాహన సదస్సు

**ముత్తారం,జూలై 14(జనంసాక్షి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "భూ భారతి" రి సర్వే పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మంగళవారం ముత్తారం మండలం మచ్చుపేట గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముత్తారం తహశీల్దార్ మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. రైతులు తమ భూముల హక్కులను సురక్షితంగా ఉంచుకోవచ్చు అని అన్నారు. అంతేకాకుండా భూమి యొక్క ఖచ్చితమైన కొలతలు డ్రోన్, జీపీఎస్ టెక్నాలజీతో భూములకు స్పష్టమైన హద్దులు ఏర్పాటు చెయ్యవచ్చు అని పొలాల మధ్య వచ్చే గొడవలు తగ్గుతాయి అని భూమి వివరాలు డిజిటల్ గా అందుబాటులో ఉండడంతో పాటు బ్యాంకు రుణాలకు ఇబ్బంది కలుగకుండా ఉంటాయని తెలిపారు. గ్రామంలో భూ రి సర్వే సమయంలో రైతులు తప్పనిసరిగా పాల్గొనాలని, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, పాత పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. మీ పొలం హద్దులు మీరు చూపించాలి. పొరుగు రైతులతో కలిసి సరిహద్దులు ఖరారు చేసుకోవాలి" అని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం భూములు లాక్కుంటుందనే అపోహలు వద్దని అధికారులు స్పష్టం చేశారు. "ఇది రైతుల మేలు కోసమే. ఎవరి భూమిని ఎవరూ లాక్కోరు" అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిలువేరీ జ్యోతి, ఉపసర్పంచ్ దొంతుల రాకేష్, పంచాయితీ కార్యదర్శి దిలీప్, జిపివో శారద, తోపాటు సర్వే అధికారులు, రెవిన్యూ సిబ్బంది రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి రి సర్వే పై ప్రజలకు అవగాహన సదస్సు

**ముత్తారం,జూలై 14(జనంసాక్షి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "భూ భారతి" రిసర్వేపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మంగళవారం ముత్తారం మండలం మచ్చుపేట గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముత్తారం తహశీల్దార్ మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. రైతులు తమ భూముల హక్కులను సురక్షితంగా ఉంచుకోవచ్చు అని అన్నారు. అంతేకాకుండా భూమి యొక్క ఖచ్చితమైన కొలతలు డ్రోన్, జీపీఎస్ టెక్నాలజీతో భూములకు స్పష్టమైన హద్దులు ఏర్పాటు చెయ్యవచ్చు అని పొలాల మధ్య వచ్చే గొడవలు తగ్గుతాయి అని భూమి వివరాలు డిజిటల్ గా అందుబాటులో గ్రామంలో భూ రిసర్వే సమయంలో రైతులు తప్పనిసరిగా పాల్గొనాలని, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, పాత పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. మీ పొలం హద్దులు మీరు చూపించాలి. పొరుగు రైతులతో కలిసి సరిహద్దులు ఖరారు చేసుకోవాలి" అని తెలిపారు. ఎవరి భూమిని ఎవరూ లాక్కోరు" అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిలువేరీ జ్యోతి, ఉపసర్పంచ్ దొంతుల రాకేష్, పంచాయితీ కార్యదర్శి దిలీప్, జిపివో శారద, తోపాటు సర్వే అధికారులు, రెవిన్యూ సిబ్బంది రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.




## నల్గొండలో వికసిత్ భారత్ జీ రాంజీ పథకం అమలుపై కేంద్ర బృందం ప్రశంసలు

**నల్గొండ, జూలై 14,(జనం సాక్షి):** నల్గొండ జిల్లాలో వికసిత్ భారత్ జీ రాంజీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ లాల్ చంద్ మా జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. మంగళవారం జాయింట్ సెక్రటరీ లాల్ చంద్ మా, అండర్ సెక్రటరీ రాజీవ్ రాణా, అసిస్టెంట్ డైరెక్టర్ నీతూ సభ్యులుగా ఉన్న కేంద్ర బృందం జిల్లాలో పర్యటించింది. ఉపాధి హామీ పథకం నుంచి వికసిత్ భారత్ జీ రాంజీ పథకంగా మారిన అనంతరం అమలులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు, ట్రాన్సిషన్ ప్రక్రియపై అధ్యయనం చేసింది. ముందుగా జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్తో సమావేశమైన బృందం అనంతరం జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా లాల్ చంద్ మా మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పథకం అమలవుతోందని ప్రశంసించారు. కూలీలకు పని లేకుండా, వేతనం లేకుండా ఉండకూడదన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, పని దినాలను 100 నుంచి 125 రోజులకు పెంచినట్లు తెలిపారు. పథకంపై కళాజాత బృందాలు, ప్రచార సామగ్రి ద్వారా గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ సర్పంచ్‌ల నుంచి గ్రామపంచాయతీ కార్యదర్శుల వరకు అందరికీ పథకంపై అవగాహన కల్పించామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో పనులు తగ్గిన ఈ సమయంలో వికసిత్ భారత్ జీ రాంజీ పథకం గ్రామీణ కూలీలకు ఎంతో ఉపయుక్తంగా మారుతుందన్నారు. సమావేశంలో ఎంపీడీవోలు, ఏపీవోలు పథకం అమలులో ఎదురవుతున్న సమస్యలను కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. నిర్మాణ పనులు, హార్టికల్చర్, బావుల పనులను పథకంలో చేర్చడం, రూ.2 లక్షల వ్యయ పరిమితిని తొలగించడం, బిల్లుల చెల్లింపులు వేగవంతం చేసేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయడం, కూరగాయల పందిళ్లు, అంగన్‌వాడీ భవనాల మరమ్మతులకు అవకాశం కల్పించడం, వికలాంగులకు ఎక్కువ పని దినాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ శేషు, అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి, డీపీఓ శంకర్ నాయక్, పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికసిత్ భారత్ జీ రాంజీ పథకంపై రూపొందించిన గోడపత్రికలను ఆవిష్కరించారు.

## ఎమ్మెల్యే కార్యాలయం ముందే ఆత్మహత్యాయత్నం

- ఎమ్మెల్యే ఆఫీస్ ముందే ఆత్మహత్యాయత్నం..
- ముఖ్య అనుచరుడి అరాచకమే కారణమా..?
- మాజీ సర్పంచ్ భర్తను అంతలా వేధించిందెవరు..?



**తిమ్మాపూర్ జులై 14,(జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం, గుండ్లపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త బేతల్లి రాజేందర్ రెడ్డి, ఎల్ఎండి లోని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ క్యాంపు కార్యాలయం ముందు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో ఆసుపత్రికి తరలించారు. స్థానిక సమస్యలపై ప్రశ్నించినందుకు ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడి ఒత్తిడితో, తన భర్తపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టించారని బాధితుడి భార్య ఆరోపిస్తున్నారు. దీనివల్ల మనస్తాపానికి గురై ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడి భార్య డిమాండ్ చేస్తున్నారు. కాగా ఘటనకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

# రామగుండం సుందరీకరణకు మరో ముందడుగు

**ఐలాండ్ నిర్మాణానికి స్థలం పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్**



**అంతర్గాం, జనంసాక్షి :** రామగుండం నియోజకవర్గాన్ని మరింత అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దే లక్ష్యంతో శాసనసభ్యులు ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ మంగళవారం రామగుండంలోని ఏ-పవర్ హౌస్ సర్కిల్ వద్ద ప్రతిపాదిత ఐలాండ్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక పరిస్థితులను పరిశీలిస్తూ, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా ఐలాండ్‌ను ఆధునిక నమూనాలో అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో అందుబాటులోకి అత్యాధునిక రోబోటిక్ యురాలజీ, కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ సేవలు

- యశోద ఆస్పత్రి సోమాజిగూడ వైద్యులు డా. కౌశిక్ అమన్ చర్ల



**కరీంనగర్ బ్యూరో, జులై 14 (జనంసాక్షి) :** కరీంనగర్ ప్రాంత ప్రజలు ఇకపై అత్యాధునిక యురాలజీ వైద్య సేవలు, ప్రపంచస్థాయి రోబోటిక్ సర్జరీ నిపుణుల సేవలను మరింత సౌలభ్యంగా పొందవచ్చని, ఇందుకోసం హైదరాబాద్ యశోద హాస్పిటల్స్ ప్రత్యేక కన్సల్టేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది.
ఈ సందర్భంగా సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ యురాలజిస్ట్, రోబోటిక్ యురో-అంకాలజిస్ట్, ఆండ్రాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ సర్జన్ డా. కౌశిక్ అమన్ చర్ల కరీంనగర్ మీడియాతో మాట్లాడుతూ... ఈ విషయాన్ని తెలియజేశారు. కిడ్నీ, ప్రోస్టేట్, మూత్రాశయం, మూత్ర నాళాలకు సంబంధించిన సంక్లిష్ట వ్యాధులకు చికిత్స కోసం చాలామంది రోగులు హైదరాబాద్‌కు వెళ్తున్నారని, ఈ అంతరాన్ని తగ్గించడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమని, తద్వారా రోగులు ఇంటి దగ్గరే నిపుణుల సలహాలు, పూర్తి పరీక్షలు, ఆధునిక చికిత్సా విధానాల గురించి తెలుసుకొని, తదుపరి ఫాలోఅప్పు సులభంగా కొనసాగించవచ్చని పేర్కొన్నారు. మినిమల్ ఇన్వేసివ్, రోబోటిక్ పద్ధతులతో శస్త్రచికిత్స అనంతర నొప్పి తగ్గడం, రక్తస్రావం తక్కువగా ఉండడం, ఆసుపత్రిలో ఉండాల్సిన సమయం తగ్గడం రోగులు త్వరగా సాధారణ జీవితంలోకి వెళ్లడం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. యశోదా హాస్పిటల్స్, సోమాజిగూడ అత్యాధునిక పరికరాలు, ఆధునిక మౌలిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన బహుళ విభాగ నిపుణుల బృందాలతో భారతదేశంలోని ప్రముఖ తృతీయ స్థాయి ఆరోగ్య సంస్థలలో ఒకటిగా నిలిచిందని డా. కౌశిక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జి. సుధీర్ రెడ్డి, సీనియర్ మేనేజర్, కార్పొరేట్ రిలేషన్స్, యశోదా హాస్పిటల్స్ కరీంనగర్ ఎగ్జిక్యూటివ్ స్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిది సింగరేణి భరోసా యాత్ర కాదు

- కార్మికుల నయవంచిన యాత్ర..
- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి మెండె శ్రీనివాస్




**గోదావరిఖని, జనంసాక్షి :** కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి సింగరేణి భరోసా యాత్ర కాదని కార్మికుల నయవంచన యాత్ర అని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి మెంబర్ శ్రీనివాస్ ఆరోపించారు. మంగళవారం ఉదయం 7 గంటలకు జీడీకే 2,2ఏ పిట్ కమిటీ సభ్యులు సమావేశం అనబోయిన శంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మెండె శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డిది సింగరేణి వ్యాప్తంగా రెండు రోజుల నుంచి భరోసా యాత్ర పేరుతో పర్యటన చేస్తున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా తాడిచర్ల 2 బ్లాక్ కేటాయించామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. 2013లోనే తాడిచర్ల 2 బ్లాక్ యూపీఏ ప్రభుత్వంలో కేటాయించబడ్డదన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంక దాన్ని క్లియరెన్స్ ఇవ్వడానికి 13 సంవత్సరాల సమయం పట్టిందని, ఈ కాలయాపన ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భరోసా యాత్ర పేరుతో తప్పుడు ప్రచారం చేస్తూ కార్యకర్తలకు చెవిలో తామర పువ్వు పెట్టినట్లు కార్మికులకు చెబితే వింటారు అనుకుంటున్నారా, సింగరేణి కార్మికులు అంటే తెలంగాణ సాధనలో కీలక పాత్ర వహించిన పోరాట యోధులు ఏ హక్కు అయినా పోరాటాలతో హక్కులు సాధించుకున్న చరిత్ర కార్మికులది, బీజేపీ ప్రభుత్వ హయాంలో తెలంగాణకు కొంగుబంగారం లాంటి సింగరేణి బొగ్గు బ్లాకులను ప్రైవేటు వ్యక్తులకు ఈ వేలం ద్వారా కట్టబెడుతూ సింగరేణి సంస్థను దివాలా తీసేందుకు, నిరుద్యోగాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నారని... ఎన్నికల సమయంలో సింగరేణి కార్మికులు సైనికులతో సమానమని అందరికీ ఇన్కమ్ టాక్స్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి మరిచిపోయిన సంగతి కార్మికులందరికీ తెలుసు అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ బిడ్డగా సింగరేణి కార్మికుల పై ప్రేమ ఉంటే కేంద్రం వద్ద పెండింగ్లో ఉన్న దాదాపు 17 బ్లాకులు ఈ వేలం లేకుండా భేషరతుగా సింగరేణి కేటాయించి, కార్మికులందరికీ ఇన్కమ్ టాక్స్ రద్దు చేస్తే... అప్పుడు మిమ్ములను కార్మికులు హర్షిస్తారని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో ఆర్జీవన్ గౌరవాధ్యక్షులు ఆరెపల్లి రాజమౌళి, అధ్యక్షులు వంగల శివరాం రెడ్డి, పుప్పాల శ్రీనివాసరావు, అనబోయిన శంకర్, బానోతు రామకృష్ణ, సిహెచ్ లచ్చన్న, గడికొప్పుల దుర్గాప్రసాద్, సుభాష్, సంపత్, లచ్చన్న, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలి


- ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ.15 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలి



**గోదావరిఖని, జనంసాక్షి :**
సింగరేణి భరోసా యాత్రలో భాగంగా మంగళవారం కేంద్ర బొగ్గు, గనుల శాఖా మంత్రి జీవన్ రెడ్డి గోదావరిఖనికి లోని ఓ సి పి-5కి వచ్చిన సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని, ప్రమాదం లో మరణించిన కాంట్రాక్టు కార్మికులకు 15 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, సింగరేణి లో ఖాళీగా ఉన్న క్వార్టర్లు కాంట్రాక్టు కార్మికులకు కేటాయించాలని, కన్వేయన్స్ డ్రైవర్లు, మైన్స్ లలో పనిచేసే వారితో సహా అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ అమలు చేయాలి. లేదా కుటుంబ సభ్యులందరికి సింగరేణి హాస్పిటల్‌లో వైద్యం అందించాలని, ఈఎస్ఐ, పిఎఫ్, బోనస్ లపై సీలింగ్ ను ఎత్తివేసి కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఈఎస్ఐ అమలు చేయాలని, వేలాది మంది కార్మికులకు ఉపయోగపడే ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం జాప్యం లేకుండా వెంటనే నిర్మించాలని, జాతీయ, పండుగ సెలవులు అమలు చేయాలని, బెల్ట్ క్లినింగ్, సేల్ పికింగ్, వాటర్ సప్లై, లోడింగ్ అన్ లోడింగ్, సివిల్, హాస్పిటల్, వర్క్ షాప్స్, ఎక్స్ ప్లోరేషన్, గెస్ట్ హౌస్ లు, రైల్వే సైడింగ్, బ్లాస్టింగ్, ఓబీలు, ఎస్. ఎం. ఎస్. ప్లాంట్స్ లలో పని చేస్తున్న వారికి పని ఆదారంగా సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం లో కోరడం జరిగింది. దీనికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి, జిల్లా కోశాధికారి ఎం. రామాచారి, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. బిక్షపతి, జిల్లా కమిటీ సభ్యులు జి. లక్ష్మారెడ్డి, ఎం.డి. యాకుబ్, సీఐటీయూ గోదావరిఖని పట్టణ కమిటీ సభ్యులు ఎస్.మధు, కాంట్రాక్టు కార్మికులు ఇండ్ల ఓదెలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పారా క్వాట్ నిషేధం దిశగా కేంద్రం కీలక నిర్ణయం

- రైతుల ప్రాణాలు కాపాడే చారిత్రాత్మక అడుగు
- డాక్టర్ మర్రి మహేశ్వర్ రెడ్డి కృషికి ఫలితం



**కరీంనగర్ బ్యూరో, జులై 14 (జనంసాక్షి) :**
మానవులు, జంతువుల ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా మారిన పారా క్వాట్ డైక్లోరైడ్ కలుపు నివారణ మందు పై కేంద్ర ప్రభుత్వం పూర్తి నిషేధం విధించే దిశగా తీసుకున్న నిర్ణయాన్ని ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ మర్రి మహేశ్వర్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, స్వాగతించారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ అధికారిక గెజిట్‌లో ముసాయిదా ఉత్తర్వులను విడుదల చేయడం రైతుల ప్రాణాల రక్షణకు చారిత్రాత్మక అడుగని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పారా క్వాట్ డైక్లోరైడ్ అత్యంత ప్రమాదకరమైన రసాయనమని, దీనికి ప్రత్యేక విరుగుడు లేకపోవడం వల్ల విషప్రయోగాలకు గురైన వారిలో మరణాల శాతం అధికంగా ఉంటోందని తెలిపారు. ఈ ప్రమాదకర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గత కొన్నేళ్లుగా రాష్ట్రంలోని పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి పారా క్వాట్ పై నిషేధం విధించాలని వినతిపత్రాలు అందజేసినట్లు చెప్పారు. అలాగే కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులను కలిసి దేశవ్యాప్తంగా ఈ రసాయనాన్ని నిషేధించాలని విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. వైద్యులు, రైతు సంఘాలు, ప్రజా ప్రతినిధులు, సామాజిక సంస్థలు చేసిన నిరంతర కృషిని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం నిపుణుల కమిటీ నివేదిక, రిజిస్ట్రేషన్ కమిటీ సిఫార్సుల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని డాక్టర్ మర్రి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ప్రపంచంలోని 70కిపైగా దేశాలు ఇప్పటికే పారా క్వాట్ డైక్లోరైడ్‌ను నిషేధించిన నేపథ్యంలో భారత్ కూడా అదే దిశగా అడుగులు వేయడం ప్రజారోగ్య పరిరక్షణకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. తుది ఉత్తర్వులు అమల్లోకి వచ్చిన తర్వాత పారా క్వాట్ డైక్లోరైడ్ దిగుమతి, తయారీ, రవాణా, పంపిణీ, విక్రయం, వినియోగం పూర్తిగా నిషేధించబడనున్నాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రస్తుతం ఉన్న రిజిస్ట్రేషన్లు రద్దు కానుండటంతో ఈ ప్రమాదకర రసాయనం వినియోగానికి పూర్తిగా తెరపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా పారా క్వాట్ డైక్లోరైడ్ నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన అమలు చేసి, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజల ప్రాణాలను కాపాడే దిశగా మరిన్ని చర్యలు తీసుకోవాలని డాక్టర్ మర్రి మహేశ్వర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# మా రక్తం తీసుకో... రైతన్నకు సాగునీరు ఇవ్వు

- రైతుల కోసం రక్తం ఇవ్వడమే కాదు...దారపోయడానికైనా మేము సిద్ధం
- బిఆర్ఎస్ పార్టీ నాయకులు చల్మెడ లక్ష్మీనరసింహారావు




రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జులై 14 (జనంసాక్షి)
మా రక్తం తీసుకోని ఆరుగాలం కష్టపడుతున్న రైతన్నలకు సాగునీరు ఇవ్వాలని, రైతుల కోసం రక్తం ఇవ్వడమే కాదు..దారపోయడానికైనా మేము సిద్ధంగా ఉన్నామని, రియల్ ఎస్టేట్ బ్రోకర్ కు రైతుల కష్టసుఖాలు ఏమీ తెలుసని బిఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశానికి వెన్నుముకలైన రైతన్నలకు సీఎం రేవంత్ నీళ్లు ఇవ్వడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఇటీవల కాలంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకుల రక్తాన్ని పంటల మీదే చల్లితే పంటలు పండుతాయి అని రైతులను కించపరిచే విధంగా మాట్లాడడం సీఎం స్థాయికి సిగ్గుచేటన్నారు.
కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా "రేవంత్‌రెడ్డికి రక్తదానం" పేరిట శిబిరం ఏర్పాటు చేసి నాయకులతో కలిసి రక్తదానం చేశామన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మంత్రి పదవి కోసం, తన స్థాయిని మరిచి మాటలు మాట్లాడుతూ ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నిలబెట్టడంలో విఫలమయ్యారన్నారు. కాళేశ్వరం నీళ్లను వెంటనే రైతన్న పంటపొలాలకు మళ్లించేలా చర్యలు తీసుకోకపోతే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. దాదాపు 25 మందికి పైగా రక్తదానం చేసి మా రక్తం తీసుకో ..రైతన్నకు నీళ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు రామతీర్థపు రాజు, వెంగళ శ్రీకాంత్ గౌడ్, ఏనుగు తిరుపతిరెడ్డి, వాసాల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, సిరిగిరి చందు, జోగిని శంకర్, నాయకులు క్రాంతి కుమార్, గూడూరు మధు, సుంకపాక రాజు, నరాల దేవేందర్, కొండ నరసయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.




# సింగరేణికి గొప్పవరం తాడిచర్ల-2 బ్లాక్

**జనరల్ మేనేజర్ (కో ఆర్డినేషన్, మార్కెటింగ్) టి.శ్రీనివాస్**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సింగరేణి సంస్థకు కొత్త గనుల అవశ్యకత అత్యంత తీవ్రంగా ఉన్న దశలో కొత్తగా తాడిచర్ల-2 బ్లాక్‌కు మైనింగ్ లీజు అనుమతులు లభించడం సింగరేణికి ఒక వరం లాంటిదని జనరల్ మేనేజర్ (కో ఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్ పేర్కొన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్ లో మంగళవారం ఉదయం జరిగిన తాడిచర్ల-2 బ్లాక్ సాధన విజయోత్సవ సమావేశంలో ఆయన ప్రసంగించారు. సింగరేణిలో పాత గనులు మూతబడుతున్న నేపథ్యంలో కొత్త గనులను ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చొరవతో గత ఏడాది నైనీ బొగ్గు బ్లాక్‌కు పూర్తి అనుమతులు సాధించి ఉత్పత్తి కూడా ప్రారంభించామని, ఇప్పుడు మైనింగ్ లీజు పొందిన తాడిచెర్ల-2 బ్లాక్ ను కూడా అనతి కాలంలో ప్రారంభించనున్నామని తెలిపారు. ఇంకా సింగరేణి ప్రాంతంలో ఉన్న ఇతర బొగ్గు బ్లాక్ లు కూడా సింగరేణికి వచ్చే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, కొత్త బ్లాక్ ల రాకతో సింగరేణికి పూర్వ వైభవం దక్క నున్నదని తెలిపారు. తాడిచర్ల-2 బ్లాక్ నుండి ప్రతీ ఏడాది కనీసం 60 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసే అవకాశం ఉందని ఈ విధంగా 45 సంవత్సరాల పాటు ఈ గని లో ఉత్పత్తి కొనసాగుతుందని తెలిపారు. ఈ గని కోసం ప్రత్యేక శ్రద్ధ చూపిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు, అనుమతులు మంజూరు చేసిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సింగరేణి భవన్ లోని వివిధ విభాగాల ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

## ఆషాఢ బోనాలకు భారీగా ఏర్పాట్లు

- భక్తులకు ఇబ్బంది లేకుండా భద్రతా చర్యలు
- నగర పోలీస్ అధికారులతో సజ్జన్నార్ సమీక్ష



**హైదరాబాద్, జూలై14 (జనంసాక్షి) :** ఆషాడ బోనాల ఉత్సవాలు శాంతియుతంగా, వైభవంగా నిర్వహించడమే లక్ష్యమని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ బోనాలు.. మొదటి 15 రోజులు అత్యంత కీలకమని తెలిపారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. మంగళవారం బంజారా హిల్స్‌లోని టీజీఐసీసీసీలో ఆషాడ బోనాలపై ఆ శాఖ అధికారులతో సజ్జన్నార్ సమీక్ష నిర్వహించారు. ఈ బోనాలకు పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జూలై 16 నుంచి ఆగస్టు13వ తేదీ వరకు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గోల్కొండ, బల్కంపేట, ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ ఆలయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. టాస్క్‌ఫోర్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సిటీ ఆర్మ్‌డ్, రిజర్వ్, క్విక్ రియాక్షన్ టీమ్స్ భారీగా మోహరిస్తున్నట్లు వివరించారు. భక్తులకు సమాచారం కోసం ఆలయాల వద్ద పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ వివరించారు. మహిళా భక్తుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని.. అందుకోసం షీ టీమ్స్‌తో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈవ్ టీజింగ్, గొలుసు దొంగతనాలు, మొబైల్ స్నాచింగ్, జేబుదొంగలపై ఉక్కుపాదం మోపనున్నట్లు చెప్పారు. గత బోనాల్లో 644 మంది ఆకతాయిలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని ఆయన గుర్తు చేశారు. బోనాల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు, ఘటాల ఊరేగింపులకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని వివరించారు. ఆలయాల పరిసరాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని నగర సీపీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు.




### తాడిచర్ల బొగ్గుగని..

# సింగరేణికి వరమా? ఉపాధికి భరోసానా?

**తెలంగాణలో కొత్త పరిశ్రమల ఏర్పాటు ఆశించిన స్థాయిలో జరగని పరిస్థితుల్లో, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన సింగరేణి సంస్థకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపుతో ప్రాధాన్యత సంతరించుకుంది. బొగ్గు ఉత్పత్తి పెరగడం, విద్యుత్ రంగానికి దీర్ఘకాలిక ఇంధన భద్రత లభించడం, సింగరేణి కార్యకలాపాలు మరింత బలోపేతం కావడం వంటి అంశాలపై ఆశలు వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో ఈ గని ద్వారా స్థానిక యువతకు ఎంత మేరకు ఉపాధి లభిస్తుంది, ప్రాంతీయ అభివృద్ధికి ఎంతగా దోహదపడుతుంది అనే చర్చ కూడా మొదలైంది.**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**

### 182 మిలియన్ టన్నులా.. 434 మిలియన్ టన్నులా.. గణాంకాల్లో తేడా!

- 1200 ఉద్యోగాలా.. 3000 ఉద్యోగాలా.. ఆశలు, సందేహాలు
- భూపరితల తవ్వకాలతో ఉత్పత్తి పెరుగుదల.. ఉద్యోగాలు తగ్గుదల
- స్థానిక అభివృద్ధి, వలసల నివారణపై ప్రజల ఆశలు..

#### గణాంకాల్లో వ్యత్యాసం.. సందేహాలు..

తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వాగతం పలికినప్పటికీ, బొగ్గు నిల్వలు, తవ్వకాలకు అనుకూల నిల్వలు, ఉద్యోగాల సంఖ్య వంటి అంశాల్లో రెండు వర్గాలు వెల్లడించిన గణాంకాల్లో తేడాలు కనిపిస్తున్నాయి.

ఈ గని భూగర్భ గని కాకుండా భూపరితల తవ్వకాల గనిగా అభివృద్ధి చేయనుండటం మరో ముఖ్యమైన అంశం. ఒకప్పుడు సింగరేణిలో భూగర్భ గనులే ప్రధానంగా ఉండేవి. బొగ్గు వెలికితీతలో ఎక్కువ మంది కార్మికుల శ్రమ అవసరమయ్యేది. ఒక్కో గనిలో వేలాది మంది ప్రత్యక్షంగా పనిచేసేవారు. ఆ కుటుంబాల



కేంద్రం ఈ గనిలో సుమారు 182 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని పేర్కొనగా, రాష్ట్ర ప్రభుత్వం మొత్తం నిల్వలు 434.14 మిలియన్ టన్నులుగా, అందులో సుమారు 340 మిలియన్ టన్నుల బొగ్గు తవ్వకాలకు అనుకూలంగా ఉంటుందని వెల్లడించింది. ఉద్యోగాల విషయం లోనూ కేంద్రం సుమారు 1,200 మందికి ఉపాధి లభిస్తుందని చెప్పగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్ష, పరోక్షంగా మూడు వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని ప్రకటించింది. ఈ వ్యత్యాసమే ప్రజల్లో సందేహాలకు దారి తీస్తోంది.

#### భూపరితల తవ్వకాలు.. ఉత్పత్తి పెరుగుదల, ఉద్యోగాల తగ్గుదల..

ఆధారంగా ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందేది. కాలక్రమేణా పరిస్థితులు మారాయి. ఆధునిక యంత్రాలు, భారీ తవ్వక పరికరాల వినియోగం పెరగడంతో భూపరితల తవ్వకాలకే ప్రాధాన్యం లభించింది. తక్కువ సమయంలో ఎక్కువ బొగ్గు ఉత్పత్తి సాధ్యమవుతున్నా, ఉపాధి అవకాశాలు మాత్రం గణనీయంగా తగ్గిపోయాయి. ఇదే కారణంగా కొత్త గనులు వస్తున్నప్పటికీ పాత తరహా ఉద్యోగ అవకాశాలు రావడం లేదనే అభిప్రాయం కార్మిక వర్గాల్లో వ్యక్తమవుతోంది. ప్రస్తుతం సింగరేణి పరిధిలో పనిచేస్తున్న గనుల్లో భూగర్భ గనులు, భూపరితల తవ్వకాల గనులు రెండూ ఉన్నప్పటికీ, బొగ్గు ఉత్పత్తిలో భూపరితల గనుల వాటా ఎక్కువగా ఉంది. యంత్రాల ఆధారిత తవ్వకాల వల్ల ఉత్పత్తి పెరుగుతున్నా, ఉద్యోగాల పెరుగుదల అదే స్థాయిలో కనిపించడం లేదు. అందువల్ల తాడిచర్ల-2 గని ద్వారా ప్రకటిస్తున్న ఉపాధి గణాంకాలు ఎంతవరకు వాస్తవ రూపం దాల్చుతాయన్నది కాలమే సమాధానం చెప్పాల్సి ఉంది.

#### వలసల నివారణ, ప్రాంతీయ అభివృద్ధిపై ఆశలు..

సింగరేణి ప్రాంత ప్రజల జీవితాల్లో ఉపాధికి ఉన్న ప్రాధాన్యం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఒకప్పుడు ఉద్యోగం కోసం బొంబాయి నగరానికి కూలీలుగా, తర్వాత కాలంలో గల్ఫ్ దేశాలకు వలస వెళ్లడం వేలాది కుటుంబాల జీవన గాథగా మారింది. "బొంబాయి కూలి... దుబాయి బతుకు" అనే మాట ఉత్తర తెలంగాణలో అనేక కుటుంబాల వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించింది. స్థానికంగా స్థిరమైన ఉపాధి అవకాశాలు లభిస్తే వలసలు తగ్గుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. తాడిచర్ల-2 గని ప్రారంభమైతే జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, పెద్దపల్లి, ములుగు జిల్లాల పరిసర ప్రాంతాల్లో రవాణా, రహదారులు, విద్యుత్, నీటి వసతులు, వ్యాపార కార్యకలాపాలు, చిన్న పరిశ్రమలు, సేవారంగానికి కొంత ఊతం లభించే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. స్థానిక మార్కెట్లు చైతన్యం పొందడంతో పాటు అనుబంధ ఉపాధి అవకాశాలు కూడా పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

#### శాశ్వత ఉద్యోగాలపై ఆందోళన.. ఆర్థిక ప్రయోజనాలు..

ప్రస్తుతం సింగరేణిలో వేలాది మంది శాశ్వత ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తూ తమ కుటుంబాలను పోషిస్తున్నారు. అయితే గతంతో పోలిస్తే శాశ్వత ఉద్యోగాల సంఖ్య క్రమంగా తగ్గుతున్నదన్న ఆందోళన కార్మిక సంఘాలు వ్యక్తం చేస్తున్నాయి. యాంత్రీకరణతో ఉత్పత్తి పెరుగుతున్నా, ఉద్యోగాలు తగ్గడం భవిష్యత్తులో సామాజిక ప్రభావం చూపే అవకాశముందని వారు హెచ్చరిస్తున్నారు.

అయితే మరోవైపు బొగ్గు ఉత్పత్తి పెరగడం వల్ల సింగరేణి ఆర్థికంగా మరింత బలోపేతం కావడం, విద్యుత్ ఉత్పత్తి రంగానికి ఇంధన భద్రత పెరగడం, రాష్ట్ర ఆదాయానికి తోడ్పాటు అందడం వంటి ప్రయోజనాలను కూడా విస్మరించలేమని నిపుణులు చెబుతున్నారు. మొత్తానికి తాడిచర్ల-2 బొగ్గు గని సింగరేణికి మరో కీలక అధ్యాయంగా నిలవనున్నది. కానీ ఈ ప్రాజెక్టు కేవలం బొగ్గు ఉత్పత్తి, ఆదాయ వృద్ధికే పరిమితం కాకుండా స్థానిక యువతకు స్థిరమైన ఉపాధి, ప్రాంతీయ అభివృద్ధి, వలసల తగ్గుదలకు ఎంత మేరకు దోహదపడుతుందన్నదే ప్రజల ముందున్న అసలు ప్రశ్న. ఆ ప్రశ్నకు సమాధానం ప్రాజెక్టు అమలు, ఉద్యోగాల కల్పన, స్థానికులకు ఇచ్చే ప్రాధాన్యంపైనే ఆధారపడి ఉంటుంది.

## రక్తం చిందిస్తే వానలు పడతాయన్న వ్యాఖ్యలు బాధాకరం

- సీఎం రేవంత్ రెడ్డిపై వెంటనే కేసు పెట్టాలి
- డీజీపీని కోరిన బీఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్

**హైదరాబాద్, జూలై14 (జనంసాక్షి) :** రక్తం చిందిస్తే వానలు బాగా వస్తాయని, పంటలు పండుతాయని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా మండిపడ్డారు. ఆయనపై వెంటనే కేసు నమోదు చేయాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను కోరారు. మన పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఏమాత్రం ప్రొఫెషనలిజం మిగిలి ఉన్నా వెంటనే సుమోటోగా స్వీకరించి, రేవంత్ రెడ్డిపై కేసు నమోదు చేయమని పోలీసులకు ఆదేశించాలని కోరారు. పరిస్థితి చేయి దాటకముందే నివారించాలని విజ్ఞప్తి చేశారు.కేసు నమోదు చేయడంపై చట్టంలో ఎక్కడా ముఖ్యమంత్రికి మినహాయింపు ఇవ్వలేదని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రిని అరెస్టు చేయాలంటే కేవలం అసెంబ్లీ స్పీకర్‌కు మాత్రమే సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇది రాజకీయ కక్షతో చేస్తున్న ఆరోపణ కానే కాదని స్పష్టం చేశారు. రక్తం చిందిస్తే వానలు బాగా వస్తాయి, పంటలు బాగా పండుతాయని ఏకంగా సీఎం సలహా ఇచ్చారని, ఎవరైనా ఆగంతకుడు పంట పొలాల్లో నిద్రిస్తున్న అమాయక రైతులను చంపి షాబాద్ రాజ్‌కుమార్‌లా వీడియోలు తీస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావుపై ఎవరైౖ, మిగతా అగ్ర నాయకులపై ఆగంతుకులు చేస్తే పరిస్థితి ఏంటని అడిగారు. ముఖ్యమంత్రే బెల్ట్‌తో కొట్టమన్నారని చెప్పి.. భర్తలు తాగొచ్చి భార్యాపిల్లలను బెల్ట్‌లతో కొడితే, కింది ఉద్యోగులను పై అధికారులు బెల్ట్‌తో కొడితే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.దీనిపై ఒకసారి కూల్‌గా ఆలోచించాలని సూచించారు. బీఆర్ఎస్ అగ్ర నాయకుల మీద పెట్రోల్ పోసి, తాను కూడా పోసుకుంటానని గతంలో గజ్వేల్‌లో నిర్వహించిన ఓ బహిరంగ సభలో కార్యకర్తలను మైనంపల్లి హన్మంతరావు ప్రేరేపించారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.



## సరిహద్దుల్లో అమెరికన్ మాజీ సోల్జర్ అరెస్ట్

- అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా పట్టివేత
- పొంతన లేని సమాధానాలు చెప్పడంపై అనుమానాలు

**న్యూఢిల్లీ, జూలై14 (జనంసాక్షి) :** భారత్-నేపాల్ సరిహద్దులో సశస్త్ర సీమా బల్ మరో అమెరికన్‌ను అదుపులోకి తీసుకుంది. అమెరికా డ్రోన్ నిపుణుడు మాథ్యూ వాన్‌డైక్‌ను ఇటీవల మణిపూర్‌లోభారత సైన్యం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా సరిహద్దుల వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న అమెరికా మాజీ సైనికుడిని ఎస్ఎస్‌బి అదుపులోకి తీసుకుంది. అతడిని కాలిఫోర్నియాకు చెందిన జోర్డాన్ బ్రౌన్‌గా గుర్తించారు. సరైన ప్రయాణ పత్రాలు లేకుండా నేపాల్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తుండగా అతడిని ఎస్ఎస్‌బి జవాన్ అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. జవాన్ నుంచి తప్పించుకొని పారిపోతుండగా.. స్థానికులు పట్టుకొని భద్రతా సిబ్బందికి అప్పగించారన్నారు. విచారణ సమయంలో బ్రౌన్ పొంతన లేని సమాధానాలు చెప్తున్నాడని అధికారులు తెలిపారు. బ్రౌన్ 2025 నవంబర్‌లో సముద్ర మార్గం ద్వారా భారత్‌లోకి ప్రవేశించి.. అప్పటి నుంచి గోవాలో నివసిస్తున్నట్లు గుర్తించామన్నారు. సరైన పత్రాలు లేకుండా భారత్‌లోకి ప్రవేశించినందుకు ఇమిగ్రేషన్ అధికారులు అతడిపై కేసు నమోదు చేశారు. విచారణలో అతడు బెంగళూరు, లఖ్‌నవూ, గోరఖ్‌పూర్‌లకు వెళ్లినట్లు తేలిందన్నారు. తాను కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో చదువుకున్నానని.. ఆరేళ్లపాటు అమెరికా సైన్యంలో పని చేశానని బ్రౌన్ వెల్లడించారు. రెండేళ్ల క్రితం సైన్యం నుంచి వైదొలిగానన్నారు. మూడేళ్ల క్రితం తాను ఇటలీ పర్యటనలో ఉన్న సమయంలో ఉత్తరాఖండ్‌కు చెందిన ఒక భారతీయ మహిళను కలిశానని.. 2024 అక్టోబర్‌లో ఆమెను వివాహం చేసుకున్నానని తెలిపారు. అనంతరం టూరిస్ట్ వీసాపై థాయ్‌లాండ్ వెళ్లానని.. అక్కడ పాస్‌పోర్టు పోవడంతో తాను సముద్ర మార్గంలో భారత్‌కు వచ్చినట్లు వెల్లడించారు. గోవాలో పరిచయమైన ఓ నేపాల్ వ్యక్తిని కలవడానికి ఆ దేశానికి వెళ్తున్నట్లు పేర్కొన్నారు. పాస్‌పోర్ట్ గురించి ప్రశ్నించగా బెంగళూరులోని ఓ పరిచయస్థుడి వద్ద ఉందని చెప్పారు. కొన్నాళ్ల క్రితం కోల్‌కతాలో అరెస్టైన మాథ్యూ వాన్‌డైక్ బృందం ఐరోపా నుంచి తెచ్చిన డ్రోన్లను ఈశాన్య భారతం గుండా మయన్మార్‌లోని తిరుగుబాటుదారుల గ్రూపులకు అందించినట్లు సమాచారం. ఇలా డ్రోన్లను దొంగ రవాణా చేయడం, వాటి కూర్పు, మరమ్మతులు, ఎలక్ట్రానిక్ యుద్ధరీతులలో మయన్మార్ తిరుగుబాటుదారులకు శిక్షణ ఇవ్వడం వాన్‌డైక్ బృందం పని అని నాడు రష్యా వెల్లడించింది.

# ఏసీబీ దూకుడు


## అవినీతిపరుల వెన్నులో వణుకు

### వరుస అక్రమాస్తుల కేసులతో ఉన్నతాధికారులపై ఉక్కుపాదం

### ఆరు నెలల్లోనే రికార్డు స్థాయిలో కేసులు..

### కోట్లాది రూపాయల ఆస్తులు వెలుగులోకి..

**జనంసాక్షి స్పెషల్ స్టోరీ**




***తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) గత కొన్ని నెలలుగా అవినీతిపై ఉక్కుపాదం మోపుతోంది. ముఖ్యంగా అక్రమాస్తుల కేసులపై ప్రత్యేక దృష్టి సారించిన ఏసీబీ, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులపై వరుస దాడులు నిర్వహిస్తూ అవినీతిపరుల్లో భయాందోళనలు కలిగిస్తోంది. ఇంజనీర్-ఇన్-చీఫ్‌లు, డిప్యూటీ కలెక్టర్లు, పోలీసు అధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారులు, హెచ్ఎండీఏ ఇంజనీర్లు వంటి ఉన్నతస్థాయి అధికారుల ఇళ్లలో సోదాలు నిర్వహించి భారీ స్థాయిలో ఆస్తులను గుర్తిస్తోంది.***

**హైదరాబాద్, జూలై 14 (జనంసాక్షి):**

2026 జనవరి నుంచి జూలై 10 వరకు ఏసీబీ 14 అక్రమాస్తుల (డిస్ప్రోపోర్షనేట్ అసెట్స్) కేసులు, 86 ట్రాప్ కేసులు నమోదు చేసినట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కేవలం ఆరు నెలల్లోనే గత ఏడాది నమోదైన కేసుల సంఖ్యకు సమీపంలోకి చేరుకోవడం ఏసీబీ దూకుడుకు నిదర్శనంగా నిలుస్తోంది.

ప్రాథమిక అంచనాల ప్రకారం ఇప్పటివరకు వెలుగులోకి వచ్చిన అక్రమాస్తుల విలువ రూ.83 కోట్లకు పైగా ఉండగా, వాటి ప్రస్తుత మార్కెట్ విలువ రూ.1,000 కోట్లకు చేరుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. నగదు, బంగారం, వెండి, విలాసవంతమైన భవనాలు, ఫ్లాట్లు, వ్యవసాయ భూములు, వాణిజ్య స్థలాలు, పెట్టుబడులకు సంబంధించిన పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు.

ఇటీవల వెలుగులోకి వచ్చిన ప్రధాన కేసుల్లో ఆర్ అండ్ బీ శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్ జే. మోహన్ నాయక్‌కు చెందిన సుమారు రూ.17.94 కోట్ల అక్రమాస్తులు గుర్తించగా, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్. నరహరి వద్ద రూ.30 కోట్లకు పైగా విలువైన ఆస్తులు బయటపడ్డాయి. డిప్యూటీ కలెక్టర్ మద్రి వంశీ మోహన్‌పై రెండుసార్లు దాడులు నిర్వహించి రూ.100 కోట్లకు పైగా విలువైన ఆస్తులను గుర్తించినట్లు ఏసీబీ వెల్లడించింది. సస్పెండ్ అయిన అదనపు ఎస్పీ నయినీ భుజంగరావు వద్ద రూ.5.92 కోట్ల అక్రమాస్తులు బయటపడగా, తాజాగా హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బీ. రవీందర్ నివాసంతో పాటు 12 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. ఇదే తరహాలో ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్‌కు సంబంధించిన అక్రమాస్తుల కేసులోనూ విస్తృత దాడులు కొనసాగుతున్నాయి.

కేవలం అక్రమాస్తుల కేసులకే పరిమితం కాకుండా, ఆర్టీఏ చెక్‌పోస్టులు, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు, రైస్ మిల్లులు తదితర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ అవినీతికి అడ్డుకట్ట వేయడానికి ఏసీబీ చర్యలు చేపడుతోంది. మరోవైపు లంచాలు డిమాండ్ చేసే అధికారులపై ప్రజలు ధైర్యంగా ఫిర్యాదులు చేయడం కూడా ట్రాప్ కేసుల పెరుగుదలకు కారణమవుతోంది.

ప్రభుత్వ శాఖల్లో అవినీతికి పాల్పడే అధికారులపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఏసీబీ స్పష్టం చేస్తుండగా, వరుస దాడులతో ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిపరుల్లో ఆందోళన నెలకొంది. అక్రమంగా సంపాదించిన ఆస్తులను వెలికితీసి చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో ఏసీబీ మరింత దూకుడుగా వ్యవహరిస్తోందని అధికారులు పేర్కొంటున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370